16-5Pg1exHMNWJQE.qxd:16-5Pg1exHMNWJQE.qxd 01/01/01 8:41 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-5-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 104 పేజీలు: 12 వెల: 6.50

భారత్‌లో ఐఫోన్ల తయారీ వద్దన్నా: ట్రంప్

భయంతోనే కులగణనకు మోడీ సై: రాహుల్ గాంధీ

9లో

# ఎవరు సుప్రీం?



## బిల్లుల ఆమోదంలో గవర్నర్లకు గడువుపై 'సుప్రీం' తీర్పును ప్రశ్నించిన రాష్ట్రపతి ముర్ము


### రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువును నిర్దేశించగలవా?

### రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద సంపూర్ణాధికారం ఎవరిది?

### కొత్త సిజెఐ జస్టిస్ గవాయ్ త్వరలోనే దీనిపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం

**న్యూఢిల్లీ, మే 15:** శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులు గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపనచేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్రజాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు ఇటీవల సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ అంశంలో గవర్నర్‌తోపాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. దీనిపై ప్రథమ పౌరురాలు అయిన ద్రౌపది ముర్ము స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పు ఎలాఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. రాజ్యాంగంలోని 143 అధికరణం కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకుని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లుతెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బిఆర్‌గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం >>2

# పోర్టుల అభివృద్ధితో ఆదాయం వృద్ధి



### త్వరలో కన్సల్టెన్సీల నియామకానికి టెండర్లు

### పోర్టులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

## ఓడ రేవులకు అనుసంధానంగా 8 పారిశ్రామిక నగరాలు

**విజయవాపడ,మే 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో విస్తారమైన కోస్టల్ తీరం ద్వారా రాష్ట్రంలో పోర్ట్ ఆధారిత ఎకానమీని సాధించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎపిలో 1000 కిలోమీటర్లకు పైగా ఉన్న సముద్ర తీరాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకొని మారిటైం ప్రాజెక్టులు నెలకొల్పుతామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంతాల్లో చేపట్టే ప్రాజెక్టులు, పోర్టులపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పోర్ట్స్, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖ సెక్రటరీ టికె రామచంద్రన్, మంత్రి బిసి జనార్దన్ రెడ్డితో పాటు పలువురు కేంద్ర రాష్ట్ర అధికారులతో చంద్రబాబు సమీక్షజరిపారు.

ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పోర్టులు, కొత్తగా నిర్మితవుతున్న పోర్టుల స్థితిగతులపై చర్చించారు. తీర ప్రాంతంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్ట్ లేదా ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే ఆలోచనతో తాము ఉన్నామని చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ అధికారులకు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో నెల్లూరు జిల్లాలో దుగరాజపట్నంలో పోర్ట్, ఆధారిత పరిశ్రమలఏర్పాటుకు నాడు కేంద్రం ప్రభుత్వం అంగీకరించిందని చంద్రబాబు గుర్తుచేశారు. కొత్త జిల్లా ఏర్పాటుతో తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చిన దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు అంశంపై వారితో చర్చించారు. ఇనిషియల్ ఫీజిబులిటీ రిపోర్ట్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2000ల ఎకరాల్లో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించారు. దుగరాజపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మతుల క్లస్టర్, గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్‌తో కలిపి అభివృద్ధి చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. నాలుగు డ్రై డాక్‌లు, అవుట్ ఫిటింగ్ జెట్టీలు, షిప్ లిఫ్ట్ సౌకర్యం కలిగిన నౌకా నిర్మాణ కేంద్రం ఇక్కడ వస్తుందన్నారు. షిప్ బిల్డింగ్ పరిశ్రమకు 1000 ఎకరాలు, అనుబంధ పరిశ్రమలకు మరో 1000 ఎకరాల భూమి అవసరం కానుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.3500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపడుతుందని దీంతో పాటు పరిశ్రమకు అనువైన ప్రాంతంగా దీన్ని తీర్చిదిద్దుతామని సిఎం తెలిపారు. ఆ తర్వాత స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయి సంస్థలను ఆహ్వానించి ఇక్కడ షిప్ బిల్డింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తద్వారా దాదాపు రూ.26,000ల కోట్ల పెట్టుబడులు వస్తాయని వెల్లడించారు. ప్రత్యక్షంగా 5000ల మందికి, పరోక్షంగా 30,000ల మందికి ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి చేకూరుతుందని సిఎం వివరించారు.

ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దీనికి అవసరమైన కార్యాచరణ వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. మరోవైపు రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ పోర్టులో మరింత చౌకగా సరుకు రవాణాకు అవకాశం కల్పించాలని చంద్రబాబు కేంద్ర అధికారులను కోరారు. అదే విధంగా రాష్ట్రంలో క్రూయిజ్ టూరిజం ప్రాజెక్టులకు ఉన్న అవకాశాలను అధికారులు సిఎంకు వివరించారు. ఈ విషయంపై స్పందించిన చంద్రబాబు పోలవరం, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో రివర్ క్రూయిజ్ సర్క్యూట్స్‌ను అభివృద్ధి చేసే అంశంపై అధ్యయనం చేయాలని వారికి సూచించారు. ఇక రాష్ట్రంలో ఓడరేవుల(పోర్టు) వెంట పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు మాస్టర్‌ప్లాన్ తయారుచేయించాలని ఎపి మారిటైం బోర్డు నిర్ణయించింది. మొత్తం >>2



## విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖల పునరుద్ధరణ

**తిరుమల,మే 15, ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి వేసివిసెలవుల్లో సిఫార్సు లేఖల స్వీకరణ పునరుద్ధరణ చేయడంతో తొలిరోజు గురువారం పరిమితంగానే లేఖలు అందినట్లు తెలుస్తోంది. శుక్రవారం శ్రీవారికి అభిషేకం సేవ జరగనుండటంతో సాధారణంగానే విఐపి బ్రేక్ దర్శనాలు కేవలం ప్రోటోకాల్ వారికే పరిమితం చేస్తారు. అయితే వేసవిసెలవుల్లో సామాన్యభక్తుల రద్దీ ఉంటుందనే కారణంతో ముందుగానే సిఫార్సులను రద్దుచేసిన విషయం విదితమే. సామాన్యభక్తుల సంఖ్యతగ్గడం, విఐపిల నుండి ఒత్తిడితో చివరకు టిటిడి పాలక >>2

## 3 రోజులు వర్ష సూచన

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రాబోయే మూడు రోజులుతేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారి తెలిపారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో అల్లూరి జిల్లా, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలో రాగల 24 గంటల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం వుందని హెచ్చరించారు. రాబోయే రెండురోజులూ ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాల్లో 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. రాబోయే ఐదు రోజులు రాష్ట్రంలో కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతల్లో చెప్పుకోదగ్గ మార్పులు ఉండవని, రాబోయే వారం రోజుల్లో ఉష్ణోగ్రతల్లో స్వల్ప తగ్గుదల కనిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

**సామర్లకోట మే 15 (ప్రభాతవార్త):** సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు అందజేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ సీటుకు పైభాగంలో ఉన్న దేశ నాయకులు చిత్రపటాలకు ఆమె గౌరవ వందనం చేశారు అనంతరం నాలుగు సంవత్సరాలు పాటు తను సేవలందించిన చైర్ పర్సన్ కుర్చీకి పూలమాలలు వేసి గౌరవంగా తన రాజీనామాను స్పష్టం చేశారు.

# జూన్ నుంచి 'తల్లికి వందనం'

### పెన్షన్లు పెంచి భారీగా ఇస్తున్నాం

### స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

### టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్



గురువారం రామరాజుపల్లెలో కార్యకర్తల సమావేశంలో మట్లాడుతున్న మంత్రి లోకేష్

**అనంతపురం, మే 15, ప్రభాతవార్త బ్యూరో :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని అలసత్వం వద్దని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేద్దామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. వచ్చే జూన్ నుంచి తల్లికి వందనం అమలు చేస్తామని, కార్యకర్తలకు ఇప్పుడు అండగా ఉంటామని మంత్రి లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని రామరాజుపల్లెలో గురువారం గుంతకల్లు నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నేతలతో మంత్రి నారా లోకేష్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పర్యటనలో ముందుగా కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తానని హామీ ఇచ్చాను. మాట నిలబెట్టుకునేందుకే మీ ముందుకువచ్చా. 2019 ఎన్నికల్లో మనం ఓటమి పాలయ్యాం. ఆనాడు అసెంబ్లీలో అమరావతి అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయ స్వామి, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ వైసీపీ దాష్టీకాలకు ఎదురొడ్డి నిలిచారు. అందుకే పార్టీ వారి రుణం తీర్చుకోవడం జరిగింది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94 శాత సీట్లతో విజయం సాధించాం. గెలిచినప్పుడు అందరూ చప్పట్లు కొడతారు. 2019-24 మధ్య మనం పడిన అవమానాలు మర్చిపోకూడదు. ఏ తప్పూ చేయని చంద్రబాబు గారిని 53 రోజుల పాటు జైల్లో అక్రమంగా నిర్బంధించారు. ఎన్నికల్లో ఎదురొడ్డి నిలిచిన అంజిరెడ్డి తాత, మంజులారెడ్డి, పల్నాడులో తోట చంద్రయ్యలే మనకు స్ఫూర్తి. కార్యకర్తలు, నాయకులపై అనేక అక్రమ కేసులు పెట్టారు. యువగళంలో నన్ను అనేక విధాలుగా అవమానించారు అని ఆయన ఆరోపించారు.

జగన్ రెడ్డి వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడానికి ఐదేళ్ల సమయం పట్టింది. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు అందిస్తున్నాం. దివ్యాంగులకు రూ.6వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు అందిస్తున్నాం. కోటి మందికి దీపం పథకంద్వారా గ్యాస్ సిలిండర్లు అందజేశాం. ఇప్పుడు నాలుగు నెలలకు ఒకసారి రూ.800 నేరుగా అకౌంట్‌లో జమచేస్తాం. జూన్ మాసంలో తల్లికి వందనం కార్యక్రమం అమలుచేస్తాం. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకువివరించాలి. మెగా డీఎస్సీ ద్వారా 16,247 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేస్తున్నాం. జూన్ మాసం నుంచి పరీక్షలు జరగనున్నాయి. డీఎస్సీ ఆపేందుకు వైసీపీ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. సమయం పెంచాలంటున్నారు. గతేడాది డిసెంబర్‌లోనే సిలబస్‌ను ప్రకటించడం >>2



గురువారం విజయవాడలో గురుకులాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇచ్చే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత

# అన్ని హాస్టళ్లకు ఇక సన్న బియ్యం

### విద్యార్థులకు పురస్కారోత్సవంలో మంత్రి సవిత

### కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థుల విజయభేరి

### 200 మందికి సర్టిఫికెట్లు, 22 మందికి నగదు పురస్కారాలు

**విజయవాడ,మే15,ప్రభాతవాక్తప్రతినిధి:** రాష్ట్రంలో బిసి విద్యార్థుల విద్య కోసం బలమైన పునాదులు వేయటం వల్లే నేటి పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత తెలిపారు. తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం ఏర్పాటు చేసిన పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన బీసీ హాస్టల్స్, మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన బిసి సంక్షేమ, మహాత్మ జ్యోతీబా పూలే గురుకులాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించటం గర్వించదగ్గ విషయన్నారు. విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టి వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇలాంటి మంచి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు >>2



గురువారం పొగాకుకు గిట్టుబాటుధర కల్పించాలని ఆందోళన చేస్తున్న రైతులు

# గిట్టుబాటు ధరకోసం ఆగిన పొగాకు వేలం

### రోడ్లపై బైఠాయించి రైతుల ధర్నా

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోనకపోతే ఉద్యమం ఉధృతం: వ్యవసాయ కార్మిక సంఘం నేత కెజి మస్తాన్

**కొండపి, మే 15, ప్రభాతవార్త:** కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నేతివారి పాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి బేళ్లను తీసుకొని వచ్చారు. వేలం ప్రారంభంనుంచి పొగాకు ధరలను తగ్గిస్తూ బయ్యర్లు కొనుగోలు చేశారు. మంచి గ్రేడ్ పొగాకును కూడా తక్కువ ధరకి కొనుగోలు జరపడంతో 17 బేళ్ల వేలం ముగిసిన తర్వాత రైతులు వేలాన్ని బహిష్కరించారు. పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని కిట్టుబాటు ధర కల్పించే వరకు వేలంలో పాల్గొనమని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్‌తో తేల్చి చెప్పారు. వ్యాపారులతో మాట్లాడి ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని ఒక రౌండ్ కొనుగోలు చేసే వరకు ధరలు చూడాలని రైతులను కోరాడు. రైతులు అందుకు ససేమేరా అన్నారు. అనంతరం రైతులు కొండపి టంగుటూరు రోడ్డులో ధర్నాకు దిగి ఆందోళన చేశారు.

వేలం నిర్వహణ అధికారి రైతుల పక్షాన నిలిచి వ్యాపారులతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కొనుగోలు ప్రారంభించాలని నినాదాలు చేశారు. రైతుల రోడ్డు మీద ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రైతుల వల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదని కొంచెం సేపటికి ధర్నా విరమించి రైతులు తమ >>2

# పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

### కూటమి ప్రభుత్వ పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి

### సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 6వ ఎస్ఐపిబి

### ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 35 వేల మందికి ఉద్యోగావకాశాలు

**విజయవాడ, మే 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.గతంలో ఉన్న విధానాలకు భిన్నంగా కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ మంచి ప్రయోజనకరంగా ఉందన్నారు.ఈ విధానంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుని వెను వెంటనే ప్రాజెక్టుల స్థాపనకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఇప్పటికే కొన్నిసంస్థలు శంకుస్థాపనలు కూడా నిర్వహించినట్లు వివరించారు... మరి కొన్ని కంపెనీలు పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామిక వేత్తలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయి. 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఇప్పటికి 6 సార్లు సమావేశం కాగా, 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. గురువారం సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి రూ. 33 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ**

ఎస్ఐపిబి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకువచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు.. ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలన్నారు.. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలో అప్ చేయాలి. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్ర స్థాయి పనుల స్థితి >>2

# ఎంబిబిఎస్ సీటు వివాదం: విద్యార్థినికి 7 లక్షల పరిహారం

### హైకోర్టు తీర్పులో జోక్యానికి సుప్రీం కోర్టు నిరాకరణ

**విజయవాడ, మే 15,ప్రభాతవార్తప్రతినిధి:** నీట్ కౌన్సిలింగ్-2022లో అర్హురాలైన విద్యార్థినికి ఎంబిబిఎస్ సీటును నిరాకరించినందుకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ ఎపి హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. విశ్వవిద్యాలయం దాఖలు చేసిన అప్పీల్లో తాము జోక్యం చేసుకునేందుకు కారణాలు కనిపించడం లేదని పేర్కొంది. న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్,జస్టిస్ రాజేష్ బిందల్‌తో >>2

16-5pg2exHMNWJQE.qxd:16-5pg2exHMNWJQE.qxd 01/01/01 8:43 AM Page 1





'మిస్ వరల్డ్' సుందరీ మణులు గురువారం యాదగిరి గుట్టను సందర్శించిన దృశ్యం

# ఎవరు సుప్రీం?

>> ఏర్పాటుచేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాజ్యాంగంలో రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను142వ అధికరణం కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీచేస్తుంది. సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా? రాష్ట్రపతి, గవర్నర్‌లకు కోర్టులు గడువు ఎలా నిర్దేశిస్తాయి. రాజ్యాంగంలోని 200వ అధికరణం కింద బిల్లును సమర్పించినపుడు గవర్నర్‌ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలు ఏమిటి? 201 అధికకరణం కింద రాష్ట్రపతి, 200కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా అని ప్రశ్నలువేసారు. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను ఆరాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్‌రవి ఆమోదించకుండా తనవద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ గరిష్టంగా మూడునెలల్లోగా ఆమోదించడమో లేక తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్రప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జతచేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యంచేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని గవర్నర్ల నిష్క్రియాపరత్వంపై న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపింది. రాజ్యాంగంలోని 142వ అధికరణంద్వారా అటువంటి సంపూర్ణ అధికారాలు సుప్రీంకోర్టు ఉందని జస్టిస్ జెబి పారీధవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతోకూడిన ధర్మాసనం తేల్చిచెప్పింది.

# అన్ని హాస్టళ్లకు ఇక సన్న బియ్యం

>> ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు రావలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అన్నారు. అందుకు అనుగుణంగా టీచర్లు, విద్యార్థులు కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు భావితరాల భవిష్యత్ కోసం పటిష్టమైన విద్యా వ్యవస్థ కోసం పునాదులు వేస్తున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణా పనులను శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తల్లికి వందనం క్రింద ప్రతి ఇంట్లో చదువుకునే ఆడబిడ్డకు జూన్ 15న రూ. 15,000 అందిస్తామని, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు బిసి సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు, తదితర మోలిక ఏర్పాట్లు చేసామన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీ హాస్టల్స్, మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాల్లో టాయిలెట్స్ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది పది, ఇంటర్ ఫలితాల్లో బీసీ గురుకులాలు, హాస్టల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచారన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందన లన్నారు. బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేసే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 109 గురుకులాల్లో 108 గురుకులాలు మా ప్రభుత్వ హయాంలో వచ్చినవేనన్నారు. ఆనాడు స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీలను విద్యా పరంగా ప్రోత్సహిస్తే అదే స్ఫూర్తిని ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మరిన్ని బిసి గురుకులాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.గత ప్రభుత్వం బిసి గురుకులాలు, హాస్టళ్లను మరమ్మ తులు చేయకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. వెనుకబడిన తరగతుల పిల్లలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అన్ని హాస్టల్స్ లో ఏపీఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు తీసుకుని భోజనం అందిస్తున్నామన్నారు. బిసి యువతకు సివిల్ సర్వీసులో శిక్షణతోపాటు, మెగా డీఎస్సీకి శిక్షణను అందిస్తున్నామన్నారు. విదేశీ విద్యా కూడా అందిస్తామన్నారు. ప్రపంచంలో ఎక్కడకి వెళ్లినా మహాత్మ జ్యోతిబా పూలే గురుకులాల్లో చదివామనే చెప్పుకునేందుకు గర్వంగా ఉండాలని, ఎంజేపీ గురుకులాల్లో చదివానని అందరూ గర్వంగా చెప్పుకునేలా విద్యాలయాలను తీర్చి దిద్దుతున్నామన్నారు. పిల్లలకు ఇష్టమైన రంగంలో తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ ను అవసరం మేరకే వినియోగించాలని ఎక్కువగా వినియోగించవద్దని.. ఆ సమయాన్ని విద్యపై కేటాయించి జీవితంలో ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు వినియోగించుకోవాలన్నారు. పాఠశాలలు తెరిచిన వెంటనే రాష్ట్రంలో అన్ని బిసి సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. విద్యా దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మన రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ త్యాగాలను మనందరం గుర్తుంచుకోవాలన్నారు. ముందుగా జ్యోతిబా పూలే, దేశ రక్షణకు ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్‌ల చిత్ర పటాలకు మంత్రి పూల మాలలు అర్పించారు. బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యన్నారాయణ మాట్లాడుతూ ఏ విద్యార్థి అయినా నిరంతరం శ్రమిస్తేనే ఉన్నతంగా తన జీవితంలో స్థిరపడతారన్నారు.

జీవితంలో తపనతోపాటు ఏదైనా సాధించాలనే లక్ష్యం ఉండాలని అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగల్గుతారన్నారు.ముగింపు సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ డి. చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఇదే ప్రతిభను నిరంతరం కొనసాగించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు, బిసి సంక్షేమ హాస్టల్స్ నుంచి 200 మందికి బ్యాగులు, సర్టిఫికెట్స్, మెమొంటోలు అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన 22 మందికి నగదు పురస్కారాలు అందించారు. ఇందులో 8 మంది బీసీ హాస్టల్స్ కు చెందినవారు కాగా 14 మంది ఎంజేపీ స్కూల్స్, కళాశాలలకు చెందినవారున్నారు.. ప్రథమ బహుమతి పొందిన 12 మందికి ఒక్కొక్కరికీ రూ. 20,000 చొప్పున, 7 మందికి ఒక్కొక్కరికీ రూ. 15,000 చొప్పున, ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ. 10,000 చొప్పున నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల డాక్టర్ ఏ. మల్లిఖార్జున్, మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాల సొసైటీ కార్యదర్శి పి. మాధవీలత, ఏ. కృష్ణ మోహన్, తదితరలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ పల్లెలతోనే స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధ్యం

**విజయవాడ మే 15,ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యర్థాల సమర్థ నిర్వహణతో రాష్ట్రం లోని అన్ని గ్రామాలను స్వచ్ఛంగా మలిచేలా కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ప్రతీరోజూ ఇళ్ల నుంచి చెత్తను సేకరించి తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చేలా, పొడి చెత్తను ఏజెన్సీలకు అప్పగించేలా చూడాలని చెప్పారు. ఇందుకు సంబంధించి ఏజెన్సీలను ఆహ్వానించేందుకు వచ్చే నెలలో టెండర్లు పిలవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే తడి చెత్తను ఎక్కడికక్కడ ఎరువుగా మార్చేలా డ్వాక్రా మహిళలకు బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. ప్రతి మండల హెడ్ క్వార్టర్‌లోనూ, అలాగే జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలో మొత్తం 52 క్లస్టర్లు ఏర్పాటు

### ఏజెన్సీలు 'పొడి చెత్త'ను సేకరించేలా త్వరలో టెండర్లు

చేసి...చెత్తను గ్రేడింగ్ చేసి దానిని కావాల్సిన ఏజెన్సీలకు విక్రయించడమో, లేదా అక్కడ నుంచి చెత్తను తరలించడమో చేయాలన్నారు. ఏ పంచాయతీలోనూ చెత్తను తీసుకువచ్చి రోడ్డుపై వేయడానికి వీల్లేదని చెప్పారు. సర్క్యులర్ ఎకానమీపై గురువారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించిన పంచాయతీలకు, వ్యక్తులకు అక్టోబర్ 2న అవార్డులు అందించాలని సూచించారు. 2026 అక్టోబర్ 2 కల్లా మొత్తం వ్యవస్థ గాడిలో పడాలన్నారు.

# ఆదాయం వృద్ధి

>> ఆరు పోర్టుల పరిధిలో 8 పారిశ్రామిక నగరాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు కన్సల్టెన్సీల ఎంపిక కోసం టెండర్లు పిలవనుంది. పారిశ్రామిక నగరాల్లో గోదాములు, లాజిస్టిక్ సదుపాయాలను అభివృద్ధి చేయడంద్వారా పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని చెబుతు న్నారు. విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం, మూలపేట పోర్టుల పరిధిలో క్లస్టర్లను అభివృద్ధి చేయాలని మారిటైం బోర్డు నిర్ణయించింది. ఓడరేవుల వెంట పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయటం ద్వారా పట్టణీకరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పోర్టు కార్యకలాపాలు పెరిగే కొద్దీ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు ప్రాజెక్టులను విస్తరించేందుకు వీలుగా ప్రణాళికలు ఉంటాయి. ఆ పరిధిలోని భూముల లభ్యత, ఇతర అంశాలపై కన్సల్టెన్సీ సంస్థలు నివేదికలు సమర్పిస్తాయి. చివరికి మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా క్లస్టర్లను నివాస ప్రాంతాలు, గోదాములు, ఆఫీస్ స్పేస్, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు అనుగుణంగా జోన్లుగా విభజించనున్నారు. వాటిని పి4 (పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పోర్టు కేంద్రంగా చేసుకుని 100 కిలోమీటర్ల పరిధిని ప్రాక్సిమల్ ఏరియాగా నిర్ణయించింది. అయితే పోర్టు నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో నగరాలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. అందులో క్లస్టర్ల అభివృద్ధికి వీలుగా ప్రణాళికలు, మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. ప్రాక్సిమల్ ఏరియాగా గుర్తించిన ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ఎక్కడెక్కడ ఏ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలనే దాన్ని కన్సల్టెన్సీలు ప్రతిపాదిస్తాయి. ఆ పరిధిలో భూముల లభ్యత, ఇతర అంశాలపై నివేదికలు సమర్పిస్తాయి. విశాఖపోర్టు ప్రాక్సిమల్ ఏరియాలో క్లస్టర్ అభివృద్ధి ప్రణాళికను ఏపీఐఐసీ తయారు చేయనుంది. మిగిలినచోట్ల మారిటైం బోర్డు ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# గిట్టుబాటు ధరకోసం ఆగిన పొగాకు వేలం

>> గ్రామాలకు తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మొదటి రౌండు పొగాకు వేలంలో ఎక్కువ ధర పలికినప్పుడు బోర్డు కేవలం రెండు బేళ్లకు మాత్రమే అనుమతి ఇచ్చిందని,ధరలు లేనప్పుడు ఐదు బేళ్లకు అనుమతినిచ్చిందని అన్నారు. వేలం ప్రారంభంలో కేజీ ధర రూ 240 పలికిన బేళ్ల ఈ రోజు కేవలం 210 రూపాయలు పలుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ ధరకు అమ్మితే కూలీలకు కూడా డబ్బులు సరిపోవని, తక్కువ ధరకు బేళ్ల అమ్ముకొని కూలీలకు కూడా డబ్బులు సరిపోక కూలీలకు సమాధానం చెప్పుకోలేని స్థితిలో రైతుల ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇవే ధరలు కొనసాగితే పొగాకు రైతు తీవ్ర అప్పులో ఊబిలో కూరుకుపోతారని వెంటనే అధికారులు ప్రభుత్వాలు స్పందించి మద్దతు ధర కల్పించే విధంగా రైతుల పక్షాన ఉండాలన్నారు.

**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు రైతులకు మద్దతు ధర ఇవ్వాలి..**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దిగివచ్చి పొగాకు రైతులకు మద్దతు ధర ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు.రైతుల పక్షాన నిలబడాల్సిన బోర్డు అధికారులు వ్యాపారులతో లోపాయ కారీ ఒప్పందం కుదుర్చుకొని రైతులను మోసం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్‌ద్వారా కొనుగోలుచేసి రైతులను ఏవిధంగా ఆదుకున్నారో, ఈ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.పొగాకు రైతులకు మద్దతు ధర కల్పించకపోతే రానున్న రోజులలో ఉద్యమాలని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

**గ్రామానికి వెళ్లి రైతులతో చర్చలు జరిపిన అధికారులు..**

వేలాన్ని బహిష్కరించి తమ గ్రామానికి వెళ్లిన రైతులతో వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్, కొండపి బోర్డు పొగాకు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య నేతివారిపాలెం రైతులతో చర్చించారు.పొగాకు మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా వ్యాపారులతో మాట్లాడి మంచి ధర పలికే విధంగా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తిరిగి వేలం కేంద్రానికి వచ్చారు. రైతులు తిరిగి రావడంతో వేలాన్ని ప్రారంభించారు.

పొగాకు ధరలు దారుణంగా పడిపోయాయి.మంచి గ్రేడ్ పొగాకు కూడా ధరలు దిగోస్తున్నాయి. ఇదే ధరలు కొనసాగితే కూలీలకు ఇవ్వడానికి కూడా డబ్బులు సరిపోవు.రైతుల నష్టపోకుండా పొగాకుకు మంచి ధర కల్పించాలి. వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.. కనీస మద్దతు ధర ఇవ్వడం లేదు. వేలం ప్రారంభంలో 240 పలికిన పొగాకు ఈరోజు 210 పలుకుతుంది.వేలం ప్రారంభంలో పలికిన ధరతో అయినా కొనుగోలు చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారు.

# సిఫార్సు లేఖల పునరుద్ధరణ

>> మండలి, అధికారులు ప్రత్యామ్నాయంగా ఆలోచన చేసి సిఫార్సులేఖలను పునరుద్దరించారు. 15వతేదీ గురువారం నుండి ఈ లేఖలు తిరిగి స్వీకరించి 16వతేదీ నుండి దర్శనాలు కల్పిస్తారు. అయితే శుక్రవారం రోజు కావడంతో పరిమితంగానే లేఖలు అనుమతించి వీలైనంత వరకు తక్కువమంది భక్తులకు విఐపి బ్రేక్ దర్శనాలు చేయించేందుకు చూస్తున్నారు.. కాగా వేసవిసెలవులు ముగిసేవరకు వారాంతం శుక్ర, శని, ఆదివారాల్లో సామాన్యభక్తుల రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉండటంతో ఆ మూడురోజులు సిఫార్సులేఖలు రద్దుచేసే ఆలోచనతో కూడా టిటిడి ఉంది. వేసవి సెలవుల రద్దీతో గురువారం సాయంత్రానికి సామాన్యభక్తుల రద్దీ మోస్తరుగాఉంది. వైకుంఠంలో 18కంపార్టుమెంట్లలో భక్తులు ఉన్నారు. వీరికి 8గంటలు దర్శనం సమయం కేటాయిస్తున్నారు. దీంతో తాత్కాలికంగా తిరిగి సిఫార్సు లేఖలు పునరుద్దరించడంతో గురువారం భక్తుల రద్దీకూడా పెరిగింది. సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిచ్చేలా నిర్ణయాలు ఉంటాయని కూడా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. కాగా బుధవారం రాత్రివరకు 74,020మంది భక్తులకు మహాలఘులో శ్రీవారి దర్శనం కల్పించారు. గురువారం సాయంత్రం 6గంటల వరకు 42వేలమంది భక్తులు దర్శనం చేయించారు. ఇప్పటికీ సాధారణంగా ఉన్న రద్దీ వారాంతం, వేసవిసెలవులు ముగింపుకు చేరుకునే సమయంలో విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.

## విజయవాడలో నేటి సాయంత్రం 'భారత్ శౌర్య త్రివర్ణ యాత్ర'

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నేడు తేదిసాయంత్రం 'భారత్ శౌర్య త్రివర్ణ యాత్ర' నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎన్డీఏ కూటమి నేతలు ర్యాలీలో పాల్గొననున్నారు. ఈ త్రివర్ణయాత్ర విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియం నుంచి ప్రారంభమై బెంజ్ సర్కిల్ వరకు కొనసాగుతుంది.ఆపరేషన్ సింధూరకు మద్దతుగా, దేశ సమగ్రత, జాతీయ సమైక్యతను ఆకాంక్షిస్తూ ఈ యాత్ర సాగుతుంది.

## తుర్కియేలో భూకంపం

**అంకారా, మే 15:** తుర్కియేలో భూప్రకంపనలు సంభవించాయి. కొన్యా ప్రావిన్స్‌లోని కులు జిల్లాకేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలోభూమికంపించింది. రిక్టర్ స్కేలుపై తీవ్రత 5.2గా నమోదయింది. రాజధాని అంకారాతోపాటు సమీప నగరాల్లోనుప్రకంపనలు వచ్చాయి. దీనితో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు భయంతో ఇళ్ల ఆఫీసులనుంచి బయటకు పరుగులుతీసారు. అయితేనష్టానికి సంబంధించి ఎటువంటిస మాచారం లేదని రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నా యని స్థానిక విపత్తునిర్వహణ విభాగం ఎఎఫ్ఎడి వెల్లడించారు.

## వారం - వర్జ్యం

తేది : 16-05-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
చవితి తె.5.13
మూల సా.4.05
వర్జ్యం రా.2.19-తె.4.01
దు.8.12-9.04, 2) మ.12.30-మ.1.22
శుభసమయం : ఉ.9.15-9.45, సా.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కొత్త, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు.

**వృషభం:** కుటుంబసభ్యులు సహాయ సహకారాలు అందిస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. పెట్టుబడులలో తొందరపాటు వద్దు. శ్రమ పెరుగుతుంది.

**కర్కాటకం :** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**సింహం:** పనులలో ఆటంకాలతో ఎదురై చికాకులు పెడతాయి. అనుకోని ఖర్చులు పెరుగుతాయి. మానసిక ఆందోళన.

**కన్య :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారంఅందుకుంటారు.

**తుల :** తండ్రి నుండి ఆస్తిలాభం పొందుతారు. బాకీలు వసూలవుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** కుటుంబసభ్యులలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. కష్టపడ్డా ఫలితం ఉండదు.

**ధనుస్సు:** ఆదాయం తగ్గుతుంది. ఉద్యోగా లలో స్వల్ప మార్పులు వుంటాయి. దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఊరట కలిగిస్తుంది.

**మకరం:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. నూతన వ్యక్తులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కుంభం:** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

**మీనం :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




గురువారం ఎపి ఇసెట్ ఫలితాలు విడుదల చేస్తున్న సెట్ చైర్మన్ సుదర్శన్‌రావు

# ఎపి ఇసెట్ ఫలితాలు విడుదల

## సత్తా చాటిన బాలురు, క్వాలిఫై అయిన 93.26శాతం విద్యార్థులు

**అనంతపురం సిటీ, మే 15 ప్రభాతవార్త:** ఎపి ఇ సెట్ 2025 ఫలితాలను గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ట్విట్టర్ ద్వారా విడుదల చేయగా, ఎపి ఇ సెట్ చైర్మన్, జెఎన్‌టియుఎ విసి సుదర్శన్‌రావు జెఎన్‌టియుఎలో అధికారికంగా విడుదల చేశారు. ఏపి ఇసెట్‌కు 34,228 మంది విద్యార్థులు హాజరు కాగా 31,922 మంది క్వాలిఫై కాగా, 93.26 శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయినట్లుచైర్మన్ సుదర్శన్‌రావు పేర్కొన్నారు. ఏపి ఈసెట్‌లో బాలురు అత్యధిక విభాగాలలో మొదటి ర్యాంక్‌లను సాధించారు. అగ్రికల్చర్, ఇంజినీరింగ్ విభాగంలో నళిని, బయోటెక్నాలజీలో దాసరి భవాని శంకర, సెరామిక్ టెక్నాలజీలో కార్తిక్, కెమికల్ ఇంజినీరింగ్‌లో శశాంక్, సివిల్ ఇంజినీరింగ్‌లో బాలరాజు, కంప్యూటీర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో శ్రీరామతేజ, ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో పద్మాకర్, ఎలక్ట్రానిక్, కమ్యునికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో రేవతి, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎస్టిమెంటేషన్ ఇంజినీరింగ్ విభాగంలో రాకేష్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో కార్తిక్, మెటలాజికల్ ఇంజినీరింగ్ విభాగంలో అభిషేక్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో బాలమహేష్, డిఎస్‌సి మేథమేటిక్స్‌లో గంగాభవాని, ఫార్మసీ విభాగంలో కీర్తిలు మొదటి ర్యాంకులు సాధించారు. పరీక్ష ఫలితాల కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, కన్వీనర్ దుర్గా ప్రసాద్, భానుమూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఆర్థర్ కాటన్‌కు సిఎం చంద్రబాబు నివాళి



**విజయవాడ,మే15ప్రభాతవార్తప్రతినిధి:** బ్రిటిష్ ఇరిగేషన్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నివాళులు అర్పించారు. ఈమేరకు సోషల్ మీడియా మాధ్యమం వేదికగా ట్వీట్ చేశారు. ఎన్నో సాగునీటి ప్రాజెక్టులను సర్ ఆర్థర్ కాటన్ నిర్మించారని చెప్పారు. కాలువలు నిర్మించి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి సర్ ఆర్థర్ కాటన్ కృషిచేశారని అన్నారు. ఆయన చేసిన సేవలను ఎవరూ మర్చిపోలేరని కొనియాడారు. ఒక వ్యక్తి తలచుకుంటే ఎన్ని అద్భుతాలు చేయొచ్చో కాటన్ మహాశయుడు రుజువు చేశారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# వేగంగా అడుగులు

>> గతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. తద్వారా ఏ ప్రాజెక్టు ఏస్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలి. ఎస్ఐపిబి సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు... ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రస్ వివరించాలి అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**50 వేల హోటల్ రూములు లక్ష్యం**

టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, రూముల కొరత ఉంది. పెద్దఎత్తున హుటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యమన్నారు.. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్ధం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా దేవాలయాలకు వచ్చే వారికి మంచి వసతి అనేది చాలా ముఖ్యం. కుటుంబాలతో వచ్చే వారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతారవణంలో ఉండాలి అనుకుంటారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. అదే విధంగా గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలి అని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామికరంగంపై మాట్లాడుతూ... వ్యవసాయ వ్యర్థాలను కొన్ని చోట్ల తగలబెడుతున్నారు... దీన్ని నివారించాల్సి ఉంది. చిన్నచిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్ట్‌ను సర్క్యులర్ ఎకానమీగా మార్చాలి. అగ్రికల్చర్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి అని సిఎం సూచించారు.

# విద్యార్థినికి 7 లక్షల పరిహారం

>> కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. మరోవైపు హైకోర్టు తీర్పును ఉదాహరణగా చూపి భవిష్యత్తులో ఇతరులెవరూ పరిహారం పొందడానికి వీల్లేదని స్పష్టం చేసింది.వైద్య విద్యలో ప్రవేశాల కోసం 2022లో నీట్ రాసిన నెల్లూరుకు చెందిన రేవూరు వెంకట ఆశ్రిత..ఎన్‌సిసి ఓపెన్ మహిళా కేటగిరీ కింద ఎంబిబిఎస్‌లో ప్రవేశానికి ధరఖాస్తు చేసుకున్నారు. ఎన్‌సిసిలో తనకంటే తక్కువ మెరిట్,నీట్‌లో తక్కువ మార్కులొచ్చిన మరో విద్యార్థినికి నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో సీటు కేటాయించడాన్ని హైకోర్టులో సవాల్ చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన హైకోర్టు...ఆశ్రిత కంటే తక్కువ మార్కులొచ్చిన విద్యార్థినికి సీటు కేటాయించడం చట్టవిరుద్ధమని ఈ ఏడాది ఫిబ్రవరి 20న తేల్చి చెప్పింది. వర్సిటీ అధికారుల చర్యలతో ఎంబిబిఎస్ సీటు కోల్పోయి డెంటల్ కోర్సులో చేరిన ఆశ్రితకు నష్టపరిహారం కింద రూ.7 లక్షలు చెల్లించాలని వైద్య విశ్వవిద్యాలయాన్ని ఆదేశిస్తూ తీరు ్ర చెప్పింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ మార్చి 6న ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం దాఖలు చేసిన పిటీషన్‌పై విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం...హైకోర్టులో జోక్యం చేసుకోవడానికేమీ లేదని స్పష్టం చేసింది.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సజ్జల భార్గవరెడ్డికి చుక్కెదురు

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిధిలో తనపై నమోదైన కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైకాంగ్రెస్‌పార్టీ నేత సజ్జల భార్గవ్ రెడ్డికి చుక్కెదురైంది. తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ సజ్జల భార్గవ్ రెడ్డి సుప్రీంకోర్టులో విచారణ దాఖలు చేశారు. భార్గవ్ పిటిషన్‌పై జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌తో కూడన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సీనియర్ న్యాయవాదులు ఎవరు అందుబాటులో లేని కారణంగా ఈ కేసు వాయిదా వేయాలని సుప్రీం ధర్మాసనాన్ని సజ్జల భార్గవ్ తరపు న్యాయవాది కోరారు. ఎస్సీ, ఎస్టీ కేసు కాబట్టి ట్రయల్ కోర్టుకే వెళ్లాల్సి ఉంటుందని సూచించింది. ఇక్కడ విచారణ కుదరదని తెల్చి చెప్పంది. ఈ నేపథ్యంలో సీనియర్ న్యాయవాది వాదనల కోసం ఈ కేసును వచ్చే వారానికి ధర్మాసనం వాయిదా వేసింది.

# జూన్ నుంచి 'తల్లికి వందనం'

>> జరిగింది. జగన్ రెడ్డికి అసలు సిలబస్ అంటే ఏంటో తెలియదు. స్థానికులకే పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. రూ.22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్నాం. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించేందుకు కూడా కష్టపడాల్సిన పరిస్థితి. కేంద్రం, చంద్రబాబు బ్రాండ్‌తో ప్రభుత్వాన్ని నడుపుకోగలగుతున్నాం. చంద్రబాబు బ్రాండ్‌తో పరిశ్రమలు వస్తున్నాయి. ఎన్నడూలేని విధంగా రూ.3,800 కోట్లతో హంద్రీనీవా ప్రాజెక్టు పనులు చేపట్టి పూర్తిచేయడం జరుగుతోంది. రాయలసీమ అభివృద్ధిపట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. అనంతలో రూ.22వేల కోట్లతో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ రాబోతోంది. మంత్రి నారా లోకేష్ విద్యాశాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నారు. టైం మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబుతో పోటీపడుతున్నారు. పనితీరు చాలా స్ట్రైట్ గా ఉంటుంది. నాయకుల కంటే కార్యకర్తలకే ఎక్కువ సమయం ఇస్తున్నారు. మరో 30 ఏళ్ల పాటు బలమైన నాయకత్వాన్ని తయారుచేసే పనిలో ఉన్నారని, ఇందుకు లోకేష్ గారికి మద్దతుగా నిలబడదామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జోనల్ కో ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర, గుంతకల్లు నియోజకవర్గ పరిశీలకుడు తిమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

GNT 16-5Pg3exHMNWJQEPV.qxd:16-5Pg3exHMNWJQEPV.qxd 01/01/01 9:02 AM Page 1



# పార్టీలో యువతను ప్రోత్సహిస్తాం

## జూన్ 1 నాటికి నామినేటెడ్ పదవులు పూర్తి: సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీలో యువరక్తాన్ని ప్రోత్సహించేలా నిర్ణయాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.జూన్ 12 నాటికి నామినేటెడ్ పదవులన్నీ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.మహానాడు ముందస్తు ఏర్పాట్లు దృష్ట్యా ఈ రోజు ఉదయం తన వ్యక్తిగత కార్యాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు,పార్టీ కీలక నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. లోకేశ్ నేతృత్వంలోని మంత్రులు, మహానాడు నిర్వహణ కమిటీ బాధ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనేక సవాళ్లు, సంక్షోభాలు ఎదుర్కొని అధికారంలోకి వచ్చామన్న సిఎం ఏడాది కాలంలో అనుకున్న దాని కంటే మెరుగైన పాలన అందించామని తెలిపారు. మహానాడులో పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చ జరగాలన్నారు. నాలుగు దశాబ్దాల ప్రయాణంలో పార్టీ సాధించిన విజయాలపైనా చర్చించాలన్నారు. మొదటి రోజు పార్టీ పరమైన అంశాలపై, రెండోరోజు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ఇచ్చిన సంక్షేమాలపై చర్చ జరగాలని తెలిపారు. మూడో రోజు లక్షలాది మందితో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అందరికీ అవగాహన కలిగించేలా తీర్మానాలు ఉండాలని సూచించారు. మహానాడుకొచ్చే ప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు వసతి, రవాణాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

తొలిసారి కడపలో నిర్వహిస్తున్న మహానాడు చరిత్రలో నిలిచిపోయేలా జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాయలసీమ ప్రజల గుండెల్లో పార్టీ బలంగా ఉందని దానికి కారణం తెలుగుదేశం ఆవిర్భావంతరువాత ఆ ప్రాంతంలో వచ్చిన మార్పులేనని అభిప్రాయపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్‌ను అంతం చేసిన చరిత్ర టిడిపిదేనని స్పష్టం చేశారు. రాయలసీమకు సాగునీరు ఇవ్వడం ద్వారా అక్కడి స్థితిగతులు మార్చాలని మొదట ఎన్టీఆర్ సంకల్పం చేశారన్నారు.

హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగు గంగ, ముచ్చుమర్రి లిఫ్ట్ వంటి ప్రాజెక్టులు టిడిపి హయాంలో చేపట్టినవేనని గుర్తు చేశారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రాయలసీమలో కరవుకు సమాధానం చెప్పామని తెలిపారు. రాజకీయ సుపరిపాలన దిశగా కూటమి పాలన సాగుతుందన్నారు, అది కడపలో జరిగే మహానాడు వేదికగా ప్రతిబింబించాలన్నారు. రాయలసీమకు సాగునీళ్లిచ్చి ఫ్యాక్షనిజాన్ని అంతం చేసిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు.రాయలసీమకు సాగునీరు ఇవ్వడం ద్వారా అక్కడి స్థితిగతులు మార్చాలని మొదట ఎన్టీఆర్ సంకల్పం చేశారన్నారు. హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగు గంగ, ముచ్చుమర్రి లిఫ్ట్ వంటి ప్రాజెక్టులు టిడిపి హయాంలో చేపట్టినవేనని గుర్తు చేశారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రాయలసీమలో కరవుకు సమాధానం చెప్పామని తెలిపారు.

నేడు డ్రిప్ లేని ప్రాంతాన్ని రాయలసీమలో మనం చూడగలమా అని అన్నారు. 2014 తరువాత టిడిపి పాలనలో 12 వేల కోట్లకు పైగా నిధులను రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు పెట్టి గొప్ప ఫలితాలు సాధించామన్నారు.

కరవు సీమను సస్యశ్యామలం చేస్తూనే పారిశ్రామికీకరణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కడప జిల్లా కొప్పర్తిలో పారిశ్రామిక హబ్, కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్, అనంతపురం జిల్లాలో కియా, విండ్ పవర్, సోలార్ ద్వారా ప్రగతిని వేగవంతం చేశామన్నారు. కడప, కర్నూలు ఎయిర్ పోర్టు నిర్మించింది కూడా తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తుచేశారు. హార్టికల్చర్ ద్వారావచ్చే మార్పులతో రాయలసీమ ప్రజలు కోనసీమ రైతులను అధిగమిస్తారని అభిప్రాయపడ్డారు.


## సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

### 26 వరకు నిర్వహణ



**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:**సరస్వతి నది పుష్కరాలు గురువారం నుంచి 26 వరకు జరగనున్న నేపథ్యంలో కాళేశ్వరం, త్రివేణి సంగమ యాత్రకు విజయవాడ నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై దానం ఓ ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.1999, ఇంద్ర ఏసీ బస్సులో రూ.2599 టికెట్ ధరగా నిర్ణయించారు. ఇవి బస్సు ఛార్జీలు మాత్రమేనని, భోజనం, ఇతర వసతులు భక్తులే చూసుకోవాలన్నారు. భక్తులు తమ సీట్లను ఆన్‌లైన్‌లో సమీప బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ అధీకృత టికెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద బుక్ చేసుకోవచ్చన్నారు.

ఈ బస్సులు 16న రాత్రి 10 గంటలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో బయలుదేరి ఖమ్మం, వరంగల్, భూపాలపల్లి మీదుగా మరుసటి రోజు ఉదయం 5 గంటలకు కాళేశ్వరం చేరుకుంటాయి. భక్తులు పుష్కర స్నానం చేశాక, ముక్తేశ్వర స్వామి దర్శనం అనంతరం ధర్మపురిలోని లక్ష్మీనరసింహస్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి, వేములవాడ రాజన్న ఆలయాలను దర్శించుకొని రాత్రి అక్కడే బస చేయాలి. మూడో రోజు ఉదయం వరంగల్‌లోని భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయ సందర్శన తర్వాత నాలుగో రోజు ఉదయం విజయవాడకు చేరుకుంటాయి. వివరాలకు 80742 98487, 93903 98475 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో నేటి (గురువారం) నుంచి సరస్వతి నది పుష్కరాలు ప్రారంభమయ్యాయి. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు వస్తున్నాయి. నిన్నరాత్రి 10.35 గంటలకే గురువు మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమయినప్పటికీ గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు.గురువారం నుంచి సరస్వతి నదికి పుష్కరాలు ప్రారంభం అయ్యాయి.



గురువారం సిఎంను కలిసిన జైరాజ్ ఇస్పాత్ ప్రతినిధులు

## సిఎంను కలిసిన జైరాజ్ ఇస్పాత్ ప్రతినిధులు

### ఉక్కు పరిశ్రమ ప్రారంభంపై చర్చ

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లాలో అత్యాధునిక ఉక్కు తయారీ పరిశ్రమ ప్రారంభం గురించి సిఎం చంద్రబాబుతో జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ యాజమాన్యం చర్చించింది. ఆ సంస్థ వ్యవస్థాపకుడు,ఎండీ ఎస్‌కె గోయెంకా,సీనియర్ మేనేజ్‌మెంట్ బృందం సిఎంను కలిసింది. దక్షిణ భారతదేశంలో ప్రముఖ ఉక్కు తయారీ కంపెనీల్లో ఒకటిగా జైరాజ్‌కు గుర్తింపు ఉంది. నాణ్యమైన టిఎంటి బార్‌లు, స్ట్రక్చరల్ స్టీల్ ఉత్పత్తులు చేస్తున్నాం.రాష్ట్ర పారిశ్రామిక వృద్ధి,ఉపాధి కల్పనకు కంపెనీ మద్దతుగా ఉంటుంది అని సిఎం జైరాజ్ బృందం తెలిపింది.

## మహిళలకు ఆత్మస్థైర్యం కలిగించడమే లక్ష్యం

### బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి మీనాక్షి లేఖి



ప్రసంగిస్తున్నకేంద్ర మాజీమంత్రి మీనాక్షి లేఖి

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఆత్మస్ధయిర్యాన్ని కలిగించడం,వారి మనోభావాలను గుర్తించి సామాజికంగా అండగా నిలవాలన్నదే భారతీయ జనతా పార్టీ కీలక లక్ష్యమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు కేంద్ర మాజీ మంత్రి మీనాక్షి లేఖీ తెలిపారు.పరిపాలన, స్వతంత్ర వారికి ప్రధాని నరేంద్రమోడీ కల్పిస్తారన్నారు.ఢిల్లీలాంటి కీలక రాష్ట్రాలకు సమర్ధవంతమైన మహిళా ముఖ్యమంత్రిని తమ పార్టీ నియమించిందన్నారు.అన్నింటికి మించి అపార మెధో సంపత్తి ఉన్న ద్రౌపది ముర్ము ఈ దేశ రాష్ట్రపతిగా నియమించిందన్నారు.భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యాలయం లో అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకలు ఏర్పాటుకు వర్క్ షాప్ బిజెపి రాష్ట్ర చీఫ్ దగ్గుబాటి పురంధేశ్వరి అధ్యక్షతన జరిగిందిఅహల్యా భాయి పై పిపిటి ని మీనాక్షి లేఖీ వివరించారు 30సంవత్సరాల పరిపాలనలో అహల్య భాయి ఆలోచనలతో వికసిత్ రాష్ట్రంగా తీర్చి దిద్దారనీ, వికసిత్ రాష్ట్రం గా ఉండాలనే ఆలోచనలతో 200 సంవత్సరాల క్రితమే అహల్య భాయి ముందు చూపు తో పరిపాలించారనీ, అహల్య భాయి ఒక మహిళగా సమాజం కోసం ఎంతగానో కృషి చేసారనీ పేర్కొన్నారు. బిజెపి ఎపి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆర్థిక శక్తిగా భారత దేశాన్ని తీసుకెళ్లాలంటే మౌలిక సదుపాయాలు సమాకుర్చుకోవాలి అలాంటి ఆలోచనలు ఆనాడు అహల్య భాయి అలోచించి వాటిని అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేసారనీ పేర్కొన్నారు. పరిశ్రమలు పెట్టుబడులు రావాలంటే ఇలాంటి మోలిక సదుపాయాలు ఎంత అవసరమో గమనించి వాటి పై ఆనాడే దృష్టి పెట్టారుమహిళలు అభివృద్ధి, వారి సంక్షేమం కోసం చట్టసవరణలు చేసారు భర్తలు చనిపోయిన మహిళలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భర్త ఆస్తి ఆ భార్య కి హక్కు ఉంటుందని చట్టసవరణ చేసి మార్పులు తీసుకొచ్చారనీ అన్నారు. బ్రిటిష్ గవర్నర్ రచించిన బుక్ లో అహల్య భాయి గురించి ఒక వాక్యం చెప్పారనీ, నుంచి భువి కేగిన దైవాంశ సంభూతురాలని పేర్కొన్నారు. అహల్య భాయి అతి చిన్న వయసుల్లోనే పీశ్వా లు వెళ్తుంటే పరికిణి ని పూర్తిగా పరిచి మట్టితో చేసిన శివుడి ప్రతిమని కాపాడటానికి నిలబడ్డారుపీశ్వాలు వస్తే అందరు లోపలికి వెళ్ళిపోతే అహల్య భాయి మాత్రం ఎంతో ధైర్య సాహసం ప్రదర్శించి తాను నిర్మించిన వాటికోసం నిలబడ్డారు. 30సంవత్సరాల పరిపాలనలో ఎటువంటి యుద్దాలు చేయకుండా పీశ్వా లాంటి వారి హృదయాలని గెలుచుకున్న మహిళగా పేరు తెచ్చుకున్నారు. దేశ వ్యాప్తంగా అహల్య భాయి ప్రభావం ఎంతగానో ఉండేది. బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ట శివన్ నారాయణ, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిషోర్ ప్రభృతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రెండవ రోజు సిట్ విచారణకు హాజరైన ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి

**విజయవాడ, మే 15:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి గురువారం రెండో రోజు సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. నిన్నటి విచారణలో ఇద్దరిని వివిధ రూపాలలో సిట్ ప్రశ్నించింది. అయితే సరైన సమాధానాలు చెప్పకపోవడంతో ఈరోజు మరోసారి విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఉదయం 10 గంటలకు ధనుంజయ్, కృష్ణ మోహన్ రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. అయితే మద్యం కుంభకోణంలో తమ పాత్ర లేదని వారు చెబుతుండగా ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని సిట్ అధికారుల మాట. ఈరోజు విచారణలో సిట్ అధికారులకు వారు నిన్నటి మాదిరిగానే తమకేమి తెలియదని వెల్లడించినట్లు సమాచారం. ఇక మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా రెండు రోజుల క్రితం ఈ కేసులో ఏ33గా ఉన్న గోవిందప్ప బాలాజీని మైసూర్‌లో సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించి విచారించారు. ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. గోవిందప్పకు ఈనెల 20 వరకు రిమాండ్ విధించడంతో వెంటనే జైలుకు తరలించారు. అంతేకాకుండా గోవిందప్ప రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడించింది సిట్. గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో బాలాజీ గోవిందప్ప కీలక పాత్ర పోషించారని, జగన్ కుటుంబానికి సన్నిహితంగా ఉండే వ్యక్తి కాబట్టే ఈ స్కాంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు రిమాండ్ రిపోర్టులో తెలిపారు. మద్యం కంపెనీల నుంచి వచ్చిన ముడుపులతో బాలాజీ వ్యక్తిగతంగా లబ్ధి పొందారని భారీగా స్థిరాస్తులు సంపాదించినట్లు సిట్ వెల్లడించింది. ఈ కేసులో మరింత సమాచారం తెలుసుకోవాల్సి ఉన్నందున బాలాజీ గోవిందప్పను కస్టడీకి ఇవ్వాలని కోర్టును సిట్ అభ్యర్థించింది. ప్రస్తుతం గోవిందప్ప రిమాండ్ ఖైదుగా ఉన్నారు.

## అగ్గిపెట్టెలో పట్టుచీరె

### కనకదుర్గమ్మకు బహూకరించిన సిరిసిల్ల చేనేత కళాకారుడు



అగ్గిపెట్టెలో సమకూర్చిన అమ్మవారి పట్టుచీరను ప్రదర్శిస్తున్న నల్ల విజయ్‌కుమార్

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** బెజవాడ శ్రీ కనక దుర్గమ్మవారికి చేనేత కార్మికులైన భక్తులు అగ్గిపెట్టెలో పట్టు చీర సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల వాస్తవ్యుడైన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ వారితండ్రి నల్ల పరంధాములు వారసత్వానికి పునికిపుచ్చుకొని చేనేత కళారంగంలో అగ్గిపెట్టలో చీరమరియు శాలువను, కుట్టు లేకుండా లాల్చిపైజామా మరియు జాతీయ జెండాను అంతేకాకుండా మూడు కొంగుల చీరను మరియు ఊసరవెల్లిలా రంగులు మార్చే చీర మరియు సుగంధ ద్రవ్యాల సువాసన వచ్చే చీర, దబ్బనంలో దూరిపోయే చీర, బంగారం, వెండి చీరలు రూపొందించిన అద్భుతమైన కళాకారుడు. ఈ చేనేత కుటుంబం ప్రతి రెండేళ్లకోసారి వారి ఇంటి ఇలవేల్పు అయిన శ్రీ కనక దుర్గ అమ్మవారు ఆశీర్వచన కోసం రావడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు చీర తయారుచేసి అమ్మవారికి అందించడం జరిగినది. చీర బరువు100 గ్రాములు, దీని పొడవు ఐదున్నర మీటర్లు మరియు వెడల్పు 48 ఇంచులు. దీనిని పూర్తిగా పట్టు దారాలతో మరియు గోల్డ్‌జరి వాడడం జరిగిందని, దీనిని తయారు చేయడానికి సమయం సుమారుగా ఐదు రోజులుపట్టిందని నల్ల విజయ్‌కుమార్ తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్ వీరినిఅభినందించి, అమ్మవారి ప్రసాదములను అందించారు.

## దుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి అనిత



హోంమంత్రి అనితకు అమ్మవారి శేషవస్త్రాన్ని అందజేస్తున్న ఇఒ శీనా నాయక్

**విజయవాడ, మే, 15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. జగన్మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుటుంబ సభ్యులతో కలిసి పట్టుచీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హోంమంత్రి అనితకు వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ నూతన ఈవో శీనా నాయక్ అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం చిత్రపటం అందజేశారు. ఆలయం క్యూలైన్లలో భక్తులను ఆత్మీయంగా పలకరించి అమ్మ సన్నిధిలో వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.అమ్మవారి దర్శనం అనంతరం హెంమంత్రి అనిత వెలగపూడి సచివాలయానికి వెళ్లారు. అక్కడ ప్రజలను కలిసి వారి గ్రీవెన్స్ స్వీకరించారు. అనంతరం 2వ బ్లాక్ లోని గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న హెంశాఖ కార్యాలయాన్ని హోంమంత్రి అనిత ఆకస్మికంగా పరిశీలించారు. ఫైళ్లు, రికార్డులను గురించి అడిగి తెలుసుకున్నారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్‌విశ్వజిత్‌తో కలిసి సిబ్బందిని పలకరిస్తూ హోంశాఖకు వచ్చే గ్రీవెన్స్ త్వరితగతిన పూర్తి చేయడానికి ఆదేశాలు ఇచ్చారు.

## విశాఖలో జూన్ 21న 'యోగా' వేడుకలు

### హాజరుకానున్న ప్రధాని, ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

**విజయవాడ మే 15 ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలుజరగనున్నాయి. ఈ వేడుకలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సంబంధిత శాఖల అధికారులతో ప్రాథమికంగా సమీక్ష నిర్వమించారు. ప్రధాన మంత్రి మోడి సూచనలతో 2014 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించగా జూన్ 2015 జూన్ 21వ తేదీని మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రధాని మోడి చేతుల మీదుగా ప్రారంభించగా ఒకే వేదికపై 35985 మంది యోగాసనాలు చేసి రెండు గిన్నిస్ రికార్డులు సాధించడం జరిగింది. ఇప్పటి వరకు 10 అంతర్జాతీయ యోగా దినోత్సవాలు నిర్వహించుకోవడమైంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
సుమారు రూ.34.80 లక్షల విలువ గల 1 (ఒక) పనికి నిట్ నెం. 1/EE/R&B/GNT/2025-26, తేది: 09.05.2025 ద్వారా టెండర్లు ఆహ్వానింపబడుచున్నవి. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in నందు చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 27.05.2025, మ.3.30గం.ల వరకు.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజను, గుంటూరు.
DIPR.NO. 16384/CL/ADVT/1/1/2022-23 తేది: 15.05.2025

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.
No.GNT.MD/438/ఇన్వెస్టిగేషన్‌లు ఫెసిలిటీస్/25-27 తేది: 09.05.2025
ఆసక్తి యొక్క వ్యక్తీకరణ
భారత రాష్ట్రపతి తరపున చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, డివిజనల్ రైల్వే హాస్పిటల్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరువారు గుంటూరు నగర పరిధిలోని పేరొందిన డయాగ్నొస్టిక్ లేబొరటీరీల నుండి 2 సంవత్సరాల కాలానికి రైల్వే లబ్దిదారులకు మెడికల్ ఇన్వెస్టిగేషన్‌ల నిమిత్తం నగదు రహిత సౌకర్యాల ఏర్పాటుకు, రైల్వేతో జాబితా చేర్పుకు CGHS/హైదరాబాద్ టారిఫ్ రేట్‌ల వద్ద, పాథోలజీ మరియు రేడియోలజీ, CT మరియు MRT స్కాన్ కలుపుకొని క్లినికల్ ఇన్వెస్టిగేషన్‌ల వంటి సర్వీస్‌ల కొరకు అవసరమైన కనీస అర్హతా ప్రమాణం నెరవేర్చగలిగే వారి నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతున్నారు. అన్ని విధాలా పూర్తి చేసిన దరఖాస్తు ఫారం, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో 09.06.2025న లేదా ముందు దాఖలు చేయవలెను. కనీస అర్హతా ప్రమాణం, దరఖాస్తు ఫారాలు, నియమాలు మరియు నిబంధనలు వగైరాల సంబంధిత వివరాల కొరకు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in దయచేసి వీక్షించండి. దరఖాస్తుఫారం ఏ పని రోజు అయినా చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ రైల్వే హాస్పిటల్, గుంటూరు కార్యాలయం నుండి స్వయంగా కూడా పొందవచ్చును.
టైమ్ లైన్
1. ఆసక్తి వ్యక్తీకరణ (EOI) యొక్క జారీ :-
2. స్థలం - CMS కార్యాలయం రైల్వే ఆసుపత్రి, గుంటూరు
3. ప్రతిపాదన దాఖలుకు చివరి తేదీ : 09.06.2025 సమయం - 13.00గం.
4. ప్రతిపాదన తెరచు తేది : 09.06.2025 సమయం 15.30గం.
చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్,
డివిజనల్ రైల్వే హాస్పిటల్, గుంటూరు.
A0686

## ఎట్టకేలకు రైల్వే బడ్జెట్ నిధుల రైలు వచ్చేసింది

### విశాఖ రైల్వే జోన్‌కు ఐదేళ్ల క్రితం నాటి పాతనిధులతోనే సరి



**గుంతకల్లు రైల్వే,మే 15,ప్రభాతవార్త:** రైల్వే అధికార యంత్రాంగం నాలుగు మాసాలుగా ఎదురుచూస్తున్న రైల్వే బడ్జెట్ నిధుల రైలు ఎట్టకేలకు వచ్చేసింది. తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రస్తుత 2025-26ఆర్థిక సంవత్సరంలో రైల్వే శాఖ పాత పింక్ బుక్ విధానానికి బదులు ప్రస్తుత ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేకంగా రూపొందించిన కంసాలిటేడ్ బడ్జెట్ స్టేట్‌మెంట్ లో మంజూరు చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో సమర్పించిన బడ్జెట్ రైల్వే శాఖకు నిధులు కేటాయించిన విషయం పాఠకులకు విధితమే. అయితే ప్రతి ఏటా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన వారంలోపు ఆయా ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కేటాయించే నిధుల విడుదలకు సంబంధించి పింక్ బుక్‌లో పొందుపరిచి నిధులను కేటాయించే వారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమై నెలన్నర అయ్యింది. అయినా బడ్జెట్ కేటాయింపులు కాకపోతే పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని రైల్వే అధికార వర్గాలు తర్జన భర్జనలు పడుతున్న సమయంలో రైల్వే శాఖ నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న విశాఖ రైల్వేజోన్‌కు 2020-21బడ్జెట్‌లో కేటాయించిన రూ.170కోట్లు తప్ప తాజా బడ్జెట్‌లో విశాఖ రైల్వేజోన్ ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. ఆయా రైల్వే జోన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన పిమ్మట సమీక్షించి రైల్వే శాఖ తెలుగు రాష్ట్రాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకై,ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను కన్సాలిడేటెడ్ బడ్జెట్ స్టేట్‌మెంట్(సిబిఎస్) పేరుతో కేటాయించిన నిధుల వివరాలు ఇలా వున్నాయి. తుది భూసేకరణ సర్వే నిర్వహించిన ప్రాజెక్టులు మొత్తం 111, సర్వే నిర్వహించిన ప్రాజెక్టులు-37 ప్రాజెక్టులు, విద్యుద్దీ కరణ ప్రాజెక్టులు-159, నూతన రైలు మార్గాలు-05, డబ్లింగ్ రైలు మార్గాలు-07, సిగ్నల్, టెలికాం ప్రాజెక్టులు, రైల్వే భద్రతా ప్రాజెక్టుల నిర్మాణం, రైలు మార్గాల పటిష్టత పనులు, మౌలిక సదుపాయాల కల్పన, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిర్వహణ వంటి అనేక ప్రాజెక్టుల నిర్మాణాలకు రైల్వే శాఖ నిధులు మంజూరు చేసింది.

## లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేటీవ్ కమిటీ చైర్మన్‌గా ఎంపీ బాలశౌరి

### వరుసగా నాలుగోసారి ఎంపిక



**విజయవాడ, మే15,ప్రభాతవార్త ప్రతినిధి:** లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ గా జనసేన లోక్‌సభా పక్షనాయకులు వల్లభనేని బాలశౌరి ఎంపికయ్యారు. ఈ కమిటీకి ఆయన చైర్మన్‌గా ఎన్నిక కావడం వరుసగా ఇది నాలుగోసారి.15 మందితో కూడిన ఈ కమిటీలో సభ్యులుగా తెలంగాణకు చెందిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు (భాజపా), కార్తి పి.చిదంబరం, ఎ.రాజా, మహువా మొయిత్రా తదితరులు సభ్యులుగా వ్యవహరించనున్నారు. 1953లో ఏర్పాటైన ఈ కమిటీ ప్రభుత్వం జారీ చేసే రూల్స్,సబ్‌రూల్స్, బైలాస్,రెగ్యులేషన్స్, బిల్లులను పరిశీలించి అవి రాజ్యాంగ పరిధిలోనే ఉన్నాయా లేదా అనే అంశంపై సభకు నివేదిక సమర్పిస్తుంది. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఉత్తర్వును పూర్తిగా కానీ,పాక్షికంగా కాని రద్దు చేయాలని పించినా, సవరించాలని భావించినా ఈ కమిటీ అందుకు కారణాలను వివరిస్తూ సభకు నివేదిక సమర్పిస్తుంది.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ - విశాఖపట్నం
గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్, 31-31-21, సాయిబాబా వీధి, నారాయణ భవన్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530 020.
ఓ.ఎ.నెం.287/2025
డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రక్రియ) రూల్స్, 1993 యొక్క సబ్-రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 లోని సబ్ సెక్షన్ (4) ప్రకారం సమన్లు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గణపవరం), ప్రాతినిధ్యం వహించువారు మేనేజర్ & అధీకృత సంతకందారు ... దరఖాస్తుదారు
మరియు
శ్రీ గొట్టిపాటి వెంకటరావు, తండ్రి: రోశయ్య
టు,
1. శ్రీ గొట్టిపాటి వెంకటరావు, తండ్రి: రోశయ్య, డి.నెం. 7-6-233, 1వ లైను, వసంతరాయపురం, గుంటూరు జిల్లా-522002. ... ప్రతివాదులు
పేపరు ప్రచురణ ద్వారా ప్రతివాదులకు సమన్లు
గౌరవనీయ ప్రిసీడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ వారి సమక్షమున ఓ.ఎ.నెం.287/2025, తేది.21-05- 2025న జాబితా (లిస్టెడ్) చేయుటమైనది.
రుణం రూ.42,22,648.13 పై వసూలు కొరకు మీ పైన వేసిన దావా (ఓ.ఎ) ననుసరించి, చట్టం యొక్క 19(4) సెక్షన్ క్రింద సదరు దరఖాస్తు పైన గౌరవనీయ ట్రిబ్యునల్ సమన్లు / నోటీసు జారీ (దరఖాస్తు డాక్యుమెంట్లు కాపీలు వగైరాతో మా సమక్షమున అందచేయబడతాయి) చేయబడినది.
చట్టం యొక్క 19వ సెక్షన్ (4) వ సబ్-సెక్షన్ తదనుగుణంగా, మీరు, ప్రతివాదులు ఈ క్రింది అంశాలు గమనించవలెను:
1) సమన్లు జారీ చేసిన 30 రోజులలోగా కోరిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపాలి.
2) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన ఎస్సెట్స్ లేదా ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు మరియు ఎస్సెట్స్ వివరాలను వెల్లడించాలి.
3) ఆస్తులు ఎటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉన్నందున, సెక్యూర్డ్ ఎస్సెట్స్ లేదా అటువంటి ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన వాటితో లావాదేవీలు చేయుట లేదా విక్రయించుట నుండి మిమ్మల్ని నిరోధించడమైనది.
4) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన లేదా బహిరంగ పరచిన సెక్యూర్డ్‌గా ఇచ్చిన ఎస్సెట్స్ మరియు / లేదా ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు పైన మీరు సాధారణ వ్యాపారం మినహా, వాటిని ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా విక్రయించుట, లీజు లేదా ఇతరత్రా లావాదేవీల ద్వారా మీరు బదిలీచేయ వీలులేదు.
5) సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు అమ్మకం ద్వారా వచ్చిన అదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అట్టి విక్రయ ఆదాయాన్ని సదరు ఆస్తులు సెక్యూరిటీ ఇంటరెస్ట్ కలిగియున్న బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థలు నందు నిర్వహిస్తున్న ఖాతా నందు జమ చేయవలెను.
ఇందుకు సంబంధించి లిఖిత స్టేట్‌మెంట్‌ను దాని కాపీని దరఖాస్తుదారునికి దాఖలు చేస్తూ తేది.21-05-2025న ఉదయం 10.30 గంటలకు ప్రిసైడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమక్షంనకు హాజరు కావలసినదిగా కూడా మీకు సూచించడమైనది అట్లు చేయనిచో దరఖాస్తు మీ పరోక్షమున విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుంది.
(ఇది నా స్వహస్తాలతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో 14 మే, 2025న ఇవ్వడమైనది)
సం/- అధీకృత అధికారి వారి సంతకం
సమన్లు జారీ చేయు వారు

## శ్మశానవాటిక అభివృద్ధికై చేసిన ఆందోళన కేసు కొట్టివేత

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ అజిత్ సింగ్ నగర్ పోలీసులు 2022 సంవత్సరం అక్టోబర్ నెలలో స్మశాన వాటిక అభివృద్ధికై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిపిఎం, తెలుగుదేశం కార్యకర్తలపై పెట్టిన కేసును విచారించి ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ కోర్టు, జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ నేడు కేసును కొట్టివేస్తూ, 13 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పునిచ్చారు. విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని హిందూస్మశాన వాటిక అభివృద్ధి చేయాలని, దెబ్బతిన్న రేకుల షెడ్డు పునర్ నిర్మించాలని, దహన సంస్కారాలైనా సక్రమంగా జరుపుకునే అవకాశం కల్పించాలని కోరుతూ 2022 సంవత్సరం అక్టోబర్ 7వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. తెలుగుదేశం ప్రభుత్వం అక్రమ కేసులు రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, దాదాపు 11 నెలలు గడిచినా ఏ కేసులు ఎత్తివేయలేదు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ సూచనలతో న్యాయవాదులు సప్పా రమేష్, కొండలరావు, ప్రేమ న్యాయ సహాయం అందించారు. విచారణ జరిపిన విజయవాడ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు, జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ నేడు కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. న్యాయ సహాయం అందించిన న్యాయవాదులకు నేతలు అభినందనలు తెలిపారు.

అనివార్యమైన యుద్ధం అంటూ ఏదీలేదు,
యుద్ధం వస్తే అది మానవ వివేక వైఫల్యం వల్లే.

-బొనార్‌లా

# 'అకాల' దెబ్బలు!

మానవుడు ఎంత సాంకేతిక పరిజ్ఞానం సంపాదించినా, ఇతర రంగాల్లో మరింత అభివృద్ధి సాధించినా, ప్రకృతి ముందు తలవంచని పరిస్థితులనుండి బయటపడలేకపోతున్నాడు. ఒకపక్క తీవ్రమైన ఎండలతో అల్లాడుతూ గుక్కెడు నీటికోసం ఎదురుచూస్తూ ఎండవేడిమి తట్టుకోలేక పదుల సంఖ్యలో ప్రజలు అసువులు బాస్తుంటే మరొకపక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఒక రోజుకాదు రెండు రోజులు కాదు. గత నెల రోజులుగా విడవకుండా కురుస్తున్న వర్షాలతో ముఖ్యంగా వ్యవసాయరంగం కుదేలైపోతున్నది. పిడుగుల శబ్దాలకు ప్రజలు గజగజలాడుతున్నారు.మొన్న ఆంధ్రప్రదేశ్‌లో ఒకే రోజు పిడుగులు పడి ఏడుగురికిపైగా ప్రాణాలు వదిలారు. దేశవ్యాప్తంగా యేటా వందలాది మంది ఈ పిడుగుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. అప్రమత్తంగా ఉండమని వాతావరణ నిపుణులు చెబుతున్నారే కానీ వాటి నుండి కాపాడలేకపోతున్నారు. వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ, సాయంత్రం ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం నగర జీవులను కూడా వదలడం లేదు. ఇలాంటి ఉపద్రవాలు సంభవించినప్పుడు వ్యవసాయరంగానికి అపార నష్టం జరుగుతున్నది. ఎందుకోఏమోకానీ రైతు పచ్చగా ఉంటే చూసి ఓర్వలేక, పగబట్టి, పిచ్చిబట్టి పంతంబూని ప్రకృతి దెబ్బమీద దెబ్బ కొడుతున్నట్లుగాఉంది. లేకపోతే ఏమిటి ఈసారి ఫిబ్రవరి చివరి వారం నుండే వర్షాలు, ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. మార్చిలో పడిన వర్షాలతో పండ్ల తోటలకు అపారమైన నష్టం జరిగింది. ఇప్పుడు, అప్పుడు అని కాదు. ఎప్పుడు పడితే అప్పుడు ఈ అకాల వర్షాలు రైతుల పంటలపై విరుచుకు పడుతున్నాయి. ప్రధానంగా ఈసారి వరి రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. పెట్టుబడి అంతా పెట్టి, చేయాల్సిన శ్రమంతా చేసి నోటికి అందుతుందన్న దశలో పంట నీటిపాలు కావడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రధానంగా పంటలు అమ్ముకోవడంలో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. మొన్న మెహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి ఐకెపి కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాశిపైనే ఓ రైతు అసువులు బాశాడు. అటు ప్రకృతితోపాటు తోటి మనిషి కూడా సహకరించడం లేదేమోననిపిస్తున్నది. పాలకులు ఆదేశాలు ఇస్తున్నారు కానీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. రోజులు కాదు, వారాలు కొన్ని సందర్భాల్లో నెల రోజులు కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు అర్థాకలితో కాపలా కాయాల్సి వస్తున్నది. లారీలు లేవనో, బస్తాలు లేవనో ఈ రెండూ ఉంటే హమాలీలు రాలేదనో ఏదో కారణంతో కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యాన్ని తూకం వేయలేకపోతున్నారు. తూకం వేసిన తర్వాత కూడా తరలించలేకపోతున్నారు. ఇలా ఎన్నో కారణాలతో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఇక ప్రకృతికూడా రైతుపై కక్ష తీర్చుకుంటున్నదేమోననిపిస్తున్నది. కలియుగం అంటే ఇదేకాబోలు. మనుషులతోపాటు కాలాలుకూడా మారిపోతున్నాయి. రుతువులు వాటిని బట్టి కాలాలు, అందుకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలను దృష్టిలో ఉంచుకొని విధి విధానాలు రూపొందించుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న పథకాలు, ప్రణాళికలు వీటికి తగినట్టుగానే ఉంటాయి.రైతులు తమ అనుభవాలను బట్టి ఏయే పంట ఎప్పుడువేయాలో ముందే ప్రణాళికలు రూపొందించుకుంటారు. ఒక రకంగా చెప్పాలంటే రైతుల జీవన విధానం రుతుపవనాల మీదనే ఆధారపడి ఉంటుంది. కానీ ఇప్పుడు రుతుపవనాలు గతి తప్పుతున్నాయి. అంచనాలకు కూడా అందడం లేదు. ఇందుకు కారణం పెరుగుతున్న భూతాపమేనని వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఫలితంగా బీకర తుఫాన్లు, వరదలు, అకాల వర్షాలు పెచ్చరిల్లిపోతున్నాయని చెబుతున్నారు.పర్యావరణం ఇంతగా పెరగరాదన్న లక్ష్యంతో పారిశ్రామిక విప్లవం నాటి సగటు ఉష్ణోగ్రత కన్నా రెండు డిగ్రీల సెల్సియస్ దాటకుండా చూసుకోవాలని 196 దేశాలు గతంలోనే ప్రతినబూనాయి. వాతావరణంలో విపరీత మార్పులతో పెరుగుతున్న విపత్తులను నివారించేందుకు 2030 నాటికి కర్బనఉద్గారాలను 43శాతం దాకా తగ్గించాలని గతంలోనే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు అంతంత మాత్రంగానే తీసుకుంటున్నారు. గత యాభైయేళ్లలో సంభవించిన పన్నెండు వేల ప్రకృతి వైపరీత్యాలు దాదాపు ఇరవైఐదు లక్షలమంది నిండుప్రాణాలను బలి తీసుకున్నది. భూతాప నియంత్రణలో విఫలమైతే ఉష్ణపవనాలు కారణంగానే మరణాలు4.7 రెట్లు పెరిగిపోతాయని లాన్సెట్ నివేదిక ఏనాడో వెల్లడించింది. భూతాపాన్ని పెంచుతున్న కర్బన్‌ఉద్గారాల్లో అధిక శాతం ధనికదేశాల నుండి వెలువడుతున్నవే. పేదదేశాలు కేవలం పన్నెండుశాతానికే పరిమితమవుతున్నాయి.పారిస్ ఒప్పందం తర్వాత వివిధ దేశాలు జాతీయ లక్ష్యాలుగా నిర్దేశించుకున్న మేరకు అమలు చేయడం లేదు. ఏ ఒక్క దేశం కారణంగానైనా భూతాపం నియంత్రణ మందగిస్తే అందుకు యావత్ ఆనవాళ్ల మూల్యం చెల్లించాల్సి వస్తుంది. భారత్‌కు సంబంధించి కూడా పర్యావరణాన్ని కాపాడడంలో విఫలమవుతున్నారనేచెప్పొచ్చు. ముఖ్యంగా అడవుల విధ్వంసం పర్యావరణానికి చేటుతెస్తున్నది. మన దేశంలో రోజూ 330ఎకరాలకు పైగా అడవులు రకరకాల కారణాలతో అదృశ్యమైపోతు న్నాయని అధికార నివేదికలే వెల్లడిస్తున్నాయి. పర్యావర ణాన్ని పరిరక్షించుకోలేకపోతే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.



రామకృష్ణ పరమహంస

ఏదైనా పనిలో లీనమైనప్పుడు, ప్రపంచంలోని ఏ విషయమూ నీలో చొరబడకూడదు. కాని చాలా మంది వినోద సమయంలో కూడా దీనిని పాటించలేరు.



చార్లెస్ కింగ్స్లే

## ప్రజావాక్కు



### దండ నీతితోనే ముందడుగు సాధ్యం

నేడు ప్రపంచమంతా పరోక్షంగానో, ప్రత్యక్షంగానోయుద్ధ భూమిలోనేఉంది. కొన్ని దేశాలు ఎదురెదురుగా తలపడుతుంటే,మరికొన్ని ముసుగులో దాడులు చేసుకుంటున్నాయి.ఏదేశమూ యుద్ధానికి బయటఉండే పరిస్థితిని అంతర్జాతీయ పరిణామాలు అనుమతించడం లేదు. అది నేరుగా తలపడుతున్న రష్యా,ఉక్రెయిన్, లేదా ఇజ్రాయెల్, పాలస్తీనా లేదా భారత్ పాకిస్థాన్ కావొచ్చు. వాణిజ్య కోణాల్లో ఢీకొంటున్న అమెరికా చైనాలు కావొచ్చు. ఒకప్పటికంటే ప్రస్తుతం ఘర్షణలకే వాతావరణం ఎక్కువ అనుకూలంగా ఉంది.. సామరస్యత కన్నా.ఇప్పుడు ఏ దేశానికి ఆ దేశం సొంత బలం,స్వంత వ్యూహం మీదనే ఆధారపడాలి తప్పించి మిగతా మిత్ర ధర్మాలు,ఔచిత్యాలు అని కూర్చుంటే మొదటికే మోసం వస్తుంది.అందుకు అప్రమత్తత తో వ్యవహరించడం కీలకం. అందుకు దండ నీతి తో బాటు దౌత్య నీతి కూడా అవసరం.ప్రపంచ దేశాలు నయానో భయానో భారత్ నే సపోర్ట్ చేసేలా దేశం ఎదగాలి. ప్రభావవంత దేశంగా. ఆర్థికంగా కూడా.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### పేదల గురించి ఆలోచించండి

వయసులో ఉన్నవారు ఆరోగ్యంగా ఉన్నవారు పనిచేయగల స్థితిలోఉన్నవారికి డబ్బులివ్వడం తప్పవుతుంది.కానీ వృద్ధులు, రోగాలతో బాధపడుతున్న వారు ఏ పనిచేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి డబ్బులివ్వటం తప్పెలా అవుతుంది. కార్పొ రేట్ శక్తులకు సాయం చేయడం ఎమ్‌పిల జీతాలు పెంచట మేకాదు పాలకులు పేదల గురించి ఆలోచించాలి. దేశంలోని అర్హులైన పేదలందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

-మిథునం, హైదరాబాద్

### మంచి సందేశం

జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి బలమైన వాక్యాలు చేశారు ఒకటి ఉగ్రవాదం, ఉగ్రవాద స్థావరాలను పాకిస్థాన్ తుదముట్టించాలి అనేది ప్రధాన డిమాండ్. మరొకవైపు పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌పైనే చర్చలు జరుపుతామని ప్రకటించి బలమైన సందేశాన్ని పాకిస్థాన్‌తో పాటు ప్రపంచానికి చెప్పడం గొప్ప సందేశం. సాంకేతికతను పంచుకోవడం కూడా ముఖ్యం.

-భారత అవినాష్,జనగామ

### వెన్నుపోటు

ఫిబ్రవరి 2023లో తుర్కియే దేశంలో భయంకరమైన భూకంపం వచ్చినప్పుడు ఆపరేషన్ దోస్త్ పేరిట భారత్ వెంటనే స్పందించి మందులను పలుమార్లు సరఫరా చేయడమే కాకుండా ఎన్.డి. ఆర్. ఫ్ టీమ్స్‌ను, పరిశోధన చేసే శునకాలను, తాత్కాలిక ఆసుపత్రులను ఏర్పాటు చేసి,కొన్ని లక్షల డాలర్ల ఆర్థిక సహాయం చేసింది. దానితో ఆ దేశం కుదుట పడింది. ఆదేశం భారత్ పట్ల ఎంత కృతజ్ఞతతో మెలగాలి? ఆదేశం భారత్ కు పాకిస్థాన్‌లా శత్రుదేశం కూడా కాదు. మొన్న జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ఈతుర్కయే అనే తుచ్ఛదేశం పాకిస్థాన్ కు వందల కొద్ది యుద్ధ డ్రోన్లను పంపి సహాయపడింది. కృతఘ్నుతకు ఇంతకన్నా ఘనమైన తార్కాణం యింకేం కావాలి?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అధ్వాన్నస్థితిలో రేషన్ షాపులు

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలోని రేషన్‌షాపులు అధ్వాన్న స్థితిలో, అధోగతిలో నడుస్తున్నాయి. దానిలో భాగంగా తిరుపతి నగర పరిధిలో సుమారు 100 రేషన్‌షాపులు పనిచేస్తున్నాయి. అందులో కొన్నిఎప్పుడు తీస్తారో,ఎప్పుడు మూస్తారో, ఎప్పుడు రేషన్ ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. కొన్ని షాపులకు నోటీసు బోర్డులుండవు. మరికొన్ని షాపులు మాత్రం 1వ తేది నుండి తూతూ మంత్రంగా 2,3 రోజులు ఇచ్చి సరుకు అయిపోయిందని,డీలర్లు మూసివేస్తారు.అందులో కొన్ని షాపులుకేవలం బియ్యం మాత్రమేఇచ్చి మిగిలినవి లేవు పోండి అంటారు.కాబట్టి ఈ రేషన్ షాపుల డీలర్లను అదుపులో పెట్టాలి. తరువాత బ్లాకుల్లో అమ్మే కస్టమర్లను అదుపులో పెట్టాలి

-వి.ఆర్.కె.మూర్తి, తిరుపతి

### వెల్‌నెస్ సెంటర్లో అందని సేవలు

ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా హనుమకొండలోని మెటర్నిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయబడ్డ వెల్ నెస్ సెంటర్‌లో నిత్యం వచ్చే వారికి పూర్తి స్థాయిలో అందడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి ములుగు మహబూబాద్ జనగాం వరంగల్ హనుమకొండ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టులు నిత్యం వెల్‌నెస్ సెంటర్‌కి వస్తారు. కానీ అన్ని సేవలు అందుబాటులోకి రావడం లేదు. న్యూరో డాక్టర్ పీడియాట్రిక్ డాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్ల నానా యాతన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెల్‌నెస్‌లో అన్ని విభాగాల వైద్యులను ఏర్పాటు చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'యంగ్ ఇండియా' పురోగతిలో తెలంగాణ ముద్ర

***నేటి తెలంగాణ యువతకు ఇదొక అపూర్వ ఉద్యోగాలు అందించే అక్షయ పాత్రగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మారుతున్నదని నమ్మాలి. ఫిజికల్ ఎడ్యుకేషన్ నినాదం 'హెల్దీ మైండ్ ఇన్ హెల్దీ బాడీ (ఆరోగ్యకర దేహంలో ఆరోగ్య కర మెదడు) నేటి యువతకు శారీరక ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నది. 5.18 కోట్ల జనాభా కలిగిన దక్షిణ కొరియాకు 2024 ఒలింపిక్స్‌లో 32 పతకాలు గెలవడం, 12.37 కోట్ల జనాభా కలిగిన జపాన్ 45పతకాలు చెజిక్కించుకోగా, 140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్‌కు 06 పతకాలు మాత్రమే రావడం విచారకరం. యువ భారత దృష్టిని క్రీడల వైపు మరల్చుతూ రానున్న ఒలింపిక్స్‌లో భారత జట్టు తరపున అధిక మొత్తంలో పతకాలు సాధించుటలో తెలంగాణ యువత ముందు నిలవడానికి సహకరించే 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూని వర్సిటీ స్థాపించడం హర్షదాయకం.***

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

మన బలాలను తెలుసుకొని ముందడు వేయడం, బలహీనతలకు చికిత్సలు ఆలోచించడం విజ్ఞులు చేసే పని. నేటి భారతావని అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ సరైన సమాధానాలు వెతకడంతో పాటు మన బలాలను గుర్తించి సుస్థిరాభివృద్ధి దిశగా మలుచు కోవడం వివేకుల ఆలోచనలు అవుతాయి. 144 కోట్ల భారత అధిక జనాభా మనకు వరమా,శాపమా !" అని చర్చించుకుంటున్న వేళ మన జనాభా సగటు వయస్సు 28.8 సంవత్సరాలు నమోదు కావడం శుభ పరిణామంగా తీసుకోవాలి. అపార మానవ వనరుల సగటు వయస్సు 28.8 ఏండ్లు అయినపుడు, భారతావని నిండా యువశక్తి ప్రవాహం కొనసాగుతున్నది, యువ భారత్" అంటూ సగర్వంగా పిలువబడుతున్నది. దేశ జనాభాలో 15-29 ఏండ్ల వయస్సు ఉన్నయువత 42 కోట్లు ఉండడంతో పాటు 35 ఏండ్ల లోపు వయస్సు ఉన్న జనాభా 65 శాతం ఉండడం మన దేశ అమూల్య వనరులుగా భావించాలి. దేశ జనాభా సగటు వయస్సులో జపాన్ 50 ఏండ్లు, అమెరికా 38.7 ఏండ్లు ఉండడం ఆయా దేశాల అధిక వయోవృద్ధుల జనాభాను సూచిస్తున్నది. వృద్ధ జపాన్ లాంటి పదాలను ఉపయోగించాల్సిన స్థితి వస్తున్నది. 28వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ 11వ అతి పెద్ద, 12వ అతి పెద్ద జనాభా, జిడిపీలో 8వ ర్యాంకు కలిగిన రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నది. తెలంగాణ జనాభా దాదాపు 3.5 కోట్లు ఉండడం, ఇందులో దాదాపు 2.4 కోట్ల జనాభా యువత 15-40 ఏండ్లు ఉండడం, ఉన్నత విద్యలో నమోదు నిష్పత్తి (జిఈఆర్) 28.4 శాతం ఉండడం, యువ జనాభా అధికంగా ఉన్న తెలంగాణలో ఉన్నత విద్యా సంస్థలు ఎక్కువగా ఉండడంతో మన యువత విద్యతో పాటు నైపుణ్యాలను ఒడిసి పట్టుకొని గౌరవప్రద ఉద్యోగ ఉపాధులను పొందితే నేటి తెలంగాణ రేపటి భారతానికి యంగ్ ఇండియా అంబాసిడర్"గా మారబోతుందనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం తెలంగాణలో 1,446 కళాశాల్లో 4.58 లక్షల యువత ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. 388 ఇంజనీరింగ్ కళాశాలలు, 62 ప్రభుత్వ/ప్రైవేట్ మెడికల్ కళాశాలలు తెలంగాణ యువతకు విద్య, నైపుణ్యాలను బోధించే ప్రయత్నాలు చేస్తున్నాయి.ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కారు యుంగ్ ఇండియా" నినాదం తీసుకొని యువతకు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించే దిశగా పలు వాంఛనీయ చర్యలను తీసుకోవడం సముచితంగా ఉన్నది. ఇదే క్రమంలో ఇటీవల దేశంలోనే ప్రతిష్టాత్మక 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని 15 బహుళజాతి కంపెనీల భాగస్వామ్యంతో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) ప్రాతిపదికన ఏర్పాటు చేయడం ఆహ్వానించదని పరిణామం. తొలి బ్యాచ్‌గా 09 కోర్సులను ప్రారంభించి 212 మంది విద్యార్థినీవిద్యార్థులను ఎంపిక చేసి నైపుణ్య వికాస శిక్షణను ఇవ్వడం కొనసాగుతున్నది. నేడు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఫార్మసీ, ఈకామర్స్ లాజిస్టిక్స్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్, కన్‌స్ట్రక్షన్, రిటేల్ ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఆనిమేషన్, విజ్యువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్, వేర్‌హౌజ్



ఎగ్జిక్యూటివ్స్, కీ కన్‌సైనర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులను అందిస్తున్నది. రానున్న రోజుల్లో నర్సింగ్ ఎగ్జిక్యూటివ్, ఫార్మా అసోసియేట్ కోర్సులను కూడా ప్రారంభించనున్నది. ఈ కోర్టులు పూర్తి చేసిన యువతకు ఆయా భాగస్వామ్య కంపెనీలు ఉద్యోగ నియామకాలను చెపట్టనున్నది. నేటి తెలంగాణ యువతకు ఇదొక అపూర్వ ఉద్యోగాలు అందించే అక్షయ పాత్రగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మారుతున్నదని నమ్మాలి. ఫిజికల్ ఎడ్యుకేషన్ నినాదం 'హెల్దీ మైండ్ ఇన్ హెల్దీ బాడీ (ఆరోగ్యకర దేహంలో ఆరోగ్య కర మెదడు) నేటి యువతకు శారీరక ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నది. 5.18 కోట్ల జనాభా కలిగిన దక్షిణ కొరియాకు 2024 ఒలింపిక్స్‌లో 32 పతకాలు గెలవడం, 12.37 కోట్ల జనాభా కలిగిన జపాన్ 45పతకాలు చెజిక్కించుకోగా, 140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్‌కు 06 పతకాలు మాత్రమే రావడం విచారకరం. యువ భారత దృష్టిని క్రీడల వైపు మరల్చుతూ రానున్న ఒలింపిక్స్‌లో భారత జట్టు తరపున అధిక మొత్తంలో పతకాలు సాధించుటలో తెలంగాణ యువత ముందు నిలవడానికి సహకరించే 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం హర్షదాయకం. క్రీడల్లో ఆసక్తి కలిగిన తెలంగాణ యువత ఈ యూనివర్సిటీ ద్వారా తమ క్రీడా నైపుణ్యాలను పెంచుకొని ఒలింపిక్ పతకాలు సాధించే స్థాయికి చేరుకోవాలనే సదాశయంతో క్రీడా విశ్వవిద్యాలయానికి హకీంపేట సమీపాన ఫ్యూచర్ సిటీ పేరుతో 200 ఎకరాల ప్రాంగణాన్ని తీసుకురావడం హర్షదాయకం. యువతలో క్రీడా నైపుణ్యాలను పెంచడం, క్రీడా పరిశోధనలకు తలుపులు తెరవడం, క్రీడల ద్వారా ఆర్థికాభివృద్ధిని సుసాధ్యం చేయడం జరుగుతుందని ఆశిస్తున్నారు. సాలీనా 365 సీట్లతో వివిధ క్రీడల్లో శిక్షణలు ఇవ్వడానికి పథక రచన జరుగుతున్నది. ఈ యూనివర్సిటీ పూర్తి స్థాయిలో పని చేసినప్పుడు భారత క్రీడా రంగానికే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ కానున్నదని విశ్వసించడంలో సందేహం లేదు. వీటికి తోడుగా ములుగులో సమ్మక్కాసారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ యువతకు ఉన్నత విద్యలో, ముఖ్యంగా గిరిజన యువతకు పెద్దపీట వేయడం జరుగుతుంది. అదే విధంగా ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన హైదరాబాద్ కోటి ఉమెన్స్ కళాశాలను చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మార్చడం కూడామహిళా విద్యకు పెద్దఎత్తున ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకం. ఇటీవల యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కూడా ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బంది పిల్లలకు 50శాతం, ఇతర విద్యార్థినీ విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించి నాణ్యమైన విద్యను అందించే కృషిచేయడం జరుగుతుంది. ఈ విధంగా తెలంగాణ ప్రభుత్వం యువశక్తిని దేశాభివృద్ధికి వినియోగించుకోవడానికి పూనుకోవడం సముచితంగా ఉన్నది. యువశక్తి శాపంగా కాకుండా వరంగా మారడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రానున్న రోజుల్లో మన రాష్ట్రాన్ని భారతంలోనే ప్రత్యేక స్థానంలో నిలుపుటకు ఉపయోగపడతాయని నమ్ముదాం, యువ తెలంగాణను 'నైపుణ్య విద్యా కేంద్రంగా మార్చుదాం. ●

# ప్రభుత్వరంగ సేవలలో నాణ్యత అవసరం

తరిగోపుల నారాయణస్వామి

ఈ రోజుల్లో మన సామాజిక జీవనంలో ఒక విచిత్రమైన విరుద్ధత కనిపిస్తోంది. సేవల విషయంలో ప్రజలు అధికంగా ప్రైవేటు రంగాన్ని ఆశ్రయిస్తున్నా, ఉద్యోగాల విషయంలో మాత్రం ప్రభుత్వరంగానికే మొగ్గ చూపుతున్నారు. ఈ భావన సామాజికంగా స్థిరపడిపోవడం ఒక వైపు ఆలోచనాత్మకమైనదిగా, మరోవైపు ప్రభుత్వ రంగంపై ప్రజల అపార నమ్మకానికి సంకేతంగా నిలుస్తోంది. ఉదాహరణకు విద్యారంగాన్ని తీసుకుంటే, చాలామంది తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ విద్యా సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఫీజు భారమున్నా, మెరుగైన భవిష్యత్తు కోసం వాటినే ఎంచుకుంటున్నారు. కానీ అదే తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్థిర ఉద్యోగం పొందాలని కోరికపడుతున్నారు. ఇది ప్రత్యక్షంగా చూస్తే, సేవల విషయంలో ప్రైవేట్, ఉద్యోగాల విషయంలోమాత్రం ప్రభుత్వ రంగానికే అధిక ప్రాధాన్యత ఇవ్వడం గమనించదగిన అంశం. వైద్యరంగంలోనూ ఇదే విరుద్ధత కనిపిస్తుంది. ప్రజలలో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తుంది. కానీ ప్రభుత్వ వైద్య శాఖల్లో ఉద్యోగం పొందాలని యువత పోటీ పడుతుంది. విశేషంగా చూస్తే, సేవలకు ప్రైవేట్, ఉద్యోగ భద్రతకు మాత్రం ప్రభుత్వరంగం - ఇదే ధోరణి. రవాణా వ్యవస్థలోనూ ప్రజల నిత్య జీవితంలో ప్రైవేట్ క్యాబ్‌లు, ఆటోలు, బస్సుల పాత్ర పెరుగుతున్నా, ప్రభుత్వ రవాణా సంస్థల్లో ఉద్యోగం కోసమే పోటీ పరీక్షలు పెరుగుతున్నాయి. ఇది ప్రభుత్వ రంగంపై ఉన్న గౌరవానికి ప్రతిరూపం కావొచ్చు. కానీ అదే సమయంలో, ప్రభుత్వం అందించే రవాణా సేవలను ప్రజలు విస్మరిస్తుండటంలో సమకాలీన అభ్యాసాల స్పష్టత దాగివుంది. టెలికాం రంగంలో జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థల సేవలు వినియోగిస్తూ ఉండే యువత, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు రావాలని కలలు కంటున్నాడు. ఈవిధంగా, సమాజం సేవ పంపిణీ, డిజిటల్ సర్వీసులు వంటి అంశాల్లో ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెరుగుతోంది. కానీ ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగం పొందాలని యువత ఆసక్తిని చూపుతోంది. ఇంటర్నెట్, టెక్నాలజీ రంగాల్లోనూ ప్రజలు గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి ప్రైవేట్ సేవలపై పూర్తిగా ఆధారపడుతున్నారు. కానీ ప్రభు




త్వ ఐటీ శాఖలు, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ వంటి సంస్థల్లో ఉద్యోగం కావాలని ప్రయత్నిస్తున్నారు. అంటే సేవలు ప్రైవేటు రంగంలో, ఉద్యోగాల పట్ల మాత్రం ప్రభుత్వ రంగంపై ఆశ. గ్రామీణాభివృద్ధి రంగంలో, ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన సిబ్బందిని ప్రజలు ఆశిస్తున్నారు. అయితే గ్రామాల్లోనూ ప్రైవేట్ నాన్ గవర్నమెంటల్ సంస్థల సేవలు పెరుగుతున్నాయి. కానీ ఉద్యోగం మాత్రం గ్రామీణ అభివృద్ధి శాఖల్లోనే కావాలని యువత భావిస్తోంది. బహుళ రంగాల్లో ఈ ధోరణి విస్తరించి ఉంది. అనేక మంది విద్యార్థులు, ప్రభుత్వ రంగాలపై నమ్మకంతో కోచింగ్ సెంటర్లలో పోటీ పరీక్షల కోసం ఖర్చులు వెచ్చిస్తున్నారు. అయితే జీవనశైలిలో మాత్రం ప్రైవేట్ సేవలపై ఆధారపడుతున్నారు. ఇది వ్యక్తిగత ఆశలతో సహా సామాజిక ఆర్థిక పరిణామాలనూ ప్రతిబింబిస్తుంది. సేవల విషయంలో ప్రభుత్వ రంగాన్ని నమ్మకుండా, ఉద్యోగం విషయంలో మాత్రం ప్రభుత్వ రంగానికే అధిక ప్రాధాన్యం ఇవ్వడం సమంజసమా? ఇది ప్రభుత్వ రంగంపై భద్రత, గౌరవం, స్థిరత అనే నమ్మకంతో కూడిన నిర్ణయం కావొచ్చు. కానీ అదే సమయంలో ప్రభుత్వ రంగ సేవలపై ప్రగాఢ విశ్వాసం లేకపోవడం కూడా తెలుస్తోంది.ప్రజల ఈ తత్వం వల్ల ప్రభుత్వ రంగంపై ఉద్యోగాల ఒత్తిడి పెరిగిపోతోంది. ఉద్యోగాలు అధిక సంఖ్యలో ఇవ్వాల్సిన అవసరం ఏర్పడుతోంది. అయితే ఇది ఆర్థిక పరంగా సాధ్యమైనది కాదు. ప్రభుత్వం అందించే ఉద్యోగాల పరిమితి ఉండటం వల్ల, నిరుద్యోగిత సమస్య తీవ్రంగా కనిపిస్తోంది.అయితే, ప్రైవేట్ రంగాన్ని పూర్తిగా విస్మరించకూడదు. ప్రస్తుతం ఎంతోమంది యువత ప్రైవేట్ రంగాలలోనే తమ సామర్థ్యాన్ని చూపిస్తున్నారు. స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, డిజిటల్ సేవలు వంటి విభాగాల్లో అనేక ఉద్యోగాలు నెలకొంటున్నాయి. ఈ అవకాశాలను గౌరవంగా స్వీకరించడం సమాజ అభివృద్ధికి అవసరం. మరోవైపు, ప్రభుత్వ రంగం తన సేవల నాణ్యతను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. సేవలలో నాణ్యత పెరిగితే, ప్రజలు ఉద్యోగాలపరంగా మాత్రమే కాకుండా, సేవల పరంగానూ ప్రభుత్వ రంగంపై మరింత నమ్మకంతో ముందుకు వస్తారు.ప్రజలలో ఉండే ఈ విరుద్ధ ధోరణిని గుర్తించి, సమగ్రంగా సమాజాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలంటే - ప్రభుత్వ రంగానికి మరింత సామర్థ్యాన్ని ఇచ్చేం దుకు, ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచేందుకు అవసర మైన విధానాలపై దృష్టి పెట్టాలి.ఉద్యోగ భద్రత, గౌరవం, వేతన సమతుల్యత వంటి అంశాల్లో ప్రభుత్వ రంగం ఎలా నిలబడుతుందో, అదేరీతిగా సేవల నాణ్యతలోనూ నిలవాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఈ విరుద్ధ ధోరణి తొలగి, సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుంది. సమాజంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ రంగంలో సేవలు పొందాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలి. ●

# బౌద్ధ ధర్మం ప్రపంచ మానవాళికి శాంతి సూత్రం



డా॥కత్తి పద్మారావు

నిజానికి నేడు ప్రపంచంలో మరీ ముఖ్యంగా దక్షిణాసియాలో జరుగుతున్న అనేక తీవ్రవాద సంక్షోభాలు జరుగుతున్న సందర్భంగా బౌద్ధం ఒక ఐక్యతా ధర్మ సూత్రంగా మానవాళికి మేలు చేయటమే కాక పరస్పర సంబంధాల వల్ల తాత్విక మానసిక శాంతిభావనల వలన ఉద్రేకాలు సమసి పరస్పర సమన్వయాలు, పరస్పర అవగాహనా పెంపొందుతాయి. మరీ ముఖ్యంగా దక్షిణాసియా బుద్ధుని బోధనలతో జీవన తత్వాన్ని అభ్యసించిన ప్రాంతం. మత తీవ్రవాదాన్ని ఉపసిద్ధింప జేసే ఉన్నతమైన ఔషధం. అది నిజానికి బుద్ధుడు బోధవృక్షం దగ్గరకు చేరే వరకు అతడు స్వయంగా అనేక సిద్ధాంతాలను అధ్యయనం చేసి తానొక దర్శనాన్ని కనుగొన్నాడు. ఇందులో అభూతమైంది ఏమిలేదు. అంతా స్వయం అనుభవమే. బోధివృక్షాన్ని చేరక ముందే బుద్ధుడు తాత్విక అధ్యయనం చేసినట్లు అంబేద్కర్ పేర్కొన్నారు. రాజగృహ నుంచి ఆయన ప్రయాణమై వెళ్లేమార్గంలో సాంఖ్యశాస్త్రాన్ని ఆయన అభ్యసించాడు. సాంఖ్యం బుద్ధుడ్ని తర్కబద్ధమైన ఆలోచనకు పురిగొల్పింది. జ్ఞానం ధ్యానం నుంచి వచ్చేది కాదని అది తర్కబద్ధమైందనీ, హేతువివేచనా పూర్ణమైందనీ ఆయన గ్రహించాడు సాంఖ్య దర్శనం భారతీయ తత్వశాస్త్రాల్లో హేతుబద్ధమైనది. భౌతిక వాదంతో కూడింది. ఈ దర్శనాన్నిరచించిన కపిలుడు జ్ఞానతత్వ దార్శనికుడిగా పేరొందాడు. కపిలుని గురించి కేత్తు మహాపండితుడు వ్రాస్తూ కపిలుడు తత్వశాస్త్ర జ్ఞానంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించాడనీ ఆయనకు తత్వశాస్త్రంలో అందరూ శిష్యులేనని పేర్కొన్నాడు. నిజానికి బుద్ధుడుగా గౌతముడు రూపొందే క్రమం నుండి ఎంతో భారతీయ తాత్విక జిజ్ఞాస మదనంలోకి వచ్చింది. అంతకు ముందు వున్న చార్వాకులు రూపొందించిన భౌతిక, తాత్విక వాదాన్ని సామాజికరించే పనికూడా బౌద్ధం స్వీకరించిందని అది చాలా క్లిష్టతరంగా సాగిందని మనకర్థమవుతుంది. ఆధ్యాత్మికవాదం, భౌతిక వాదం రెండూ సామాజిక, అన్వయాలకు దూరంగా ఉన్నప్పుడు గౌతమ బుద్ధుడు భౌతిక వాదానికి సామాజిక ధర్మాన్ని సమన్వయించాడని చెప్పవచ్చు. ఇకపోతే బుద్ధుడు తనదైన దర్శనాన్ని రూపొందించుకోవడానికి అప్పటికి ఉనికిలోఉన్నఅన్ని దర్శనాలను అధ్యయనం చేశాడు. కొంతకాలం వాటితో నడిచాడు. అందులోని వైఫల్యాలను గమనించాడు. సమాజం అందులో వేటిని ఆచరించలేకపోతుందో అర్థం చేసుకున్నాడు. సమాజానికి నూతన దర్శనాన్ని రూపొందించడానికి తాను



సిద్ధార్థుడి నుండి బుద్ధుడు కావడానికి తీవ్రమైన ప్రాయోగికమైన పరిశీలనకు పూనుకొన్నాడు. ఈ విషయంపై దాస్ గుప్తా తన 'ఏ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ'లో ఇలా అన్నాడు. ఏ తత్వశాస్త్రమైన సమాజానికి అన్వయించబడి సామాజిక రుగ్మతలకు ఔషధంగా రూపొంది అదిమానవుల్ని నైతిక మార్గంలో నడపగలిగినప్పుడు అది విస్తృతమై ఆ ధర్మం ఎల్లలు దాటి ప్రపంచానికి విస్తరిస్తుందని బౌద్ధం నిరూపించింది. బుద్ధుడు రూపొందించిన ధర్మ పదం ఎంతో విశిష్టమైనది. ప్రపంచ దర్శనాలన్నింటిలో అత్యుత్తమైంది, ఆదర్శమైంది, దార్శనికమైంది. మానవుణ్ణి అగ్నిపుటంలో వేసి సువర్ణంలా తీర్చిదిద్ది మానవ మనుగడకు నూతన మార్గాన్ని నిర్మించింది ధమ్మపదం. ఇందులో పేర్కొనబడని అంశం లేదు. మానవునకు సమాజం, పరిసరాలు, వ్యక్తిత్వం, పంచేంద్రియాలు, మనసు,సుఖం, దుఃఖం, నీతి వర్ణతత్వం, ఉచ్ఛనీచాలు, ఉన్మాదం, సన్మార్గం, శాంతిఅన్ని విషయాలు లోతుగా సోదాహరణాత్మకంగా పరిశీలించబడ్డాయి. మానవుడు తన్ను తాను వెలిగించుకోటానికి ఒక మహూజ్వల ధార్మిక కాంతి పుంజం ధమ్మ పదంలో ఉంది. ప్రతి మనిషి మరొక మనిషిని అవమానించే,నిర్దించే, అణిచి వేసే సమాజానికి ప్రత్యామ్నాయంగా, ప్రతి మనిషి తన్ను తాను జయించే, తన్నుతాను నియంత్రించుకునే, నిగ్రహించుకునే, నిర్మించుకునే సూత్రాలు ధమ్మపదంలో ఉల్లఖింపబడ్డాయి. బౌద్ధ సాహిత్యాన్ని భారతదేశంలో చరిత్రకు అన్వయించిన వారిలో రొమిల్లా థాపర్, డి.డి. కోశాంబి చాలా ముఖ్యులు.అశోకుడు బౌద్ధంలోకి వచ్చాకదేశంలో, ప్రపంచంలో శాంతి వర్ధిల్లింది. ఈ అశోకున్ని బౌద్ధంలోకి తెచ్చింది ఒక ఆంధ్రుల దళిత స్త్రీయే. ఒకసారి రొమిల్లాథాపర్ ఇచ్చిన కథను చూద్దాం. అశోకుడు ముస్లింయేతర స్త్రీ పుత్రుడు. అశోకుడు వివాహమాడింది కూడా అనేక తెగల స్త్రీలను వివాహమాడాడు. అతనికి చండాశోకుడు అని పేరు ఉంది. అతని కత్తితో వేల కుత్తుకలు తునుమాడాడు. కళింగలో ఉన్న ఒక దళిత స్త్రీ ఆయనకు జ్ఞాన బోధ చేసింది. కళింగ రాజ్యం ఆంధ్రులది. ఆమె దళిత స్త్రీయే. తాత్కలిక నివాసం గురించి తెలియజేశాయి. అశోకుడు తండ్రి మరణశయ్యమీద ఉందగా, బలవంతులైన మంత్రుల సహాయంతో పదవిని సాధించేందుకు చేసిన ప్రయత్నాలను వివరిస్తాయి. రాష్ట్ర పాలకునిగా అశోకుడు బౌద్ధం ప్రజలకు పరిచయం చేసి రాజ్యం శాంతివంతంగా ఉండేందుకు బౌద్ధమే మార్గమని ప్రజలందరిని బౌద్ధంవైపు నడిపించాడు. అటువంటి మహోన్నతమైనటువంటి బౌద్ధ ధర్మం ఈనాడు భారతదేశానికి అన్ని దిశలుగా మతోన్మాదం తగ్గడానికి భారతదేశం ఇతర దేశాలతో సామాజిక సాంస్కృతిక జీవన వ్యవస్థలను విస్మృతి చేసుకోవడానికి బౌద్ధతత్వం, అశోకుని భావజాలం, బౌద్ధ సాంస్కృతి నిర్మాణం ఒక చారిత్రక అవసరం. దక్షిణాసియ దేశాలన్ని ఈమార్గంలో నడిచి పరస్పర సహకారం తో పరస్పర అభ్యుదయంతో, పరస్పర మైత్రితో వర్ధిల్లడానికి బౌద్ధ ధర్మమే ప్రపంచశాంతి సూత్రం మార్గంలోనడుద్దాం. ●

## ఘనంగా ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

పెదనందిపాడు మే 15(ప్రభాతవార్త) నాగులపాడు లోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన. స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని గురువారం రాత్రి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు. ఆవిష్కరించారు ఈ





సందర్భంగా. పాటిబండ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ. రాజకీయాలను మలుపు తిప్పిన మహోన్నత వ్యక్తి దేశ దేశాలలో తెలుగు భాషను చాటి చెప్పిన ఘనపాటి. స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగువారి గుండెల్లో చిరస్మరణీ యుడని. ఆ మహనీయుని విగ్రహ ఆవిష్కరణకు వేలాదిమందిగా అభిమానులు తరాలి రావటమే నిదర్శనం అన్నారు. నేటి రాజకీయాల గురించి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర పరిపాలన కుంటుపడిందని దాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు ఎనలేనికృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేచ్చేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుంది అన్నారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించనునట్లు వారు పేర్కొన్నారు. అమరావతి పనులు అద్భుతంగా జరుగుతున్నాయి అన్నారు. అశోక చక్రవర్తి లాంటి మహానుభావులు రోడ్లపక్క చెట్లు నాటించి పుణ్యం కట్టుకుంటే. జగన్మోహన్ రెడ్డి చెట్లు నరికించి వాటి ఉసురు కొట్టుకున్న మహా నాయకుడు అన్నారు. తన నియోజకవర్గంలో పనులు ముగించుకొని ఆలస్యంగా వచ్చిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ రాజకీయ సేవలనుగుర్తు చేశారు. తొలుత నాయకులను ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా బాణాసంచా మోతలతో వేదిక వద్దకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నర్రా బాలకృష్ణ .సంగం డైరీ సభ్యులు గొల్లపూడి శ్రీనివాసరావు. పాటిబండ్ల మురళి. రాంబాబు. ఎన్టీఆర్ అభిమానులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు తెలుగుదేశం పార్టీ కూటమి సభ్యులతో. నాగులపాడు పసుపు రంగు కావూరు వేసింది..

## పారిశుద్ధ్యనిర్వహణలో అలసత్వం వహించవద్దు : విజయవాడ మున్సిపల్ కమీషనర్

విజయవాడ కార్పొరేషన్,మే 15,ప్రభాతవార్త: పారిశుద్ధ నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.



నగరాన్ని పరిశుభ్రంగా,అందంగా ఉంచాలని పేర్కొన్నారు. గురువారం తన పర్యటనలో భాగంగా ఆయన ఫిలిం కాలని,మొగల్రాజపురం, క్రీస్తురాజపురం,ఎంజీ రోడ్డు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఫిలిం కాలనీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్రీస్తు రాజపురంలో పారిశుద్ధ నిర్వతహణ సరిగ్గా లేదని నిత్యం ప్రతి రోజు పారిశుద్ధ నిర్వహణ ఖచ్చితంగా జరుగుతూ ఉండాలని,సెక్రటరీలు, వర్కర్లు,శానిటరీ ఇనస్పెక్టర్లు,పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదన్నారు. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం అమృత్ పథకంలో భాగంగా నిర్మించబోతున్న డ్రైనేజీ పంపిగ్ స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలించారు. డ్రైనేజి పంపిగ్ స్టేషనర్కు కోసం సరైన స్థలాన్ని ఎంపిక చేసి పట్టణ ప్రణాళజక,ఇంజనీరింగ్ విభాగం ం శాఖాధిపతులు సమన్వయంతో ఖచ్చితమైన ఎస్టిమేట్స్,నివేదిక సమర్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. నగర అందానికి భంగం కల్గించే హోర్డింగ్స్‌ని తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కన్‌స్ట్రక్షన్ అండ్ డిమోలిషన్ వ్యర్థాలు నగరంలో ఎక్కడ కనబడినా వెంటనే తొలగించాలని, ప్లానింగ్ సెక్రటరీలు,శానిటరీ సెక్రటరీలు సమన్వయంతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ఛీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్,ఇన్‌ఛారి . మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్,జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత,సూపర్‌టెండింగ్ ఇంజనీర్లు పి.సత్యకుమారి, పి.సత్యన్నా రాయణ,ప్రాజెక్ట్ ఆఫీసర్(యుసిడి) వెంకట నారాయణ,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుల శ్రీనివాస్,చంద్రశేఖర్,బయాలజీ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎన్‌కె రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు

### -ఎంపి చిన్ని ,ఎమ్మెల్యే కృషికి ప్రశంసలు

ఎ కొండూరు, మే 15, ప్రభాతవార్త : విజయవాడ ఎంపి కేశినేని చిన్ని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాస్‌ల కృషితో ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు క్రాస్ రోడ్డు నుండి ఎంఎన్‌కె రోడ్డు నిర్మాణానికి



రూ.6కోట్లు మంజూరైనట్లు గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బి గోపీరాజు తెలిపారు. ఈ రోడ్డు గత 6 సంవత్సరాల నుండి పూర్తిగా తారు లేక పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలు జరిగి కొందరు ద్విచక్ర వాహనదారులు మరణించిన దుర్ఘటనలు ఎన్నో ఉనాన గత వైసిపి ప్రభుత్వం రహదారుల నిర్మాణం, మరమత్తుల విషయంలో ఏ మాత్రం పట్టించుకోలేదని స్థానిక ప్రజలు గిరిజన సూగాలి లంబాడాలు ఆరోపించారు. ఇప్పటినా ఈ కూటమి ప్రభుత్వం రూ.6కోట్లు మంజూరు చేయించడం పట్ల ప్రాంత గిరిజన సూగాలి లంబాడాలు మిగతా వర్గాల ప్రజలు వలువాహన చోదకులు ఎంపి చిన్ని, ఎమ్మెల్యే శ్రీనివాస్‌ల ప్రత్యేక శ్రద్ధను ప్రశంసించారు.

## పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యం

బాపట్ల, మే14, ప్రభాతవార్త: పొదుపు సంఘాలలోని 30 వేల కుటుంబాలకు జీవనోపాధులు కల్పించడం, వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పొదుపు మహిళల జీవనోపాధుల కార్యకలాపాలు, ఆర్థికాభివృద్ధి అంశాలపై మేథో మధనం కార్యక్రమం బాపట్లలోని ప్రవేట్ వంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించారు. డి ఆర్ డి ఏ, మెప్మాలోని క్షేత్రస్థాయి పట్టణ, గ్రామ సంఘాల నాయకులకు మెగా వర్క్ షాప్



నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు మహిళలను పైత్సాహిక పారిశ్రామికవేత్తలను చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. వారంతా నిరర ఆదాయం సాధించేలా చైతన్య పరచాలన్నారు. పేదరికం నుంచి మహిళలను బయటకు తెచ్చేందుకు వివిధ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ప్రభుత్వం వెచ్చిస్తున్న రూ.కోట్ల నిధులను మహిళలకు చేరువచేయాలి సహకరించాలన్నారు. అభివృద్ధి ఫలాలు పేద కుటుంబాలకు చేర్చాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. బాపట్ల జిల్లాలో 33 వేల 390 పొదుపు సంఘాలు ఉండగా అందులో నాలుగు లక్షల కుటుంబాలు సభ్యులుగా ఉన్నాయన్నారు. అందులో ఈ ఏడాది ముప్పై వేల కుటుంబాల జీవనోపాధులకు మార్గదర్శకాలు కార్యాన్నుకులు కావాలన్నారు. మహిళలను లక్షాధికారులను చేసేలా అవగాహన కల్పించాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పైత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని బాపట్ల జిల్లా వేదికగా మారాలన్నారు. పశు సంపద వృద్ధితో పాల ఉత్పత్తి పెరుగుతుందని, తద్వారా ఆదాయ వనరులు అధికమవుతాయన్నారు. ఇందుకు అవసరమయ్యే పశు దాణ ఉత్పత్తికి ప్రభుత్వ భూమి లీజ్ కు ఇస్తామని ఆయన ప్రకటించారు. నామమాత్రం అద్దెకు భూమి కేటాయిస్తామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖల ద్వారా అమలయ్యే పథకాలు, రాయితీలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. సీడాప్ ద్వారా నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణలు, ఉద్యోగ అవకాశాలపై రూపొందించిన గోడ పత్రాలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లాను ప్రథమంగా నిలిపి ఏపీ గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం, అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని ఈ సందర్భంగా అధికారులు, గ్రామ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ద్రాక్షావల్లి, సిపిడిసిఎల్ ఎస్సి ఆంజనేయులు, ఎల్ డి యం శివప్రసాద్, మెప్మా పిడి పి.శ్రీహరి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి వార్త



## సర్వే, రీసర్వే పై సమీక్షా సమావేశం

గుంటూరుతూర్పు, 15 మే, ప్రభాతవార్త : మన దేశంలో ప్రజలకు భూమి గౌరవం, సెంటిమెంట్, ఆర్థిక భరోసాఇస్తుందని, అటువంటి భూముల రికార్డులు సమస్యలేకుండా ఉండటానికి అన్ని రాష్ట్రాల్లో భూములరీసర్వే కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నారని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ,భూ వనరుల విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమంలోభాగంగా సర్వే, రీసర్వే పై జరిగిన జాతీయ కార్యశాలలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు శాఖ మంత్రిఅనగాని సత్యప్రసాద్, కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి, రాష్ట్ర రెవెన్యూ శాఖస్పెషల్ చీఫ్ సెక్రటరీ, సీసీఎల్‌ఎ జి జయలక్ష్మి, కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీకునాల్ సత్యార్థి, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి , ఇన్చార్జి జిల్లాకలెక్టర్ ఏ భార్గవ తేజ, ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి వర్క్ షాపును ప్రారంభించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖసహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ భూ వివాదాలు ఏళ్ల తరబడి కోర్టుల్లోపెండింగ్ లో ఉంటున్నాయని, గౌరవ సుప్రీం కోర్టులో సైతం ప్రతి నాలుగు కేసుల్లో ఒకటి భూవివాదాలకు సంబంధించి ఉంటుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లోను భూ సమస్యల అర్జీలే ఎక్కువగా వస్తున్నాయన్నారు. దీని వల్ల భూ యజమానులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. అమెరికాలో మన ఇళ్లు, భూమి వద్దకే అధికారులు వచ్చి రిజిస్ట్రేషన్‌చేసి వెళ్తారని, నేను అక్కడ ఇళ్లు కొన్న తర్వాత కేవలం 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి కావటంతోఆశ్చర్య పోయాను అన్నారు. మన దేశంలోను ఇదే తరహాలో భూములు రిజిస్ట్రేషన్ జరగాలన్నారు. విజనరీ నాయకులు గౌరవ ప్రధాన మంత్రి నాయకత్వంలో భూముల రీ సర్వే ప్రారంభించటం జరిగిందని, ఇప్పటికే 90 శాతం భూ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందన్నారు. వందసంవత్సరాల తర్వాత జరుగుతున్న భూముల సర్వే కాబట్టి జాగ్రత్తగా చేయాలన్నారు. సిబ్బంది కొరత, నిధులు సమస్య అధిగమించటం పై దృష్టి సారించామని, నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తిచేయాలని అధికారులకు సూచిస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్నిఉపయోగించుకోవాలన్నారు. భూ సర్వే వలన చిన్న సన్నకారు రైతులకు, మహిళలు, ఎస్సీ ఎస్టీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏపి రాజధాని అమరావతి అద్భుతంగా నిర్మితంఅవుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో భూ రికార్డుల డిజిటలైజేషన్ సజావుగా జరిగేలాచూడాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా కేవలం భూమిని కొలవడం మాత్రమే కాదు విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నామని, చారిత్రక భూ వివాదాలను పరిష్కరిస్తున్నామని మరియు బలమైన, ఆధునికమరియు సమగ్ర భూ రికార్డుల వ్యవస్థకు పునాది వేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూహక్కుల రికార్డులు పారదర్శకంగా, ఖచ్చితత్వంగా రూపొందించాలని అదేశించారన్నారు. భూముల సర్వే, రీ సర్వే జాతీయ వర్క్ షాపు పురోగతిని సమీక్షించడానికి, ఆవిష్కరణలను పంచుకోవడానికిమరియు భూ సంస్కరణలు మరియు ఆధునీకరణకు నిబద్ధతను బలోపేతం చేయడానికి ఒక గొప్పఅవకాశంగా పనిచేస్తుందన్నారు. లక్షలాది మంది రైతులు మరియు భూ యజమానుల గౌరవం మరియు జీవనోపాధికి భూమి కేంద్రీకృతమై ఉందని గుర్తించి, ప్రస్తుత భూముల సర్వే వ్యవస్థలను సమీక్షించడానికి తక్షణ చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో గత పాలకులు 6,688 గ్రామాలలో అస్తవ్యస్తంగా రీ సర్వే చేసినట్లు గుర్తించామన్నారు. పిర్యాధుల పరిష్కారంకు తక్కువ సమయంకేటాయించటంతో పాటు, సర్వే హద్దు రాళ్లపై బొమ్మలు పెట్టుకొని నిధులు దుర్వినియోగం చేశారన్నారు. దీంతో భూ యజమానులు గతంలో జరిగిన రీ సర్వే పై పెద్ద ఎత్తున లోపాలు, పిర్యాదులు తెలిపారన్నారు. దీనిపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదేశాల మేరకు రెవెన్యూ మంత్రిగా రీ సర్వే జరిగిన ప్రతి గ్రామంలోను ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి భూ యజమానుల నుంచి పిర్యాదులు స్వీకరించటం జరిగిందన్నారు. గ్రామ సభల్లోఅందిన, 2.8 లక్షలకు పైగా ఫిర్యాదులను పరిష్కరించటం జరిగిందన్నారు. భూముల రీసర్వే పై పారదర్శకత, నమ్మకాన్ని పెంపొందించడానికి మండలానికి ఒక గ్రామాన్ని ఎంచుకుని పైలట్‌రీసర్వేను ప్రారంభించామన్నారు. 626 పైలెట్ గ్రామాల్లో 13,41,513 ఎకరాల విస్తీర్ణంలోని భూములను రీ సర్వే పునఃసర్వే అత్యంత శ్రద్ధతో చేశామన్నారు. ఈ పైలట్



గ్రామాలు అభ్యాస కేంద్రాలుగాపనిచేశాయని మరియు ఆచరణాత్మక సవాళ్లను అర్థం చేసుకోవడానికి ఒక చక్కని పద్ధతిని రూపొందిచటానికి సహాయపడిందన్నారు. కొత్త వ్యవస్థ కింద: సర్వే ప్రక్రియ, సరిహద్దు వివాదాలకారణాలు మరియు వాటి పరిష్కారం కోసం చట్టపరమైన విధానాలను వివరించడానికి ప్రీ సర్వే అవగాహన ప్రచారాలు మరియు గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతిగ్రామాన్ని 200-250 ఎకరాల బ్లాకులుగా విభజించారు, ప్రతి బ్లాక్‌కు అంకితమైన గ్రామ రీ సర్వే బృందంను కేటాయించామన్నారు. భూ సర్వే పై సమర్థవంతమైన సమాచారం భూ యజమానులకుఅందించటానికి ప్రతి గ్రామానికి కమ్యూనికేషన్ బృందం ఏర్పాటు చేసి, రియల్ టైమ్ లో సమాచారంను అందించటానికి ప్రతి బ్లాక్‌కు 50-70 మంది భూ యజమానులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పటుచేశామన్నారు. జవాబుదారీతనాన్ని మరింత పెంచేందుకు సర్వే బృందం పనిపైఏదైనా అభ్యంతరం తలెత్తితే, తిరిగి సర్వే చేయటానికి వేరే బృందాన్ని నియమిస్తున్నా మన్నారు. సర్వేబృందాలు మ్యాప్ కోఆర్డినేట్‌లపై ఆధారపడకుండా గట్లు మరియు మూలలతో సహా ప్రతి ఒక్క క్షేత్రాన్ని భౌతికంగా కొలుస్తున్నారని, భూ యజమానులు మరియు ప్రక్కనే ఉన్న భూయజమానులు హాజరు కావాలని , భూ యజమానులు తమ భూమి యొక్క జియోట్యాగ్‌చేయబడిన ఫోటోలను అప్‌లోడ్ చేయాలని, పారదర్శకత యొక్క మరొక లేయరును జత చేయాలనిఅదేశించామన్నరు., విజయవంతమైన పైలట్ తర్వాత, రెండవ దశలోకి 749 గ్రామాల్లో 14,15,358ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న భూముల రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగాభూముల రీ సర్వేను 2027 చివరి పూర్తి చేసేందకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి మూడునెలలకు ఒక కొత్త దశ ప్రారంభించబడింది, మిగిలిన 8,751 గ్రామాలను రీ సర్వే పూర్తి చేస్తామన్నారు.

## మారనున్న కుంకలగుంట రేపురేఖలు

సత్తెనపల్లి, మే 15 ప్రభాతవార్త : టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి చొరవతో కుంకలగుంట గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో గ్రామానికి ఔటర్ బైపాస్‌ను నిర్మించనున్నారు. కుంకలగుంట -






ముప్పాళ్ల రహదారుల నిర్మాణం కొరకు రూ.8.10 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఇప్పటికే జీవో రిలీజ్ అయ్యింది. పదకొండు నెలలు కూటమి ప్రభుత్వ హయాంలో రూ.10 కోట్ల నిధులు గ్రామాభివృద్ధికి మంజూరైనట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి తెలియజేశారు.

## పారిశ్రామికాభివృద్ధి లో బీసీల భాగస్వామ్యం పెంచాలి : కేసన శంకరరావు


మంగళగిరి, మే 15, ప్రభాతవార్త : విజన్ 2047 స్వర్ణాంధ్ర సాధనకు తప్పనిసరిగా,రాష్ట్ర వర్తకవాణిజ్య పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో వెనుకబడిన తరగతులకు చెందిన బీసీల భాగస్వామ్యం పెంచాలంటూ,ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పునరుద్ఘాటించారు. గురువారం



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసును, కేసన నేతృత్వంలోని పలువురు బీసీ నేతలు కలిసి,ఆ మేరకు విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఇంకా బీసీల సంక్షేమం అభివృద్ధి కోసం నియమించిన అన్ని కమిషన్ల రాష్ట్రంలో బీసీలు 52 శాతంగా ఉన్నారని,వారు సామాజికంగా ఆర్థికంగారాజకీయంగా అన్ని రంగాలలో,అన్ని విధాల వెనుకబడి ఉన్నారని అందులో తెలియజేశారు. బీసీల సాధికారితకు కట్టుబడ్డ బీసీల పార్టీగా తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్. డి.ఏ కూటమి ప్రభుత్వం గతంలో 201520 పారిశ్రామిక విధానంలో బీసీ పారిశ్రామికవేత్తలకు ఎన్నో రాయితీలు కల్పించిందన్నారు. బీసీ సబ్ ప్లాన్ ద్వారా పారిశ్రామిక విధాన అమలుకు బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయించాలన్నారు. వర్తక వాణిజ్యపారిశ్రామిక రంగాల అభివృద్ధి ద్వారా సంపదను సృష్టించి,పేదలు బడుగుల సంక్షేమం అభివృద్ధికి ఆ సంపదను పంచడం ద్వారా,పేదరిక నిర్మూలనకు కృషి చేయాలనుకుంటున్న ఎన్ డి ఏ సర్కారు ను బీసీ సమాజం అభినందిస్తుందన్నారు. చంద్రబాబు సర్కారు అమలు చేస్తున్న "మార్గదర్శిబంగారు కుటుంబాలు" అన్న శాస్త్రీయ ఆర్థిక విధానం ద్వారా పేదరిక నిర్మూలన తప్పక సాధ్యపడుతుందన్నారు. ఇంకా ఎన్నికల వాగ్దానం మేరకు వెంటనే బీసీలకు రక్షణ చట్టం చేయాలని, ఓబీసీలకు చట్టసభల లో 33 శాతం, స్థానిక సంస్థలు నామినేటెడ్ పోస్టులునామినేషన్ వర్క్స్ లలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అలాగే బీసీ నిరుద్యోగుల కోసం ఎస్సీ ఎస్టీల వలెనే బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని,ఉద్యోగుల ప్రమోషన్ల లో కూడా రిజర్వేషన్లివ్వాలని వారు కోరారు. ఇంకా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా మహాత్మా జ్యోతిబా పూలే సావిత్రిబాయి పూలే ల పేరిట ప్రపంచంలోనే అద్భుతమైన కట్టడం గా స్మృతి వనాన్ని నిర్మించాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల స్థలంలో,ఐదు కోట్ల బడ్జెట్ తో మహాత్మా పూలే బీసీ భవనాలను అన్ని హంగులతోఅధునాతనంగా నిర్మించాలన్నారు. ఇంకా బీసీ గురుకుల విద్యాలయాలు,స్టడీ సర్కిళ్లు,వసతి గృహాలను సకల సౌకర్యాలతో,బీసీ విద్యార్థులకు చాలినన్ని నిర్మించాలని శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞాపన పత్రాన్ని సమర్పించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షులు ఎంబిసి మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్,ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు,రాష్ట్ర కార్యదర్శి కోలా అశోక్, యువజన విభాగ రాష్ట్ర నాయకులు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

గుంటూరుతూర్పు, 15 మే, ప్రభాతవార్త : అనారోగ్యం కారణంగా ఏ ఒక్కరూ ఇబ్బందులకు గురి కాకూడదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఐపీడీ కాలనీకి చెందిన కారంశెట్టి ఆశాజ్యోతి కిడ్నీలు దెబ్బతినడంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకున్నారు. వైద్యం కోసం అప్పులు చేశారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ సాయం కోసం ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ను సంప్రదించగా వెంటనే ఆయన స్పందించారు.



ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కు అవసరమైన దరఖాస్తులు తెప్పించారు. తమ కార్యాలయం నుంచి దరఖాస్తు చేయించి ఎప్పకప్పుడు ఫాలో అప్ చేశారు. దీంతో ఆశాజ్యోతికి రూ.6,52.807 చెక్కు మంజూరైంది. దీంతో గురువారం బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి చెక్కును ఎమ్మెల్యే నసీర్ అందించారు. ఈ సందర్భంగా ఆమె సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్ల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశామని, బాధితులకు అండగా నిలవడం మా బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

## యుద్ధం మొదలైంది..మధ్యలో ఆగిపోయింది.. ఎందుకు మొదలుపెట్టారో ?

### - కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్



గుంటూరు తూర్పు, (కార్పోరేషన్) మే 15 ప్రభాతవార్త : యుద్ధం మొదలైంది..మధ్యలో ఆగిపోయింది..ఎందుకు మొదలుపెట్టారో ? ఎవరికీ తెలియదని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ అన్నారు. గురువారం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. యుద్ధం మొదలైన ప్పుడు అందరం ఊహించాం. 1971లో ఇందిరా గాంధీ చేసినట్లు జరుగుతుందని, లేదా 1999లో వాజ్‌పేయ్ కార్గిల్ యుద్ధం జరిగినట్లు జరుగుతుందని భావించా మన్నారు. భారత సైనికులకు తలవంచి, వినయంగా సమస్కారాలు తెలియజేస్తున్నా నన్నారు. అమెరికా జోక్యం బాగా కనిపిస్తోందని, ట్రంప్ చేతిలో మోడీ కీలుబొమ్మగా మారారని ఢిల్లీలో అందరు అనుకుంటున్నార న్నారు. ట్రంప్ కి, భారతదేశానికి ఏంటి రహస్య ఒప్పందని ఆయన ప్రశ్నించారు. భారత ప్రభుత్వం పార్లమెంటు ఉభయ సభలను సమావేశపరచి, చర్చించి ఉంటే బాగుండేదని, భారతదేశ ఔన్నత్యానికి, సార్వభౌమాధి కారానికి బిజెపి మచ్చ తెచ్చిందన్నారు. ప్రతిపక్షాలను పరిగణలోకి తీసుకోవాలని, ఇందిరాగాంధీ, వాజ్‌పేయ్ హయాంలో ప్రతిపక్షాలను సంప్రదించి చర్చించేవారన్నారు. కానీ మోడీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు.

**మానవ ఉల్లంఘన ...**

బిజెపి పాలనలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్నారు. బిజెపి గూండాలు ఆదివాసి పురుషుల పురుషాంగాలను, మహిళల రొమ్ములను కోస్తున్నారని, చిన్న బిడ్డలను కూడా చంపుతున్నారని, సనాతన ధర్మం అంటే ఇదా అని ఆయన ఘాటుగా విమర్శించారు. శ్రీరాముని పేరు చెప్పి అరకు అడవుల్లో ఉన్న ఆదివాసీల పురుషాంగాలను, ఆడవాళ్ళ రొమ్ములను కోస్తున్నారన్నారు. ఆదివాసి బిడ్డలపై బిజెపి గూండాలు చేస్తున్న అరాచకాలను రాసేదానికి మీడియా భయపడుతుందన్నారు. ఎస్సీలకు విద్యాసంస్థల్లో కనీస వసతులు లేవని, సీట్లు ఇవ్వడం లేదన్నారు. 25 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంక్‌లు ఒక్క శాతం రుణాలు ఇస్తున్నాయని, దాదాపు 50 శాతం ఓబీసీలు వుంటే వారికి 2 శాతం రుణాలు బ్యాంక్‌లు ఇస్తున్నాయన్నారు. ఒక్క శాతం ఉన్న మార్వాడీలకు, గుజరాతీలకు 50 శాతం పైగా బ్యాంక్‌లు రుణాలు ఇస్తున్నాయన్నారు. భారతదేశ ఆర్థిక సంపదంతా కొందరికే పోతుందన్నారు. జాతీయ బ్యాంక్‌లు కొందరు సొత్తు కాదని అందరి సొత్తు అన్నారు. కర్ణాటక ప్రభుత్వం ప్రభుత్వ కాంట్రాక్టులు 25 శాతం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ కాంట్రాక్టులు ఎస్సీ, ఎస్టీలకు ఎందుకు ఇవ్వడం లేదని చింతా మోహన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కర్ర తుమ్మ చెట్లు కొట్టే కాంట్రాక్టు కూడా సన్నిహితులకు రూ.80 కోట్ల రూపాయల కాంట్రాక్టు ఇచ్చారన్నారు. మైన్స్ ఆఫీసుకు నేను వెళ్ళానని, రాష్ట్రంలో ఎన్ని వేల మైన్స్ ఉన్నాయని, ఒక అధికారిని అడుగగా వేల మైన్స్ ఉన్నాయని ఆ అధికారి బదులివ్వడం జరిగింద న్నారు. అందులో ఒక్కరైనా ఎస్సీ, ఎస్టీ ఉన్నారా అన్నారు. లంచాలు తీసుకొని వేలకోట్ల రూపాయల విలువైన మైన్స్, గనులు, ఇసుక కేటాయింపులు ఇస్తున్నారన్నారు. సహజ వనరులు ఏ ఒక్కరి సొత్తు కాదని, సహజ వనరులను సమానంగా అందరికీ పంచాలన్నారు.

## పట్టణంలోని పలు వార్డులకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాల నాయకులను అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,మే15,ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో బాగంగా ఎన్నికైన పట్టణంలోని పలు వార్డుల నాయకులను గురువారం క్యాంప్ కార్యాలయంలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకోసం విశేష కృషి చేసిన వారిని పార్టీలో సముచిత స్థానం కల్పించేవిధంగా పార్టీ ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ప్రజలల్లోకి తీసుకుపోయి, వారికి వివరించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని నూతన



కార్యవర్గాల నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన 36వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు ఈదర వెంకట్రావు, బండారు కాశియ్య, 9వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు గోపిదేశి వెంకటేశ్వర్లు, మామిళ్ల దాసు, 10వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అజారుద్దిన్, షేక్ దరియావలి, 30వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు ఖాజ, షబ్బీర్ ఆలీ, 35వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు శివరామకృష్ణ, జరపల చిననాయక్‌లను ప్రత్తిపాటి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మక్కెన నరసింహారావు, తోట సత్యనారాయణ, పట్టణానికి చెందిన పలు వార్డులకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట రూరల్ పరిధిలో పలు గ్రామాలలో విద్యుత్‌శాఖ దాడులు నిర్వహించి అనధికారికంగా విద్యుత్ వినియోగం చేస్తున్న వారినుంచి రూ 10లక్షలు అపరాధ రుసుం

**చిలకలూరిపేట,మే15,ప్రభాతవార్త:** చిలకలూరి పేట రూరల్ పరిధిలోని 19 గ్రామాలలో గురువారం సిఆర్‌డిఎ సర్కిల్ విద్యుత్‌శాఖ



పర్యవేక్షక ఇంజనీర్ పి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో, గుంటూరు టౌన్2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై ఎడుకొండలు, డిపిఈ అండ్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ సిబ్బంది 44 బ్యాచీలుగా విడిపోయి 19 గ్రామాలలో విద్యుత్ దాడులు నిర్వహించి అనధికారికంగా అధిక లోడ్ విద్యుత్ వినియోగం చేసుకుంటున్న 150 సర్వీసులను గుర్తించి వారికి రూ6లక్షలు అపరాధ రుసుము జరిమానాగా విధించినట్లు అధికారులు ఏడిఈ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. అదేవిధంగా అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న 4సర్వీసులకు రూ1,20,000, ఒక సర్వీస్‌కు విద్యుత్ కనెక్షన్ బిల్లింగ్‌లో తేడా ఉన్నందుకు రూ3,00,000 అపరాధ రుసుము వేసినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం అనేది సామాజిక నేరం క్రింద పరిగణించబడుతుందని, దానికి జైలు శిక్షకూడా ఉంటుందని, రాబోవు రోజులలో ఉన్నతాధికారుల ఆదేశాలతో అనధికార విద్యుత్ వినియోగం చేసినట్లయితే వారిపై కేసులు కూడా నమోదు చేస్తామని వారు వివరించారు. తరచూగా ఈ దాడులను విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని వారు తెలియచేశారు. ఈ దాడులలో డిప్యూటీ ఈఈలు ఎ గుర్నాధరావు, ఎన్ మల్లికార్జున ప్రసాద్, కె రవికుమార్, 11మంది ఎఈలు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నట్లు చిలకలూరిపేట డిఈఈ ఆర్ అశోక్‌కుమార్, రూరల్ ఎఈ కె సురేష్‌లు తెలిపారు.

## మహిళను హతమార్చిన కేసులో ముద్దాయికి ఉరిశిక్ష

**నరసరావుపేట క్రైం, మే 15 ప్రభాతవార్త :** మహిళను హతమార్చిన కేసులో ముద్దాయికి న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ ఉరిశిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. ఏపిపి దేశిరెడ్డి మల్లారెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. వివరాలను గురువారం తెలిపారు. పట్టణ సి.ఐ. అశోక్‌కుమార్, ఎస్.ఐ. వెంకటేశ్వర రావులు ఈ కేసులో పూర్తి స్థాయిలో సాక్ష్యాలను సేకరించి ముద్దాయిని కోర్టులో హాజరుపరిచారు.



ఎస్ఆర్‌కెటి కాలనీకి చెందిన షేక్.సల్మా 2023 మే నెలలో హత్యకు గురైంది. ఈ కేసులో ముద్దాయి అయిన ముళ్ళపంది అలియాస్ తన్నీరు అంకమ్మరావు హత్య చేసి అక్కడి నుండి పరారయ్యాడు. సాంబశివ ఫర్నీచర్ షాపు యజమాని నరేంద్ర తన షాపు ముందు గుర్తు తెలియని మహిళ చనిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేసి సిసి పుటేజ్ ఆధారంగా ముళ్ళపంది (అలియాస్ తన్నీరు అంకమ్మరావు) ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

## పర్వీన్ కుటుంబానికి అండగా ఉంటా : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**యడ్లపాడు, మే 15, ప్రభాతవార్త :** పిడుగుపాటు మృతులకు ప్రభుత్వం అందించే నాలుగు లక్షలతో పాటు, ఈ గ్రామ పోర్టల్‌లో మృతురాలి వివరాలు నమోదైనందున కేంద్రం నుంచి రావాల్సిన రెండు లక్షల సాయం వెంటనే పర్వీన్ కుటుంబానికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. పొలంలో కూలీపనికి వెళ్లి పిడుగుపాటుకు గురై మరణించిన షేక్ పర్వీన్ కుటుంబానికి అండగా ఉంటానని, చిన్న వయస్సులో తల్లిని కోల్పోయిన పిల్లల్ని చూస్తే చాలా బాధ కలిగించిందన్నారు. మండల పరిధిలోని కారుచోల గ్రామానికి చెందిన షేక్ పర్వీన్ బుధవారం పొలంలో కూలిపనికి వెళ్లి పిడుగుపడి మృతి చెందగా గురువారం ఆమె మృతదేహానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన ఆమె భర్త, పిల్లల్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.



పిల్లల చదువులు కొనసాగింపులని, పర్వీన్ భర్తకు సూచించారు. కాయ కష్టంతో బతికే పర్వీన్ కుటుంబం, ఆమె మరణంతో దిక్కుతోచని స్థితిలో పడిందని ఆవేదన వ్యక్తపరిచారు. పిడుగుపడి మరణించిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన నాలుగు లక్షల ఆర్థికసాయంతోపాటు, ఈ గ్రామ పోర్టల్‌లో వివరాలు నమోదుచేసుకున్నందున, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా మంజూరయ్యేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. మృతురాలి కుటుంబానికి తక్షణ సాయంతో మట్టి ఖర్చుల నిమిత్తం 50వేలు అందించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, టీడీపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, జువ్వాజి మధన్ మోహన్, గట్టినేని రమేష్, ముల్లా, కరిముల్లా, వెంకట కోటయ్య, గోడ, మునప్, సద్దాం, గౌస్, కరిముల్లా, మస్తాన్‌రావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

**యడ్లపాడు, మే 15, ప్రభాతవార్త :** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు మండల కేంద్రంలోని యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఏర్పాట్లు అయినట్లు పాఠశాల



ప్రధానోపాధ్యాయురాలు ఘంటశాల విజయభారతి తెలిపారు. 2024=25 విద్యాసంవత్సరంలో మార్చిలో రాసిన వార్షిక ఫలితాల్లో విఫలమైన విద్యార్థుల కోసం ఈ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 19వ తేది నుంచి 26వరకు యడ్లపాడు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించే ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.45వరకు పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. హాల్ టికెట్లను విద్యార్థులు తాము చదివిన హైస్కూల్ హెచ్‌ఎమ్‌ల వద్ద నుంచి పొందవచ్చునన్నారు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు 50రూపాయల ఫెనాల్టీతో చెల్లించి హాల్ టికెట్లు తక్షణమే పొందవచ్చునని సూచించారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వ వైఖరి మారాలి

### ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక సంఘ కార్యదర్శి కె కోటేశ్వరరావు

**చిలకలూరిపేట,మే15,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాలు కోరిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలని ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక సంఘ కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావులు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. హైస్కూల్‌లో ఉపాధ్యాయ, విద్యార్థులు నిష్పత్తి 1.:45 గా పాటిస్తే స్కూల్ అసిస్టెంట్లు ఎక్కువ మిగులుతారు అని అన్నారు. వీరిని ప్రాథమిక పాఠశాలకు పంపటం



తిరోగమని చర్య అవుతుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో డిఎడ్ పూర్తిచేసిన వారిని కొనసాగించాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం సరికాదని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూల్‌కు పంపకుండా. ఎస్‌జిలకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా మెగా డీఎస్సీకి పోస్టుల ఎక్కువ వచ్చి ప్రభుత్వం కూడా నిరుద్యోగ ఉపాధ్యాయులకు మేలు చేసిన వారవుతారని వారు వివరించారు. ఇబ్బందికరంగా మారిన వెబ్ కౌన్సిలింగ్‌లో ఇబ్బందులు ఎక్కువ కాబట్టి మాన్యువల్‌గా అవకాశం ఇవ్వాలని ఎస్‌టియు డిమాండ్ చేస్తుందని వారు తెలిపారు వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు చొరవ చూపాలని తెలియచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకోవాలని ఎస్‌టియు పక్షాన వారు కోరారు. ఈ సమావేశంలో ఎస్‌టియు నాయకులు వి అక్కయ్య, యం కోటేశ్వరరావు, వి జయప్రకాష్, ముగ్బుల్ భాషా, దుర్గా ప్రసాద్, జి కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, బి రవి, షేక్ మస్తాన్‌వలి, మల్లేశ్వరరావు, మహిళ కన్వీనర్ యం శారద తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేసిన అధికారులు

### - అధికారులకు సవాలుగా మారిన ఉపాధ్యక్షుని ఎన్నిక
### - ఈ నెల 19న మండల పరిషత్ ఉపాధ్యక్షుని ఎన్నిక

**కారంపూడి, మే 15 ప్రభాతవార్త:** కారంపూడి మండల పరిషత్ ఉపాధ్యక్షుని ఎన్నిక అధికారులకు సవాలుగా మారింది. మార్చి నెలలో ఎన్నికల కమిషన్ ఉపాధ్యక్షుని ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినా మండలంలోని 14 ఎంపీటీసీలు ఎన్నికకు గైర్హాజరయ్యారు. మండలంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులుండగా అందులో ఇద్దరు తెదేపాలో ఉన్నారు. మిగిలిన 11 వైకాపా ఎంపీటీసీలు సమావేశానికి, ఎన్నికలకు గైర్హాజరయ్యారు. తమకు, తమ ఎన్నికకు రక్షణ కల్పించాలంటూ




వైకాపా ఎంపీటీసీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎంపీటీసీ సభ్యులకు పోలీసులు రక్షణ కల్పిస్తూ స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టారు. అయినా మార్చి 27న ఎన్నికకు వైకాపా ఎంపటీసీలు హాజరుకాలేదు. ఎన్నికల అధికారి సిద్ధ లింగమూర్తి ఎన్నికల కమిషన్‌కు ఎంపీటీసీ సభ్యులు అందుబాటులో లేరని సమాచారం అందించారు. రెండు రోజులపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోలీసుల పూర్తి రక్షణలో ఓటుహక్కును కల్పించే విధంగా చర్యలు చేపట్టినప్పటికీ 28వ తేదీన వైకాపా ఎంపీటీసీలు ఉపాధ్యక్షుని ఎన్నికకు గైర్హాజరయ్యారు. దీంతో ఎన్నికల అధికారి ఎన్నికల కమిషన్‌కు సభ్యులు ఎవరూ రాలేదని సమాచారం అందించారు. ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి మండలంలోని 14 మంది ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేశారు. అందుబాటులో ఉన్నవారికి నోటీసులు అందించారు. అందుబాటులో లేనివారికి సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారాన్ని అందజేశారు. ఎన్నిక పగడ్బంధీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇద్దరు లేదా ముగ్గురు వచ్చినా తక్షణమే ఉపాధ్యక్షుని ఎన్నిక నిర్వహించాలని ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దీంతో వైకాపా నాయకుల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే కొంతమంది వైకాపా సభ్యులు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో చర్చలు జరిపినట్లు సమాచారం. తనకు అనుకూలంగా ఉండాలని చర్చల్లో వైకాపా ఎంపీటీసీ సభ్యులకు తెలిపినట్లు తెలుస్తుంది. ఏదేమైనా కారంపూడి మండల పరిషత్ ఉపాధ్యక్షుని పదవి తెదేపా కైవసం చేసుకోనున్నట్లు తెలుస్తుంది.

## నేటినుంచి సిఆర్‌క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల ఆహ్వాననాటిక పోటీలు

**చిలకలూరిపేట,మే15,ప్రభాతవార్త:** సిఆర్‌క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని సిఆర్ క్లబ్ ఆడిటోరియంలో 16,17,18 తేదీలలో ఉభయ తెలుగురాష్ట్రాల ఆహ్వాననాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ నిర్వాహకులు గురువారం తెలియచేశారు. మొదటి రోజున సిఆర్‌క్లబ్ మాజీ అధ్యక్షులు మద్ది లక్ష్మయ్య కళాప్రాంగణంలో జరిగే ఈ నాటికల పోటీలను మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, సిఆర్‌క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, టివి, రంగస్థల నటులు మల్లాది శివన్నారాయణ, రంగస్థల నటులు, దర్శకులు జరుగుల రామారావు, సిఆర్‌క్లబ్ కోశాధికారి మక్కెన నరసింహారావు, షేక్ జమాల్‌భాషా, గోరంట్ల నారాయణలు పాల్గొంటారు. మొదటి రోజు 16వ తేదిన కళాంజలి హైదరాబాద్ వారిచే " రైతే రాజు" నాటిక, మద్దుకూరి క్రియేషన్స్ చిలకలూరిపేట వారిచే "మా ఇంట్లో మహభారతం" నాటిక, యువభేరి హైదరాబాద్ వారిచే "నా శత్రువు" అనే మూడు నాటికలు ప్రదర్శించబడతాయి. రెండవ రోజు 17వ తేదిన దర్శకుడు, రంగస్థల కళాకారుడు స్వర్గీయ ఇందుపల్లి రాజ్‌కుమార్ కళాప్రాంగణంలో మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే "ఇది రహదారికాదు" అను నాటిక, కరీంనగర్ కళాభారతి వారిచే "చీకటిపువ్వు".భద్రం ఫౌండేషన్ విశాఖ పట్నం వారిచే "దొందు దొందే" అనే మూడు నాటికలను ప్రదర్శించడం జరుగుతుంది. మూడవరోజు 18వ తేదిన అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారిచే "చిగురుమేఘం" అనే నాటిక,ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ చిలకలూరిపేట వారిచే 'ఆలితో సరదాగా" అనే నాటిక, అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరువారిచే," నాన్న నేనొచ్చేస్తా" అనే మూడు నాటికలను కళాకారులు ప్రదర్శిస్తారని వారు తెలిపారు. కాగా మూడవరోజు కార్యక్రమంలో టివి రంగస్థల నటీమణి గుడివాడ లహరికి సత్కార కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, యడ్లపాడు అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, రచయిత, రంగస్థల నటులు వైఎస్ కృష్ణేశ్వరరావు, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు, రచయిత అద్దేపల్లి భరత్‌కుమార్, పర్చూరు రోటరిక్లబ్ మాజీ అధ్యక్షులు నాగబైరు శ్రీనివాసరావు, సోమిశెట్టి అమృతవర్షిణీలు పాల్గొంటారని వారు తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చిలకలూరిపేట మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, రెండవరోజు డాక్టర్ కొమ్మినేని రేష్మా, మూడవ రోజున డాక్టర్ చెరుకూరి తేజస్వీలు చేస్తారని వారు తెలిపారు. ప్రత్యేక ప్రదర్శనగా మూడవ రోజున పౌరాణిక కళాకారుడు గొట్టిపాటి కోటేశ్వరరావుచే శ్రీ కృష్ణ మానసం ఏకపాత్రాభినయం జరుగుతుందని వారు తెలిపారు. ఈ పోటీలలో ప్రతి నాటికకు పారితోషికం రూ15వేలు, జ్ఞాపిక, ఉత్తమ ప్రదర్శనకు రూ 22వేలు, జ్ఞాపిక, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ 20వేలు జ్ఞాపిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ 18వేలు నాటిక, జ్యూరి బహుమతి నాటికకు రూ 17వేలు జ్ఞాపికలు అందచేయడం జరుగుతుందని వారు వివరించారు. ఇదిగాక ఉత్తమ రచన,దర్శకత్వం, నటుడు,నటి, క్యారెక్టర్ యాక్టర్, విలన్, హస్యనటులకు ప్రత్యేకంగా బహుమతులు అందచేయబడుతుందని వారు వివరించారు. కావున ఈ పోటీలను చిలకలూరిపేట నియోజకవర్గంలోని ప్రజలు, కళాకారులు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయవలసినదిగా వారు కోరారు.

## ఈనెల 29న జరిగే మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి : ప్రజలను కోరిన సీనియర్ వైద్యులు ముద్దన రమేష్‌బాబు

**చిలకలూరిపేట,మే15,ప్రభాతవార్త:** మాజీమంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 29వ తేదిన పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శంకరకంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు ముద్దన రమేష్‌బాబు తెలిపారు.



ఈఉచిత మెగా వైద్య శిబిరంలో నియోజకవర్గానికి చెందిన ప్రజలందరూ పాల్గొని కంటి పరీక్షలను చేయించుకోవచ్చునని, అదేవిధంగా చుక్కాలతో బాధపడేవారికి పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి ఉచితంగా పెదకాకానిలో ఉన్న శంకరకంటి ఆసుపత్రికి తీసుకొనివెళ్లి శస్త్ర చికిత్సలు చేయించి తిరిగి చిలకలూరిపేటకు తీసుకువస్తారని ఆయన వివరించారు. ఏన్నో సంవత్సరాలుగా ప్రజలకు తన పుట్టినరోజున ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు కంటి చూపును ప్రసాదిస్తున్న స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సేవలు వెలకట్టలేనివని డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి మంత్రి విజయ్‌షా క్షమాపణ చెప్పాలి : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు యం రాధాకృష్ణ

**చిలకలూరిపేట,మే15,ప్రభాతవార్త:** విజయసింధూరం కార్యక్రమంలో కీలక భాధ్యత నిర్వహించి దేశమాత నుదుట విజయ సింధూరం దిద్దిన కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపికి చెందిన మధ్యప్రదేశ్ మంత్రి కె విజయ్‌షా మీద కఠిన చర్యలు తీసుకోవాలని, మంత్రి వర్గంనుండి కాకుండా శాసనసభ్యుడిగా కూడా అనర్హత వేటు వేసి క్షమాపణ చెప్పించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యం రాధాకృష్ణ గురువారం డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా సాధించిన విజయఖ్యాతి బిజెపి నాయకులు వివక్షా పూరిత వ్యాఖ్యల ద్వారా నీరుకారిపోయేలా చేశారని ఆయన అన్నారు. విజయ్‌షా చేసిన వ్యాఖ్యలను బిజెపి నాయకత్వం ఖండించకపోవడం, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కారణంగా విజయ్‌షా



చేసిన వ్యాఖ్యలు బిజెపి వ్యాఖ్యలుగా పరిగణించాల్సి వస్తుందని అన్నారు. తక్షణమే అతనిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని, మహిళా లోకాన్ని గౌరవించాలని, మహిళలలో ఉన్న ఆత్మన్యూన్నతా భావాన్ని పోగొట్టాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యేలు

### - కారంపూడిలో పశువుల దాణా, పశుగ్రాస విత్తనాల పంపిణీ

**కారంపూడి, మే 15 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబులు అన్నారు. కారంపూడి పశువైద్యశాలలో జరిగిన పశువుల దాణా, పశుగ్రాస విత్తనాల



పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎనిమిది టన్నుల పశువుల దాణాను 50శాతం సబ్సిడీపై, 1000 కేజీల పశుగ్రాస విత్తనాలను 75 శాతం సబ్సిడీపై అర్హత కలిగిన పాడి రైతులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డా॥ కె.కాంతారావు, పిడుగురాళ్ల సహాయ సంచాలకులు డా॥ మోహనరెడ్డి, కారంపూడి ఇన్‌ఛార్జి పశువైద్యులు డాక్టర్ డి.దిలీప్, గుంటూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, కారంపూడి పశువైద్య అంబులెన్సు డాక్టర్ రాగిడి శివ సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, నాయకులు పంగులూరు అంజయ్య, పంగులూరు పుల్లయ్య, సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, ఉన్నం లక్ష్మీనారాయణ, శెట్టి హనుమంతరావు, చప్పిడి రాము, గోళ్ల సురేష్‌యాదవ్, కర్ణ సైదారావు, కుర్రి శివారెడ్డి, మునుగోటి సత్యం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మండలంలోని రైతులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పశువైద్యసిబ్బంది బొగ్గవరపు బ్రహ్మం, కారంపూడి మండలంలోని పశుసంవర్థక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొని విజయవంతం చేశారు.

## పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో ప్రభుత్వ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మించాలి : ప్రజా సంఘాల నాయకులు

**చిలకలూరిపేట,మే15,ప్రభాతవార్త:** పట్టణం నడిబొడ్డులో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో ప్రభుత్వ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మించాలని కోరుతూ ఈనెల 17వ తేది శనివారం సాయంత్రం 4గంటలకు అఖిలపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సిపిఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పేలూరి రామారావు



మాట్లాడుతూ పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలం సంవత్సరాల కాలంగా నిరుపయోగంగా ఉన్నదని, ఆ స్థలంలో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మించడం వలన చాలా ఉపయోగంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ వైద్యశాఖ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు నాయడు శివ, తన్నీరు వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, వేముల వెంకటేశ్వర్లు, బొంతా భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


**మాచర్లటౌన్, మే 15 ప్రభాతవార్త:** పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం హర్షించదగ్గ విషయ మన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాన్ని




ఏర్పాటు చేసిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హనుమంతరావు, యాజమాన్యం రామకృష్ణ, శ్రీధర్‌గుప్తా, సదాశివరాజు, హరీష్‌చంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

**నరసరావుపేట క్రైం, మే 15 ప్రభాతవార్త :** నరసరావుపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో కను మూసిన అజయ్‌కుమార్ కుటుంబానికి



పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ జె.వి.సంతోష్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయం అంద జేశారు. రూ.5 లక్షల చెక్కును ఈ సందర్భంగా మృతుని కుటుం బానికి అందించారు. హోంగార్డు సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్ళి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్న హోంగార్డ్ ఆర్.ఐ. ఎస్.కృష్ణను ప్రత్యేకంగా అదనపు ఎస్పీ జె.వి.సంతోష్ అభినందించారు.

**ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు సత్కారం...**

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు జిల్లా అదనపు ఎస్పీ జె.వి.సంతోష్ సత్కరించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉద్యోగ విరమణ చేసిన వి.వై. స్వామిని వారు సత్కరించారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షల చెక్కును అందజేశారు. భవి ష్యత్తులో వారికి ఎటువంటి సహకారం కావాలన్నా ఆ కుటుంబాలకు అందజేస్తా మని అదనపు ఎస్పీ జె.వి.సంతోష్ తెలియజేశారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్.ఐ. ఎస్.కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## మాచర్లలో 19న మినీ మహానాడు

**మాచర్ల, మే 15 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో ఈ నెల 19న మినీ మహానాడు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర ముఖ్యనేతలు అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ ఏటా నిర్వహించే మహానాడుకు మద్ధతుగా నియోజకవర్గాల్లో మినీ మహానాడు నిర్వహించడం ఆనవాయితీ అని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలివచ్చి మినీ మహానాడును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



## ఘనంగా నాదెండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ షిరిడిసాయి 13వ వార్షికోత్సవం

**నాదెండ్ల,మే15,ప్రభాతవార్త:** నాదెండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ షిరిడిసాయినాధుని మందిర 13వ వార్షికోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. వేకువఝాము నుంచే సాయిబాబాకు విశేషపూజలు, పంచామృతాలతో అభిషేకం, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధరకాల పూలతో బాబాను అందంగా అలంకరణ చేశారు. గ్రామ ప్రజలంతా షిరిడిసాయినాధుని దర్శించుకొని



ఆశీస్సులు పొందారు. అనంతరం మహ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాదెండ్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## బంజారా జాతుల అభివృద్ధికి అన్ని విధాలుగా అండగా ఉంటా

**-ఆల్ ఇండియా బంజారా యువసేన అధ్యక్షులు డాక్టర్ జటావత్ రాంబాబునాయక్**

**వినుకొండ,మే15,ప్రభాతవార్త:** బంజారా జాతుల ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సామాజికంగా,ఆర్థికంగా,రాజకీయంగా ఎదిగి ఉన్నత స్థాయిల్లో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని



అందుకు తన వంతు సహాయ,సహకారాలు అన్ని విధాలుగా ఉంటాయని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాంబాబు నాయక్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ జటావతు రాంబాబు నాయక్ పేర్కొన్నారు.



రాంబాబునాయక్ జన్మదిన వేడుకలు పురస్కరించు కొని ప్రతి ఏడాది నియోజకవర్గంలోని పేద బంజారా జాతులకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తూ వారి మన్ననలు అందుకుంటు న్నారు. గురువారం రాంబాబునాయక్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ ఏడాది కూడా మండలంలోని రాజానాయక్ తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2025గాను పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన వినుకొండ నియోజకవర్గం ,మాచర్ల నియోజకవర్గంకు చెంది 500 మార్కులకు పైగా వచ్చిన సుమారు 100 మంది పేద విద్యార్థులకు రూ.5వేలు చొప్పున మొత్తం రూ.5 లక్షలు నగదు ప్రోత్సహక బహుమతులు అందజేశారు. ముందుగా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, బంజారా సోదర, సోదరీమణులు బొకేలు, పుష్పగుచ్ఛాలు అందజేసి రాంబాబునాయక్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు. ఇటువంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అందరి మధ్య భారీ పుట్టిన రోజు కేక్ కట్ చేసిన రాంబాబునాయక్ అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంజార ముద్దుబిడ్డ డాక్టర్ రాంబాబునాయక్ మాట్లాడుతూ బంజారాల ఐక్యతకు,అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. బంజారా జాతి విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కృషి,పట్టుదలతో శ్రమిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనందని ఇప్పటి నుంచే నైతిక విలువలు, సామాజిక సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. జీవితంలో వచ్చే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి, దేశానికి, జాతికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ఐదేళ్ళుగా తన పుట్టిన రోజున ఇదే విధంగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తన సతీమణి మహేశ్వరి,వ్యాపార భాగస్వామి మర్రి సత్యనారాయణ ప్రోత్సహంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన బంజారా నాయకులు పలువురు మాట్లాడుతూ దాతృహృదయంతో రాంబాబునాయక్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రసంశనీయమని ఇటీవల డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేసి బంజారా జాతుల ఉన్నతికి దోహదపడాలన్నారు. అనంతరం సంఘ పెద్దలు రాంబాబునాయక్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి,సన్మానించారు. స్కాలర్‌షిప్‌ల పంపిణీతోపాటు పేదలకు అన్నదానం,దుస్తులు పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మానాయక్, పులుకూరి వెంకట్రావు, దియ్యా, రామకృష్ణ, హనుమానాయక్, అఖిల్, విష్ణునాయక్, బాలునాయక్,బాలకృష్ణనాయక్,రామునాయక్,కొండ నాయక్, ఏడుకొండలనాయక్, బర్మానాయక్, బంజారా సోదర, సోదరీమణులు, యువత, రాంబాబునాయక్ అభిమానులు, సన్నిహితులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## 20 న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**పెదకూరపాడు, మే 15 ప్రభాతవార్త :** ఈ నెల 20న జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు సూరిబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నా యన్నారు. ప్రభుత్వాలు 25 కార్మిక చట్టాలను తొలగించడం దారుణమన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను మర్చిపోయారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, స్కీమ్ వర్కర్స్‌ను చంద్రబాబు మోసం చేశారన్నారు. సమ్మెలో కార్మికవర్గం పాల్గొనాలని కోరారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన స్టాటికల్ ఆఫీసర్ నీలకంఠేశ్వరరావు



**రాజుపాలెం, మే 15 ప్రభాతవార్త :** రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ స్టాటికల్ ఆఫీసర్ నీలకంఠేశ్వరరావు సందర్శించారు. నమోదు చేసిన గర్భిణీల వివరాలను తీసుకున్నారు. హాస్పటల్‌లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలన్నారు. పరీక్షలు చేసి ఎప్పటికప్పుడు మందులు అందజేయాలని సూచించారు. అనంతరం రాజుపాలెం పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో డాక్టర్ రవితేజనాయక్ ఎన్‌సిడి సర్వేను పరిశీలించారు. వైద్య సిబ్బంది, హెల్త్ పర్యవేక్షకులు జీవన్‌రావు, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, లక్ష్మీతిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కార్మికులకు పని భద్రత కల్పించాలి : మునగోటి శ్రీనివాసరావు



**పెదకూరపాడు, మే 15 ప్రభాతవార్త :** ఉపాధిహామీ కార్మికులకు పని భద్రత కల్పించాలని సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనిలో భాగంగా కార్మికులకు పని భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల పరిధిలోని 75 తాళ్ళూరులో తాళ్ళూరు, వరప, బుచ్చిపాలెం గ్రామాలలో ఉపాధిహామీ కార్మికుల పని విధానాన్ని పరిశీలించి అనంతరం కార్మికులతో మాట్లాడుతూ ఈనాటి ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు పని భద్రతతో పాటు త్రాగునీరు, మజ్జిగ, మెడిసిన్, విశ్రాంతి తీసుకునేందుకు టెంట్లు కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే కొలతలతో పాటు ఉపాధి హామీ కూలీలకు కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎండలు విపరీతంగా ఉండటంతో సమయపాలన పాటించాలని, అధికారులు స్పందించి వారికి భద్రత కల్పించాలని మునగోటి శ్రీనివాసరావు కోరారు.

## అన్నదాత సుఖీభవ పథకంలో పొలం వివరాలు నమోదు చేయాలి : ఏవో

**రాజుపాలెం, మే 15 ప్రభాతవార్త :** రాజుపాలెం మండలంలో సొంత పొలం ఉన్న రైతులు అన్నదాత సుఖీభవ పథకంలో పొలం వివరాలు నమోదు చేసుకోవాలని ఏవో పి.వెంకటనరసయ్య సూచించారు. పొలం ఏ గ్రామ పరిధిలో ఉందో ఆ గ్రామ రైతు సేవా కేంద్రానికి ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం ఇస్తే అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో నమోదు చేస్తారని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే అన్నదాత సుఖీభవ పథకంలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని ఏవో వెంకటనరసయ్య తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌ఐవి వైద్య పరీక్షలు




**సత్తెనపల్లి, మే 15 ప్రభాతవార్త :** సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ఏఆర్‌టి ప్లస్ సెంటర్ నందు హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హాస్పటల్ సూప రింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు గురువారం తెలియజేశారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బిపి, షుగర్, హెపటైటిస్, రక్త శాతం పరీక్షలు జరుగుతాయన్నారు. ఏఆర్‌టి మందులు వాడే ప్రతి ఒక్కరూ షుగర్, బిపి వైద్య పరీక్షలు విధిగా చేయించుకోవాలని సూచించారు.

## ఈనెల 26న స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ ఐక్యూ నియో 10

**అమరావతి, మే 15, ప్రభాతవార్త :** తమ నూతన స్నాప్‌డ్రాగన్ 8 ఎస్ జెన్ నియో 10 స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లో ఈనెల 26న ఆవిష్కరిస్తున్నట్లు హైఫెర్మార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ ప్రతినిథులు ప్రకటించారు. ప్రధానంగా మల్టీటాస్కింగ్‌కోసం యువ ప్రొఫెషనల్స్, ప్రారంభ జాబ్బర్లను లక్ష్యం చేసుకున్న తాము ఈ విభాగంలో వేగవంతమైన, ఫ్లాగ్‌షిప్-స్థాయి పనితీరుతో పాటు సృజనాత్మకత, వేగం డ్యూయల్ చిప్ శక్తితో లభిస్తుందన్నారు.

## హిందూ ఫార్మసీలో ఎన్‌సిసి 'బి' సర్టిఫికేట్ పరీక్ష

**గుంటూరు విద్య,మే 15,ప్రభాతవార్త :** స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు 25(ఏ) బెటాలియన్ ఫిబ్రవరి 2025లో నిర్వమించిన ఎన్‌సిసి 'బి' సర్టిఫికేట్ పరీక్షా ఫలితాల్లో 17మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు.ఆ 17మందిలో 10మందికి "ఏ" గ్రేడ్, 7గురు "బి" గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్‌సిసి బి సర్టిఫికేట్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు,సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు మాట్లాడుతూ జాతీయ భావం,క్రమశిక్షణ కలిగి ఉంటారని వీరందరికి ఉన్నత విద్య,ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు.విద్యార్థులకు,శిక్షణ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రత్యూష,ఓఎస్డీ డాక్టర్ పి.సీతారామయ్య,ఎన్‌సిసి ఎఎన్‌ఓ లెఫ్టినెంట్ సిహెచ్ అజిత్‌బాబు పాల్గొని విద్యార్థులకు తమ అభినందనలు తెలియజేశారు.

## పంపిణీకి విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధం

**-మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్**



**పొన్నూరు, మే 15,ప్రభాతవార్త:** ఈ విద్యాసంవత్సరం పాఠశాలలకు తెరిచేనాటికే విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ తెలిపారు. అందుకు సంబంధించి ఇప్పటికే నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టోర్ రూమ్‌కు 4,892బ్యాగ్‌లు వచ్చినట్లు చెప్పారు. అందులో చిన్న సైజు-784, మీడియం సైజు-1,208, పెద్ద సైజు-2,900వచ్చినట్లు చెప్పారు. వాటి నాణ్యతను కూడా ఎంఈవో పరిశీలించారు. పాఠశాలలు తెరిచేనాటికి సాధ్యమైనంత వరకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు తదితరాలను ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల పరిధిలో అడ్మిషన్ డ్రైవ్ జరుగుతున్నట్లు చెప్పారు.

## మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలి

**-మండల వైద్యాధికారి సుమంత్**



**కొల్లిపర,మే 15 ప్రభాతవార్త:** వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు.గురువారం మండల పరిధిలోని తూములూరు సుగాలికాలనీలో వైద్యాధికారులు ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు,ఎఎన్ఎం వసుమతి,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రత్యేక పూజలు



**నరసరావుపేట, మే 15 ప్రభాతవార్త :** శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గురువారం స్థానిక 17వ వార్డులో మహాలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్నారు. తెలుగుదేశంపార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. అదే విధంగా భక్తులకు ప్రసాదాలను అందజేశారు. శ్రీరాంపురంలో వేంచేసియున్న మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠ వార్షికోత్సవం వైభవంగా జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో అమరావతి రజక ఐక్యవేదిక అధ్యక్షులు ఉదయ్‌గిరి వెంకటస్వామి, ఎస్.కె.సత్యనారాయణ, కోటేశ్వరరావు, హనుమంతరావు, పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, కొలికొండ కొండలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



**నరసరావుపేట, మే 15 ప్రభాతవార్త :** ముస్లిం సోదరులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలైన ఇమామ్‌లు, మౌజాన్‌లకు మసీదులకు సంబంధించిన నిర్వహణ ఖర్చులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా అంజుమన్ కమిటీ పరిధిలో ఉన్న ఐదు మసీదులకు విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రామిరెడ్డిపేట, ఇస్లాంపేట, నాయబ్‌బజార్, బరంపేట, వరవకట్టలలోని ఒకొ క్క మసీదుకు రూ.5 వేలు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇమామ్, మౌజాన్‌లకు వేతనాలను పెంచడం జరిగిందన్నారు. అదే విధంగా మసీదుల నిర్వహణకు తగిన సహాయాన్ని కూటమి ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ మత పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పర్యటన



**నరసరావుపేట టౌన్, మే 15 ప్రభాతవార్త :** నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గురువారం పర్యటించారు. పట్టణంలోని 1వ వార్డు పరిధిలో ఉన్న చంద్రబాబునాయుడు కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి హాజరయ్యారు. స్టేడియం వద్ద ఉన్న పెద్ద మురుగునీటి కాలువను ఆయన పరిశీలించారు. కాలువలలో పూడిక తీయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు శానిటేషన్ అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఫోన్‌లో మాట్లాడి తగు సూచనలు చేశారు. వేసవికాలంలో ప్రధాన డ్రైన్లలో పూడికతీత వలన వర్షాకాలంలో ఇబ్బంది ఉండదన్నారు. మురుగునీరు రోడ్లపైకి రాకుండా అధికారులు తీసుకునే చర్యలకు నివాసితులు తగిన సహకారం అందించాలన్నారు.

## నియోజకవర్గ స్థాయి మినీ మహానాడులు నిర్వహించాలి : కొమ్మాలపాటి

**నరసరావుపేట టౌన్, మే 15 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు బూత్‌స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు మినీ మహానాడు నిర్వహించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఈ నెల 18,19,20 తేదీలలో మినీ మహానాడులు జరపాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు, టిడిపి నాయకులకు కొమ్మాలపాటి శ్రీధర్ సూచించారు. రాష్ట్రాన్ని గత వైకాపా ప్రభుత్వం వెనక్కి తీసుకెళ్లిందన్నారు. పార్టీ కార్యకర్తలు చేసిన కృషి, పోరాటం వలన జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల కలయికతో అద్భుత విజయం సాధించడం జరిగిందన్నారు. మినీమహానాడులలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా తీర్మానాలు చేయాలని కొమ్మాలపాటి శ్రీధర్ సూచించారు.

## వైకుంఠ వాసుడుగా భావదేవుడు



**పొన్నూరు, మే 15,ప్రభాతవార్త:** శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి ఏకాంతసేవ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయం ముఖమండపంలో శ్రీ స్వామివా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వైకుంఠ వాసుడు అలంకరణలో స్వామివారి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పూలమాలలతో కళ్ళు మిరుమిట్లు గొలిపేవిధంగా అలంకరించారు. స్వామివారి అలంకరణలో పూల దండలతోపాటు ఇటీవల తిరుమలకు చెందిన అలంకార రత్న ఎన్‌వివిఎన్ దీక్షితులు(వరయ్య) సమర్పించిన అలంకరణ వస్తువులు నామము, శంఖుచక్రములు, కలశములు, ముఖమల్ గుడ్డ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటన్నింటిని అలంకరించుకున్న శ్రీ స్వామివారిని చూసేందుకు తమ రెండు కళ్ళు సరిపోవడం లేదని భక్తులు చెప్తున్నారు. స్వామివారి అలంకరణలు భక్తులకు కనువిందు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం స్వామివారికి తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ఏకాంతసేవలు నిర్వహించారు. వివిధ రకాల పిండివంటలు, పండ్లు, తదితరాలను సమర్పించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది హరిబాబు, రత్నం ఏర్పాట్లు చేశారు.

## బాల పార్లమెంట్ నిర్వహణపై వాలంటీర్స్‌కి శిక్షణ



**పెదకూరపాడు, మే 15 ప్రభాతవార్త :** గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో పెదకూరపాడులోని 75 తాళ్ళూరు సచివాలయంలో వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన స్వచ్ఛంద కార్యకర్తలకు బాలల పార్లమెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడ్‌షెఫర్డ్ సంస్థ ప్రతినిధి లక్ష్మణ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గుడ్‌షెఫర్డ్ సంస్థ చేస్తున్న సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలపై వాలంటీర్స్‌కి వివరించారు. అదే విధంగా బాల పార్లమెంటు యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. సుపీరియర్, డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత చెడు మార్గంలో నడుస్తున్నారన్నారు. వారిని మంచి మార్గంలో నడిపించి వారికి బంగారు భవిష్యత్తు అందించవలసిన అవసరం మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచే విషయంలో చాలా జాగ్రత్తలు వహించాలన్నారు. టెక్నాలజీ డెవలప్ అయిన తర్వాత పిల్లల పై తల్లిదండ్రులకి ప్రేమ తగ్గిందన్నారు. ఇంట్లో నలుగురు ఉంటే నాలుగు సెల్ ఫోన్లు వాడుతూ ఒకరికొకరు సంబంధం లేకుండా ఉంటున్నారన్నారు. ఆ విధంగా బంధుత్వం దూరమై ప్రేమ తగ్గిందన్నారు. దాని వలన పిల్లలు డ్రగ్స్, గంజాయి, మద్యం, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తాళ్ళూరి సచివాలయం మహిళా పోలీస్ శిల్ప, పవన్‌కుమార్, దిలీప్‌కుమార్, వివిధ గ్రామాల నుంచి యువతీ యువకులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షునిగా జొన్నలగడ్డ విజయ్‌కుమార్



**సత్తెనపల్లి, మే 15 ప్రభాతవార్త :** లోక్ జనశక్తి పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షునిగా జొన్నలగడ్డ విజయ్‌కుమార్ నియమితులయ్యారు. స్థానిక త్యాగరాజు మందిరంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ ఈ మేరకు నియామకపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్.టి, బిసి, మైనార్టీల రాజ్యాధికారమే ధ్యేయంగా పార్టీ ముందుకు పోతుందన్నారు. విజయ్‌కుమార్ గతంలో న్యాయవాదిగా, పాత్రికేయునిగా సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మహంకాళి వెంకట్రావులో పార్టీలో చేరారు.

## మహాద్వారం ప్రారంభోత్సవ కరపత్రాలు విడుదల



**నరసరావుపేట, మే 15 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీశృంగేరి శారదా పీఠం ఆలయానికి సంబంధించి నూతనంగా నిర్మించిన మహాద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జగద్గురు శంకరచార్య విధుశేఖర భారతీ మహాస్వామి చేతుల మీదుగా ఈ నెల 20వతేదీ మంగళవారం మహాద్వారం ప్రారంభోత్సవం జరుగుతుందని కపలవాయి విజయ్‌కుమార్ తెలియజేశారు. భక్తులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖులు బత్తుల మురళి, పెరుమాళ్ళ సత్యనారాయణ, చేగు వెంకటేశ్వరరావు, కేశవరావు, ప్రకాశరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్స్‌ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన



**నరసరావుపేట, మే 15 ప్రభాతవార్త :** హ్యాండ్స్ఆఫ్ కంపాషన్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి/ ఎయిడ్స్ పై వీధి నాటకాల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ కళాజాతర బృందాలను ప్రారంభించారు. హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో గాయత్రి కల్చరల్ సొసైటీ, నాగరాజు కళాజాత బృందం స్థానిక మార్కెట్ సెంటర్‌లో హెచ్‌ఐవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. సుఖవ్యాధులు, చికిత్స గురించి తెలియజేశారు. ఏఆర్‌టి కేంద్రాలలో హెచ్‌ఐవి పరీక్షలను నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.ఆనంద్ బెంజిమెన్, ఐసిటిసి కౌన్సిలర్స్ రవి, ఎన్జీవో రజిని, వాసవి, మీరా, మేరీ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి ప్రచారం

**నరసరావుపేట టౌన్, మే 15 ప్రభాతవార్త :** మే 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు కాసా రాంబాబు, వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, సత్యనారాయణరాజు మాట్లాడారు. సివిల్ సప్లయ్ కార్మికులకు కరపత్రాలను పంచి సమ్మె ప్రాధాన్యతను తెలియజేశామన్నారు. పాలకుల, ప్రజా కార్మిక, రైతాంగ, మహిళా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

**57వ రోజుకు చేరిన పారిశుద్ధ్య కార్మికుల సమ్మె...**

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె 57వ రోజుకు చేరింది. ప్రభుత్వ అధికారులు నియంతృత్వ పోకడలు విడనాడాలని పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సాల్మన్ డిమాండ్ చేశారు. విధుల నుండి తొలగించిన 36 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. రూ.21 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.700లు చెల్లించి బయట కార్మికులను ఎందుకు తీసుకువస్తున్నారని వారు ప్రశ్నించారు.

**పొగాకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలి...**

నల్లబార్లి పొగాకుకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని కౌలు రైతు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. కనీస మద్దతు రూ.15 వేల నుండి రూ.18 వేలు ఇవ్వాలని రాష్ట్ర నాయకులు హరిబాబు, వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందని, ప్రభుత్వం స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

**నరసరావుపేట క్రైం, మే 15 ప్రభాతవార్త :** నరసరావుపేట బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి గురువారం నామినేషన్ల ప్రక్రియను నిర్వహించారు. అధ్యక్షులు జి.వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఎన్.వి.నాగరాజు, కార్యదర్శిగా రామినేని ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా జి.రాజేష్‌కుమార్ ఎన్నికయ్యారు. కోశాధికారి



పదవికి సునీల్‌సింగ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆయా పదవులకు ఏకగ్రీవ ఎన్నిక జరిగినట్లు ప్రకటించారు. కమిషన్ ఛైర్మన్ మోరా ప్రతాప్‌రెడ్డి, సభ్యులు ఎం.శ్రీనివాసరావు, జి.వి.సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్‌లు నూతనంగా ఎంపికైన కార్యవర్గానికి ధృవీకరణ పత్రాలను అందజేశారు.

# నీటి పారుదల శాఖలోని పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**బాపట్ల,మే14,ప్రభాతవార్త:** నీటి పారుదల శాఖలో ఆపరేషన్ మరియు నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్



కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బాపట్ల, వేమూరు,రేపల్లె, పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో నీటిపారుదుల శాఖకు ఆపరేషన్ మరియు నిర్వహణ కింద మొత్తం 454 పనులకు 12 కోట్ల 59.93 లక్షలు నిధులను క్యాబినెట్ ఆమోదం పొందిందన్నారు.త్రాగునీటికి సంబంధించి ఈనెల 10వ తేదీన నీటిని నిలుపుదల చేసినందున, కాలువల్లో నీళ్లు లేక పొడిగా ఉంటుందని, వాటికీ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మాన్సూన్ వర్షాలు ముందుగా వచ్చే పరిస్థితి ఉన్నందున ఆపనులను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని, ఆ పనులు అద్దం వలె ఉండాలని ఆయన అన్నారు. పనులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ, వాటి యొక్క పురోగతిని తెలియజేయాలని ఆయన అన్నారు. కరకట్టలు జిల్లాలో ఏ కిలోమీటర్ నుండి మొదలై సముద్రంలో కలిసె వరకు ప్రతి రెండు కిలోమీటర్లకి ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ చొప్పున, వారిపై పర్యవేక్షణకు ఏ ఈ లను నియమించాలని ఆయన అధికారులకు సూచించారు. వారి యొక్క వివరాలను నివేదిక రూపంలో తెలియజేయాలని ఆయన తెలిపారు. కరకట్టలను పరిశీలిస్తూ, ఎక్కడైనా పనులు అవసరమైన, వాటిని పూర్తిచేసి కరకట్టలకు గండి పడకుండా చూడాలన్నారు. కరకట్లకు ఏ కిలోమీటర్ వద్దనైనా గండిపడిన, అక్కడ విధులు నిర్వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన మరమ్మత్తుల పనులు పూర్తి అయిన తర్వాత ఆ పనులు పర్యవేక్షణకు ఒక కమిటీని నియమిస్తామని, వారే స్వయంగా ఆ పనులను తనిఖీ చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. పనులలో ఎక్కడైనా నాణ్యతా లోపాలు గమనించిన ఎడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోబడతాయని ఆయన అన్నారు. నల్లమడ డ్రైన్ ల్యాండ్ ఎక్విజిషన్ సంబంధించి నిధుల కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని బాపట్ల,రెవెన్యూ డివిజన్ అధికారిని ఆయన ఆదేశించారు. బాపట్లకు నీటి సరఫరా, నిల్వల పై ఆయన బాపట్ల, మున్సిపల్ కమిషనర్ ను ఆరా తీశారు. బాపట్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో నీటినిలువల పెంపుపై నివేదిక తయారు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, నీటిపారుదల శాఖ ఎస్.ఇ పి వెంకటరత్నం, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి,చీరాల డ్రైనేజీ ఈ ఈ మురళీకృష్ణ, రేపల్లె డ్రైనేజీ ఈ ఈ ఎం. ప్రేమ్ కుమార్, నీటిపారుదల మరియు డ్రైనేజీ శాఖలకు సంబంధించిన ఏఈలు, డి ఇ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై ఎమ్మెల్యే యరపతినేని రివ్యూ

**పిడుగురాళ్ల, మే 15 ప్రభాతవార్త:** పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో గురువారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రకృతి వ్యవసాయంపై రివ్యూ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్‌వో మురళీలు పరిశీలనలో పాల్గొన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె అమలకుమారి మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న రైతులందరూ 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు పొలాల్లో చల్లుకోవాలన్నారు. దీనిద్వారా కర్బన్ శాతం పెరుగుతుందని, భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయని, నీటి నిల్వ చేసుకునే గుణం పెరుగుతందని అన్నారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్స్ పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు పీజీఎస్ (పాటీస్ పెటరీ గ్యారంటీ సిస్టం) సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఏవో మురళీ, ఎన్‌ఎఫ్ఏలు అప్పలరాజు, మేరి, మాష్టర్ ట్రైనర్ బాజీబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# 17న కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**గుంటూరుతూర్పు,మే15,ప్రభాతవార్త :** పాకిస్థాన్ పై భారత్ సాధించిన విజయం ఎన్డీయే కూటమి విజయంగా బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అభివర్ణించారు. గురువారం గుంటూరు కార్యాలయంలో బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన



జరిగిన సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, టిడిపి నాయకులు కంచర్ల శివరామయ్య, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.భారత్ విజయం సాధించిన నేపథ్యంలో మతాలకు అతీతంగా గుంటూరు నగరంలో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న భారీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.భారత దేశ సాయుధ బలగాల శక్తి ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారు.భారత సైన్యానికి ప్రజలంతా మద్దత్తుగా నిలిచారు.పహల్గామ్ ఉగ్రదాడి కి ప్రతీకారం తీర్చుకునే క్రమంలో భారత సైన్యం ఆపరేషన్ సింధూర ద్వారా బుద్ధి చెప్పింది.భారత దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటామని మోడీ చెప్పారు.పాకిస్తాన్ మూకలను సమర్ధవంతంగా పారద్రోలారు.దానిని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా తిరంగా యాత్ర చేయాలని మోడీ పిలుపు ఇచ్చారు.ఈనెల 17వ తేదీ శనివారం ఉదయం ఎనిమిది గంటలకు హిందూ కాలేజ్ సెంటర్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు తిరంగా యాత్ర జరుగుతుందన్నారు. యాత్ర కు అన్ని మతాలను ఆహ్వానిస్తున్నామని కుల మతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఖాజీ ల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి

### -రాష్ట్ర ఖాజీ సంఘ నేతల విజ్ఞప్తి

**గుంటూరుతూర్పు,మే15,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాజీ ల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాజీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఖాజీ రిజ్వాన్ విజ్ఞప్తి చేశారు గురువారం స్థానిక ఆంధ్ర ముస్లిం





కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హాజీల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు ఎస్ఎం షరీఫ్, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మోలానా ముస్తాక్ అహ్మద్, ఇంకా పలువురు ముస్లిం మైనారిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల వివాహ సందర్భంగా ఖాజీలు ఇచ్చే వివాహాల ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం పలు విభాగాలు పరిగణలోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు అదే విధంగా రెడ్ జోన్ గ్రీన్ జోన్ లుగా విభజించి ఖాజీలు ఉండచోట కాకుండా లేని ప్రాంతాల్లో నూతనంగా ఖాజీలను నియమకాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు ఖాజీల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన చోట ప్రత్యేకంగా ఖాజీ బోర్డును కూడా ఏర్పాటు చేయడం ద్వారా ముస్లిం మైనార్టీల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు మార్గాలు సుగుమం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షరీఫ్, ఎమ్మెల్యే నసీర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మోలానా ముస్తాక్ అహ్మద్ లు మాట్లాడుతూ రాష్ట్ర ఖాజీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

# పురాతన ఆలయాల అభివృద్ధికి నిధులు కేంటాయించరూ!

### - సీఎం చంద్రబాబుకు విన్నవించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాచర్ల, మే 15 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గంలోని పురాతన ఆలయాలైన మాచర్ల శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి, సత్రశాల శ్రీమల్లికార్జునస్వామి ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విన్నవించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గంలో జరగాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతిపత్రాలను సీఎంకు సమర్పించారు. అలాగే నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. కారంపూడి, మాచర్ల మండలంలో నూతన పశువైద్యశాలలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో పార్టీ నాయకులు తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్రి శివారెడ్డి, పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

# మాతాపితల సేవలో దాగివున్న మాధవ సేవ

గుంటూరు కల్చరల్,మే 15,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా సుందర సత్సంగ్ సభ్యులు,శ్రీ సుందర చైతనా ్యనంద స్వామి శిష్యులు కె.వి.కోటేశ్వరరావు చే జగద్గురు శ్రీ శంకరాచార్యులు రచించిన మాతృదేవోభవ అనే అంశంపై నిర్వహిస్తున్న ప్రవచనంలో జీవితంలో తల్లికి మించింది ఏదీ లేదన్నారు.పుడమి తల్లికంటే పుట్టుకనిచ్చిన తల్లే గొప్పదన్నారు.వర్షించే నింగికన్నా వాత్సల్యాన్ని కురిపించే తండ్రి గొప్పవాడన్నారు.తల్లిదండ్రుల సేవలో మాధవ సేవ ఉందని వారిని ఉన్నతులుగా భావించి భక్తి శ్రద్ధలతో సేవించాలన్నారు.తన ఆయుష్షును కూడా పోసుకొని సంతోషంగా బతకమేనేది తల్లి అందుకే మన వేదాల్లో తల్లికి ఎటువంటి ప్రాముఖ్యత ఉందని తెలుపుతూ,ఆ తల్లిని ఎంతో గౌరవమర్యాదలతో చూసుకోవాలన్నారు.ఇందుకు నిదర్శనం శ్రీ ఆదిశంకరుల చరిత్రే అన్నారు.శ్రీరాముడు మాతాపితల పట్ల ఎంత భక్తి కలిగి ఉన్నాడనేది రామాయణం తెలియజేస్తుందన్నారు.దేహాలు అశాశ్వతాలు,సంపదలు అనిత్యాలు మృత్యువు ఎప్పుడూ కాచుకొని ఉంటుందని అన్నివేళల ధర్మ మార్గాన్ని అనుసరించాలన్నారు.ఈ ధర్మమార్గం సనాతనం అని అదే శాశ్వతమని మాతృపంచకంలోని పరమార్థం అన్నారు.ఇలాంటి ధార్మిక ప్రసంగాల శ్రవణం ద్వారా ప్రజల్లో చక్కటి మార్పు కలుగుతుందన్నారు.కార్యక్రమంలో సుందర సత్సంగ్ సభ్యులు మన్నవ రవిప్రసాద్,పి.శివారెడ్డి,చెన్నకేశవరావు,ఏకాంబరేశ్వరరావు పాల్గొన్నారు.తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంకా విజయబాబు,ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు,సహ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.ల

# కాల్పుల విరమణ వ్యూహాత్మక తప్పిదం

**గుంటూరు కల్చరల్,మే 15,ప్రభాతవార్త :** పహల్గామ్ ఉగ్రహింస తర్వాత పాకిస్తాన్ పై వరుస దాడులతో సమర్థంగా విరుచుకుపడి వెంటనే ఆకస్మికంగా కాల్పుల విరమణకు అంగీకరించడం వల్ల మనదేశం టెర్రరిజంపై బేషరతు ఆధిపత్యాన్ని సాధించే అవకాశం కోల్పోయినట్లయిందని అవగాహన సంస్థ సభ్యుల చర్చలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు.సంస్థ కార్యాలయంలో కాల్పుల విరమణ వూహాత్మక తప్పిదం అన్న అంశంపై పాల్గొన్న వారు మాట్లాడారు.సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ పాకిస్థాన్ సైనిక వ్యవస్థను పతనం అంచుకు తీసుకొచ్చిందని అలాంటి స్థితిలో వ్యూహాత్మకంగా ప్రశ్నార్థకమైన నిర్ ్ణయంతో భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించడం పై వస్తున్న విమర్శ అర్థరహితమైందేమీ కాదన్నారు.సమావేశంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య,సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం,న్యాయవాది అవధానుల హరి,తదితరులు ప్రసంగించారు.

# అవగాహన...లో 52వ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ కి అభినందన

గుంటూరు కల్చరల్,మే 15,ప్రభాతవార్త : 52వ సు ప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కి అవగాహన సంస్థ అభినందనలు తెలియజేస్తుంది.న్యాయమార్గ పాలన గాడి తప్పకుండా జస్టిస్ గవాయ్ చూడగలరని దేశప్రజలందరూ నమ్ముతున్నారన్నారు.దళిత వర్గానికి చెందిన భూషణ్ రామకృష్ణ గవాయ్ 2019నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉంటూ అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉంటూ ఎన్నో వినూత్న తీర్పులు వెలువరించారని అవగహన సంస్థ ప్రకటిస్తుంది.370 అధికరణ రద్దు,ఎన్నికల బాండ్లు,పెద్దనోట్ల రద్దు,బుల్డోజర్ న్యాయం చెల్లదనిచెబుతూ గవాయ్ చెప్పిన తీర్పు చారిత్రాత్మక మైందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆరేళ్ళకాలంలో రాజ్యాంగ వ్యవహారాల నుంచి మొదలుపెట్టి అనేక అంశాల మీద ఎన్నదగిన తీర్పులు చెప్పిన గవాయ్ తన 6నెలల పదవీకాలంలో పేరుకుపోయిన కేసులను తెమల్చం,న్యాయమూర్తుల కొరత లాంటి అనేక వ్యవహారాలను చక్కబెటా ్టల్సి ఉందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.

# పాలిటెక్నిక్‌లో ఉచిత శిక్షణ తరగతుల విద్యార్థుల ప్రతిభ

**పిడుగురాళ్ల, మే 15 ప్రభాతవార్త:** యూటీఎఫ్ మండల శ్శాఖ, ఎస్ఎఫ్ఐ, జేవీవీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణా తరగతుల విద్యార్థులు పాలిటెక్నికల్ 2025 ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 120 మార్కులకు గాను 115 మార్కులతో స్టేట్ ర్యాంకు 455 సాదించిన కె హేమంత్‌కుమార్‌ను, 114 మార్కులతో 686 సాధించిన ఎస్‌కే జాస్మిన్‌ను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ రుణ్‌బాబు, జిల్లా విద్యాశాఖా అధికారి చంద్రకళ సన్మానించి జీవితంలో ఉన్నత స్థితికి రావాలని ఆశీర్వదించారు. వి నేహా శర్వాణి 112 మార్కులతో స్టేట్ ర్యాంకు 1153, ఎం హర్షవర్ధన్ 111 మార్కులతో స్టేట్ ర్యాంకు 1289, పి వర్షవర్ధన్‌రెడ్డి 108 మార్కులతో స్టేట్ ర్యాంకు 2147, ఎం భార్గవి 107 మార్కులతో స్టేట్ ర్యాంకు 2397, యు



అఖిల 102 మార్కులతో స్టేట్ ర్యాంకు 3844 సాధించారు. మొత్తం 140 మంది విద్యార్థులకు 5 వేల లోపు 10 మంది, 10 వేల లోపు 15 మంది విద్యార్థులు సాధించారని యూటీఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి జి విజయసారధి తెలిపారు. శిక్షణా తరగతులు ఏప్రిల్ 4 నుంచి 28 వరకు 25 రోజులపాటు నిర్విరామంగా, అనుభవజ్ఞులైన ప్రభుత్వ ఉపాధ్యాయులచే ప్రణాళికబద్ధంగా ప్రతి రోజు డైలీ టెస్ట్‌లు, వారాంతంలో వీక్లి టెస్ట్‌లు, గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తూ అత్యుత్తమ ఫలితాలు రాబట్టామని శిక్షణ తరగతుల కోఆర్డినేటర్, యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి శ్రీనివాసరావు అన్నారు. మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా యూటీఎఫ్ ఉచిత పాలిటెక్నిక్ శిక్షణా తరగతులు నిర్వహించడం వరుసగా ఇది మూడోసారి అని, ప్రతి సంవత్సరం 150 మంది విద్యార్థులకు తగ్గకుండా ఈ ఉచిత శిక్షణ తరగతులను వినియోగించుకొని ఉత్తమ ర్యాంకులు సాధించి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సీట్లను పొందారని యూటీఎఫ్ పిడుగురాళ్ల మండల శాఖ అధ్యక్షుడు ఎంవీ సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కాసింపీరా, జిల్లా కార్యదర్శి జమాలన, జిల్లా కార్యవర్గ సభ్యుడు డి శ్రీనివాసరావు, మండల గౌరవాధ్యక్షుడు రమణనాయక్, ప్రధాన కార్యదర్శి గోసు ప్రసాద్, యూటీఎఫ్ సీనియర్ నేత డి సాయిబాబు, ఎస్ఎఫ్ఐ, జీవీజీ నేతలు పాల్గొన్నారు.

# సమస్యలను విన్నవించిన ప్రజలు

పిడుగురాళ్ల, మే 15 ప్రభాతవార్త: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులకు విన్నవించారు. ఈ వేదికలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి 480 ఫిర్యాదులు స్వీకరించారు.



తక్షణమే ఆ సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డ్వామా కాంట్రాక్ట్ సిబ్బంది చిట్టిమాల రామమూర్తి హృద్రోగ సమస్యతో అకాల మరణం చెందడంతో అందరూ కలిసి సమకూర్చిన రూ. లక్ష చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులు చేతుల మీదుగా అందించారు. అనంతరం ఇటీవల విడుదలైన పీసెట్ పరీక్షలో మంచి మార్కులు సాధించిన కె హర్షిణి, టి స్నేహలతారెడ్డి, కె మౌనికలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, డీఎఫ్‌వో కృష్ణప్రియ, ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌కు వైకె ఆత్మీయ పురస్కారం

**గుంటూరు కల్చరల్,మే 15,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్ ్సలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా సారిపల్లి కొండలరావు సారధ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో వైకే నాగేశ్వరరావు జయంతి సందర్భంగా గురువారం ఆత్మీయ పురస్కార సభ జరిగింది.సభాధ్యక్షులుగా యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ,ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్,ఆత్మీయ అతిథులుగా రామరాజు ఫౌండేషన్ రామరాజు శ్రీనివాసరావు,ఆలయ పాలకమండలి సహ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు,శారదా కళా



సమితి,అధ్యక్షులు దోగిపర్తి శంకరరావు,బ్రాంచ్ మేనేజర్ ఆప్కాబ్ పి.లక్ష్మీ సువర్చల,విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య పాల్గొని డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌కు వైకే నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కార ప్రధానం చేశారు.ముఖ్యఅతిధి మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాటా ్లడుతూ యువకళావాహిని రెండు రాష్ట్రాల్లో కళల కోసం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.వైకే నాగేశ్వరరావు తదనంతరం లంక లక్ష్మీనారాయణ అధ్యక్షులుగా యువకళావాహిన సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నందుకు ప్రశంసించారు.డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ వారణాసి ఘట్టంలోని తండ్రికి కొడుకిచ్చిన సందేశం ప్రదర్శించిన తీరు ముదావాహమన్నారు.అనంతరం డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ బృందంచే సత్యహరిశ్చంద్ర నాటకం నుండి వారణాసి ,కాటిసీను ఘట్టాలను అద్భుతమైన పద్యాలతో నాటకాభిమానులను అలరించారు.అతిధులు సంస్థవారు డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌ను వైకే నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారంతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమాలను లంక లక్ష్మీనారాయణ,బొప్పన నరసింహారావు,భాగి శివశంకరశా స్త్రి,ఎంఏ హమీద్,జి.మల్లికార్జునరావు పర్యవేక్షించారు.జానీభాష వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# అధికారుల పనితీరుపై సమీక్షా సమావేశం


**పిడుగురాళ్ల, మే 15 ప్రభాతవార్త:** పట్టణంలోని నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ఆధ్వర్యాన గురజాల నియోజకవర్గస్థాయి ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షా సమావేశం



నిర్వహించారు. ఈ సమావేశంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, జిల్లా అటవీ శాఖాదికారి కృష్ణప్రియ, ఆర్డీవో మురళీకృష్ణలు పాల్గొన్నారు. తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ శాఖ, బ్యాంకు రుణాలు, రెవెన్యూ, అటవీ భూములు, పంచాయతీరాజ్, మెడికల్, హెల్త్ శాఖల ప్రగతిని తెలుసుకున్నారు. వేసవిలో ఉపాదిహామీ పథకం కింద కూలీల సంఖ్యను పెంచడంతోపాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అలాగే గ్రామస్తాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అధికారులకు సూచించారు. వేసవిలో తాగునీటి సరఫరాలో ఎవరికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. డీవైఎఫ్ఆర్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలని, జిల్లా అటవీ శాఖ అధికారులకు, నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్‌లకు సూచించారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలోని పొందుగుల, తంగెడ, మాడుగుల, గొట్టిముక్కల, దైద గ్రామాల్లో ప్రభుత్వ భూములను కొందరు వైసీపీ నేతలు పట్టా భూములుగా మార్చుకొని బ్యాంకులలో రుణాలు పొందిన వైనంపై ప్రత్యేక అధికారులతో రికార్డుల పరిశీలన, గ్రామస్థాయిలో విచారణ చేపట్టి త్వరలో నివేదిక అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. అధికారులు తప్పు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భగా నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారంపై సమీక్షా సమావేశంలో చర్చించారు.

# శానిటేషన్ సెక్రటరీలందరూ ఖచ్చితంగా ఫీల్డ్ విజిట్ చేయాలి : మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,మే 15,ప్రభాతవార్త:** శానిటేషన్ సెక్రటరీలందరూ ఖచ్చితంగా ఫీల్డ్ విజిట్ చేసి వర్కర్ల హాజరును చూసుకోవాలని,గార్బేజ్ వ్లరబుల్ పాయింట్స్‌పై శ్రద్ధ వహించాలని,మూడు నెలల కంటే ఎక్కువగా హాజరుకాని వర్కర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని మీటింగ్ హాలు,ప్రజారోగ్య విభాగం అధికారులు,శానిటేషన్ సూపర్‌వైజర్లు,ఇనస్పెక్టర్లు,సెక్రటరీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ సెక్రటరీలందరూ ఖచ్చితంగా ఫీల్డ్ విజిట్ చేసి వర్కర్ల హాజరును చూసుకోవాలని మూడు నెలల కంటే ఎక్కువగా హాజరుకాని వర్కర్లపై చర్యలు తీసుకోవాలన్నారు.




ప్రతి రోజు సచివాలయం పరిధిలోని సెక్రటరీ ప్రతి వీధిలో తిరిగి పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా జరిగేటట్లు చూసుకోవాలని ఎక్కడ గార్బేజ వల్నరబుల్ పాయింట్స్ ఉన్నాయో అక్కడ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రతి రోజు సైడ్ డ్రైన్లు పరిశుభ్రపర్చేటట్లు చూసుకోవాలని,పట్టణ ప్రణాళిక,అమినిటీస్ సెక్రటరీలతో సమన్వయపరుస్తూ సచివాలయం పరిధి లోని సమస్యలను త్వరగా పరిష్కరించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు.నగరంలోని కాలువలో ఎటువంటి వ్యర్థాలు వేయకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి నిత్యం డోర్ టు డోర్ వ్యర్థాలను సేకరిస్తూ ఇంటి వద్దనే వ్యర్థాలు వేరు చేసే ప్రక్రియను ప్రజలకు అలవాటు చేయాలన్నారు. ప్రజారోగ్య సిబ్బంది,ప్రజలకు వారి ఆరోగ్యం పట్ల అవసరమైన అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని ఫ్రైడే డ్రై డే లాంటి వాటిని పూర్తి స్థాయిలో నిర్వహించాలని, వ్యర్థాలను వేరు చేసే ప్రక్రియను వివరించాలని, వ్యర్థాల వివిధ రకాలైన తడి చెత్త,పొడి చెత్త,ఈ వేస్ట్‌పై పూర్తి స్థాయిలో వారికి అవగాహన కల్పించాలన్నారు. నగరం లోని బల్క్ వేస్ట్ జనరేటర్స్ అయిన ఫంక్షన్ హాల్స్,హోటళ్ళు,రెస్టారెంట్ల వద్ద ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బాబూ శ్రీనివాస్,డాక్టర్ అన్నపూర్ణ,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖరరెడ్డి,బయాలజిస్ట్ సూర్యకుమార్,శానిటరీ సూపర్‌వై.ర్లు,సెక్రటరీలు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మే 15 ప్రభాతవార్త: గురజాల నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబులతో కలిసి నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు నియోజకవర్గస్థాయిలో సమీక్షా సమావేశాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిని ్తోందన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేయాల న్నారు. నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలు గురజాల, పిడుగురాళ్ల, దాచేపల్లిలో పారిశుధ్య నిర్వహణ, గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్యలను



తక్షణమే పరిష్కరించాలన్నారు. నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను వివాద రహితంగా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, డీఎఫ్‌వో కృష్ణప్రియ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే పిడుగురాళ్ల – జానపాడు మధ్యలో ఉన్న రైల్వే గేటు వలన ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు గాను రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేశ్వారు. ఆర్‌వోబీ నిర్మాణానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు.

# రాష్ట్రంలో 26 జిల్లాల్లో ఏపిటిఎస్ కార్యాలయాలు

**విజయవాడ, మే 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలో 26 జిల్లాల్లో ఏపిటిఎస్ కార్యాలయాలు ప్రారంభిస్తున్నట్లు చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ తెలిపారు. విజయవాడలో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ 1986లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ కార్పొరేషన్ ప్రారంభమైందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జూలై 24 నుండి ఏప్రియల్ 2025 వరకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం ద్వారా 55,486 టెండర్లు ప్రచురించబడ్డాయన్నారు. మొత్తం ప్రాజెక్టు విలువ 41వేల కోట్ల రూపాయలు కంటే ఎక్కువన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఏపిటిఎస్ సాంకేతికంగా అత్యంత మెరుగైన సేవలందిస్తుందన్నారు. డిస్ట్రిక్ట్ లెవల్ ఐటి ఏకో సిస్టం ను పెంచడానికి, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ప్రొక్యూర్‌మెంట్‌ను మరింత విస్తరిస్తామని, జిల్లా స్థాయిలో ఐటి గవర్నర్నెన్స్ పటిష్టం చేస్తామని, ఐటిపై ఆసక్తి వున్న యువతకు మరింత సులభంగా అందుబాటులోకి తెస్తామన్నారు.

# విశ్రాంత ఉపాధ్యాయినులకు సన్మానం

**తిరువూరు, మే 15, ప్రభాతవార్త :** పదవి విరమణ చేసిన ముదునూరు కమలమ్మ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని (కంభంపాడు), తొమ్మండ్రు ఆరోగ్యం (గణిత ఉపాధ్యాయినీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు)లకు గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిభిరంలో భాగంగా స్థానిక సుందరయ్య విజా ్ఞన కేంద్రంలో ఘనంగా సన్మానం జరిగింది. వేదిక ప్రతినిధులు వారికి శాలువలు కప్పి పుష్పగుచ్చాలు అందచేసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్, ఉపాధ్యక్షులు ఎం హరికృష్ణ, నాయకులు ఎం రాంప్రదీప్, కె పాపారావు, డి సుదర్శన్, ఎం సుధాకర్, ఎస్ జగన్మోహన్‌రావు, ఎస్‌డి సుభాని, సమతా కన్వీనర్ ఎస్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# భయంతోనే కులగణనకు మోడీ సై



## విపక్షాల నుంచి వచ్చే వ్యతిరేకతను ప్రధాని భరించలేక పోతున్నారు..

## బీహార్ ఎన్నికలకు సరికొత్త వ్యూహాలతో కాంగ్రెస్: రాహుల్ గాంధీ

**దర్భంగా(బీహార్), మే 15:** దేశంలో అణగారిన వర్గాలనుంచి వ్యతిరేక ఎదురవుతున్నదనే భయం తోనే ప్రధానిమోడీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలోప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాలతరపున పోరాడుతున్న ప్రతి పక్షానికి ప్రధాని భయపడ్డారన్నారు. బీహార్‌లోని దర్భాంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానికనేతలు అధికారులు ఎంతో ప్రయత్నించారన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివరిలో బీహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటినుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బీహార్‌లో యువతతో మమేక మయ్యేందుకు తలపెట్టిన శిక్షా న్యాయ్‌సంవాద్ కార్యక్రమాన్ని రాహుల్‌గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు అధికారులు ఎంతోప్రయత్నించారు. యూనివర్సిటీ గేటు బయటే నాకారును నిలిపివేసారన్నారు. అయినా కూడా తాను వెనకడుగు వేయలేదని నడుచు కుంటూ సభా వేదికమీదికి చేరుకున్నాను. బీహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందంటే మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించిందని అన్నారు.

ఇదేశక్తి నరేంద్రమోడీని గద్దెదించుతుందని అన్నారు. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కుల గణను మోడీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసున్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమంకోసం కాకుండా అంబాని, ఆదానిలకోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. కేవలం ఐదుశాతంమందిప్రజల ప్రయోజనాల కోసమే మోడీప్రభుత్వం కృషిచేస్తోందని ఆరోపించారు. దళితులు, ఒబిసిలు, ఆదివాసీలకు ఈప్రభుత్వంలో స్థానం లేదని కార్పొరేట్ వ్యక్తులకే మోడీ ప్రభుత్వం వత్తాసు పలుకు తున్నదని విమర్శించారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రైవేటు కళాశాలలు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ కోసం కేటాయించిననిధులను విడుదలచేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్‌చేసారు. ప్రభుత్వం మెడలు వంచి అయినా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

# సీజ్‌ఫైర్ ఎవరడిగారో ప్రపంచానికి తెలుసు



## జీరో టారిఫ్ అంశాలు చర్చల్లో ఉండగా ప్రస్తావన అనవసరం: విదేశాంగ మంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, మే 15:** కాల్పుల విరమణకు ఎవరు పిలుపునిచ్చారో స్పష్టంగా వెల్లడి అయిందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. అలాగే చాలా వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లు ఆఫర్‌చేసిందని అమెరికా అధ్యక్షుడుచేసిన వ్యాఖ్యలపైనా స్పందించారు. ఆపరేషన్ సిందూర్, భారత్ పాక్ కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఆయన మాట్లాడుతూ మేం ఆదేశ మిలిటరీపై దాడిచేయలేదు. మే ఏడో తేదీ వెనక్కి తగ్గడానికి ఇష్టపడనివారు మే 10మాత్రం తగ్గారు. కాల్పుల విరమణ ఎవురు కోరుకున్నారో దీనినిబట్టే తెలుస్తుందని మంత్రి అన్నారు. భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంకోసం చర్చలు జరుగుతున్న తరుణంలో భారత్ పాక్ ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో వాణిజ్యం నిలిపేస్తానంటూ ఇరుదేశాలకు స్పష్టంచేసానని, ఈక్రమంలో అవి అంగీకారానికి వచ్చాయని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. రెండుదేశాలమధ్య చర్చలు జరుగుతున్నాయి. అవి సంక్లిష్ట చర్చలు. ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునేవరకూ అవికొనసాగుతూనే ఉంటాయని వాణిజ్య ఒప్పందం పరస్పర ప్రయోజనకరంగా ఉండాలని అది జరిగేవరకూ దాని గురించి ప్రకటనచేయడం తొందరపాటే అవుతుందని ట్రంప్‌ను ప్రస్తావించకుండా వ్యాఖ్యలు చేసారు. పాకిస్థాన్‌తో ముఖ్యంగా కాశ్మీర్‌పరంగా మూడో పక్షం జోక్యాన్ని భారత్ అనుమతించదని, కేంద్రంలోని ప్రతి ప్రభుత్వం ఇదే వైఖరిని అనుసరిస్తోందని అలాంటిది తాజా ఉద్రిక్తతలవేళ కాల్పులు విరమణ గురించి ట్రంప్ ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. మనదేశ సమస్య అయిన కాశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించిందన్నారు.

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్ పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మొదలైన విషయాలు చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధానిని కోరడం వంటి పరిణామాల క్రమంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# పర్వతారోహణకు వెళ్లి ముగ్గురు మృతి

**సియాటెల్(అమెరికా), మే 15:** అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో చోటుచేసుకున్న విషాదకర ఘటనలో భారత సంతతికి చెందిన ప్రముఖ ఇంజినీర్ సహా ముగ్గురు పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో భారత సంతతికి చెందిన విష్ణు ఇరిగిరెడ్డి మృతి చెందారు. సియాటెల్‌లో నివసిస్తున్న 48 ఏళ్ల విష్ణు, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి నార్త్ క్యాస్కేడ్స్‌లోని నార్త్ ఎర్లీ వింటర్స్ స్పియర్స్ ప్రాంతానికి పర్వతారోహణకు వెళ్లారు. పర్వతాన్ని అధిరోహించి, కిందకు దిగుతున్న సమయంలో వాతావరణం ఒక్కసారిగా ప్రతికూలంగా మారడంతో ప్రమాదం సంభవించింది. వారు ఉపయోగించిన యాంకర్ పాయింట్ అదుపు తప్పి, సుమారు 200 అడుగుల లోయలో పడిపోయారు. ఈ దుర్ఘటనలో విష్ణు ఇరిగిరెడ్డితో పాటు మరో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, బృందంలోని నాలుగో వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు.

తీవ్ర గాయాలపాలైనప్పటికీ, ఆ యువకుడు సుమారు 64 కిలోమీటర్ల ప్రయాణించి, సురక్షిత ప్రాంతానికి చేరుకుని అధికారులకు ప్రమాదం గురించి సమాచారం అందించారు. ఆయన అందించిన వివరాలతో వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. రెస్క్యూ బృందాలు హెలికాప్టర్ల సహాయంతో ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను వెలికితీశారు. విష్ణు ఇరిగిరెడ్డి, సియాటెల్‌లోని ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ సంస్థ ఫ్లూక్ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన తన రంగంలో నిష్ణాతుడిగా పేరుపొందడమే కాకుండా, గ్రేటర్ సియాటెల్ ప్రాంతంలో జరిగే పలు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. విష్ణు మరణవార్త ఆయన కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# భారత్‌లో ఐఫోన్ల తయారీ వద్దన్నా..

## టిమ్‌కుక్‌కు నేనే సూచించా: అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**దుబాయి, మే 15:** భారత్‌లో ఐఫోన్లను తయారు చేయవద్దని యాపిల్ సంస్థ సిఇఒ టిమ్‌కుక్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. యాపిల్ ఐఫోన్లను భారత్‌లో తయారు చేయడం తనకు ఇష్టం లేదనీ, అత్యంత టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ ఒకటని టిమ్‌కుక్‌కు చెప్పినట్లు ట్రంప్ తెలిపారు. దోహాలో ఓ వ్యాపార కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్, టిమ్‌కుక్‌తో తనకు చిన్న సమస్య ఉందని వ్యాఖ్యానించారు. టిమ్‌కుక్‌తో తాను బాగానే వ్యవహరిస్తున్నానని, ఇన్నేళ్లూ చైనాలో ఐఫోన్లు తయారు చేసినా సహించామని ట్రంప్ తెలిపారు. ఇప్పుడు ఆయన ఐఫోన్లను భారత్ వ్యాప్తంగా తయారు చేయాలని యోచిస్తున్నారని చెప్పారు. భారత్ ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటన్న ట్రంప్, అక్కడ వ్యాపారం చేయడం చాలా కష్టమని యాపిల్ సిఇఒతో అన్నట్లు వివరించారు. భారత్ కోసం ఆలోచించాల్సిన అవసరం లేదనీ, ఆ దేశం తనను తాను చూసుకోగలదని టిమ్‌తో చెప్పినట్లు ట్రంప్ వెల్లడించారు. తన వల్ల యాపిల్ సంస్థ ఇప్పుడు యూఎస్‌లో 500బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోందని అన్నారు. తక్కువ తయారీ ఖర్చు ఉండటం వల్ల ఐఫోన్లు గతంలో ఎక్కువగా చైనాలో తయారయ్యేవి. ట్రంప్ వచ్చాక చైనాపై అధిక సుంకాలను ప్రకటించారు. యాపిల్ ఫోన్లు ఎక్కువగా అమెరికాలో అమ్ముడవుతాయి. ట్రంప్ సుంకాల వల్ల ఎటూ పోలేని పరిస్థితుల్లో యాపిల్, తన ఉత్పత్తిని భారత్‌కు మార్చాలని యోచించింది. ప్రస్తుతం భారత్‌లో యాపిల్‌కు తమిళనాడులో రెండు, కర్ణాటకలో ఒక తయారీ కేంద్రాలున్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఐఫోన్ల అసెంబ్లింగ్ 60శాతం పెరిగింది. మరో రెండు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికాలోనే పెట్టుబడులు పెట్టాలని ట్రంప్ యాపిల్‌పై ఒత్తిడి చేస్తున్నారు.

ఇక అదే కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, తన చర్యల వల్ల అమెరికా దిగుమతులపై సుంకాలను సున్నాకు చేరుస్తామని భారత్ తనకు చెప్పిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు భారత్ అలాంటి ప్రకటనే చేయక పోవడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ తర్వాత కూడా ట్రంప్ ఇలాగే అవగాహనా రాహిత్యవ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని వాణిజ్యంతో నివారించినట్లు తెలిపారు. అయితే వాణిజ్యం ప్రస్తావనే తమ మధ్య రాలేదని భారత్ అధికారికంగా ప్రకటించింది.

# ఎంపి మంత్రి విజయ్ షాపై సుప్రీం ఆగ్రహం

## ముందు హైకోర్టులో క్షమాపణలు చెప్పాలని ఆదేశం




**న్యూఢిల్లీ, మే 15:** ఆపరేషన్ సిందూర్ వివరాలను మీడియాకు తెలియజేసిన కల్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి వంటి గౌరవప్రదమైన పదవిలోఉండి ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారో అర్థమవుతుందా అని నిలదీసింది. కర్నల్ సోఫియాపై వివాదాస్పద వ్యాఖ్యల చేసినందుకు మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాపై కేసు నమోదుచేయాలని ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. వాటిని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా తక్షణమే విచారణ చేపట్టాలని మంత్రి తరఫు న్యాయవాది చీఫ్ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యలపై జస్టిస్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధ్యత గల మంత్రిగా ఉండి ఈ తరహా ప్రకటనలు చేయడం ఏంటని నిలదీశారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని మంత్రి తరఫు న్యాయవాది అభ్యర్థించగా శుక్రవారం విచారణ చేపడతామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించండి అని ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమే అని బెంచ్ న్యాయమూర్తులు అన్నారు.

# పిల్లర్‌మాటున నక్కిన ఉగ్రవాదిని గుర్తించిన డ్రోన్ కెమెరా

## ఎన్‌కౌంటర్ జరిపిన బలగాలు



**త్రాల్, (జమ్ముకాశ్మీర్), మే 15:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఘటన తర్వాత ఉగ్రవాదుల ఏరివేతను ముమ్మరం చేసిన సైన్యం, ఆ దిశలో ముందుకు సాగుతోంది. ఈ మేరకు పుల్వామా జిల్లాలోని త్రాల్‌లో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు జైషే మహ్మద్ ముఠాకు చెందిన ముష్కరులను హతమార్చింది. అందులో ఒక ఉగ్రవాదిను ముట్టబెట్టిన డ్రోన్ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. త్రాల్ ప్రాంతంలోని నదిర్ గ్రామంలో ఉగ్రవాదుల కదిలికలపై నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టింది. అప్పుడే ఉగ్రవాదులు కాల్పులు జరపగా, వెంటనే ఎన్‌కౌంటర్ మొదలైంది. కొన్ని గంటలపాటు కాల్పులు జరిగాయి. ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాయి భద్రతా దళాలు. వారిని ఆసిఫ్ అహ్మద్ షేక్, అమిర్ నజిర్‌వని, యావర్ అహ్మద్ భట్‌గా గుర్తించాయి. అయితే ఎన్‌కౌంటర్ సమయంలో ఒక ఉగ్రవాది నిర్మాణంలో ఉన్న భవనంలోని బేస్‌మెంట్ వెళ్లి దాకున్నాడు. దీంతో అతడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకునేందుకు భద్రతా దళాలు డ్రోన్ కెమెరాను రంగంలోకి దించాయి. అప్పుడు ముష్కరుడు ఓ పిల్లర్ చాటున ఉన్నట్టు గుర్తించి చుట్టుముట్టాయి. ఆ తర్వాత మట్టుబెట్టాయి. ఆ దృశ్యాలు డ్రోన్ కెమెరాలో రికార్డవ్వగా, ఇప్పుడు వైరల్ అయ్యాయి. కాగా, గత రెండు రోజుల్లో రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయి. దక్షిణ కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో గురువారం జరిగిన ఆపరేషన్‌లో ఇద్దరు టాప్ లష్కరే ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. వీరిని షహిద్ కుట్టా, అద్నాన్ షఫిగా గుర్తించాయి. షహిద్ 2023లో లష్కరేలో చేరగా, గతేడాది ఏప్రిల్‌లో ఓ రిసార్ట్ వద్ద కాల్పుల ఘటనకు అతడే బాధ్యుడు. అప్పుడు ఇద్దరు జర్మనీ పర్యటకులు, వ్యాన్ డ్రైవర్ గాయపడ్డారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రతీకారంగా షహిద్ ఇంటిని భద్రతా దళాలు పేల్చేశాయి.

# పాక్ అణుకేంద్రాలనుంచి రేడియేషన్ లీకేజి లేదు..

## వియన్నా అంతర్జాతీయ సంస్థ వెల్లడి

**వియన్నా, మే 15:** భారత్, పాకిస్థాన్ మధ్య ఇటీవల నెలకొన్న సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌లోని ఏ అణు కేంద్రం నుంచి కూడా ఎలాంటి రేడియేషన్ లీక్ కాలేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) స్పష్టం చేసింది. ఈ మేరకు వియన్నా కేంద్రంగా పనిచేస్తున్న ఈ అంతర్జాతీయ అణు పర్యవేక్షణ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. పాకిస్థాన్‌లో ఏదైనా అణు ఘటన లేదా రేడియోధార్మికత లీకేజీ జరిగినట్లు దృష్టికి వచ్చిందాఅన్న ప్రశ్నకు ఐఏఈఏ అధికార ప్రతినిధి స్పందిస్తూ, మీరు ప్రస్తావిస్తున్న నివేదికల గురించి మాకు తెలుసు. ఐఎఇఎ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, పాకిస్థాన్‌లోని ఏ అణు కేంద్రం నుంచీ ఎలాంటి రేడియేషన్ లీక్ లేదా రేడియోధార్మికత విడుదల కాలేదు అని తెలిపారు. 2005లో ఏర్పాటైన ఐఎఇఎకు చెందిన ఇన్సిడెంట్ అండ్ ఎమర్జెన్సీ సెంటర్ (ఐఇసి), అణు ప్రమాదాలు, రేడియేషన్ సంఘటనలకు సంబంధించి అంతర్జాతీయ సహాయాన్ని సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతకు ముందు, పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్ ప్రాంతంలో ఉన్న అణు కేంద్రాలపై భారత్ దాడి చేసిందన్న వార్తలను భారత వైమానిక దళం ఖండించింది. కిరానా హిల్స్‌పై తాము ఎలాంటి దాడి చేయలేదని ఎయిర్ మార్షల్ ఏకే భారతి, ఎయిర్ ఆపరేషన్స్ డీజీ రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌లోని కొన్ని సురక్షిత అణు ప్రాంతాల్లో రేడియేషన్ లీకేజీ జరిగిందన్న నివేదికల నేపథ్యంలో అమెరికా ఏదైనా బృందాన్ని ఇస్లామాబాద్‌కు పంపిందా అని మే 13న వాషింగ్టన్ డీసీలో జరిగిన యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రెస్ బ్రీఫింగ్‌లో ప్రధాన డిప్యూటీ అధికార ప్రతినిధి థామస్ పిగాట్‌ను ప్రశ్నించగా, ఈ సమయంలో దీనిపై చెప్పడానికి నా వద్ద ఏమీ లేదు అని సమాధానమిచ్చారు.

# టిఆర్‌ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించాలి

## ఐక్యరాజ్యసమితిలో భారత్ డిమాండ్

**న్యూయార్క్, మే 15:** జమ్ముకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడికి కారణమైన లష్కరే అనుబంధ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్)ను ఉగ్ర సంస్థగా ప్రకటించాలని భారత్ డిమాండ్ చేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఉన్నతాధికారులను భారత ప్రతినిధుల బృందం కలిసింది. పహల్గాం ఉగ్రదాడి గురించి వివరించింది. న్యూయార్క్‌లో ఉన్న భారత ప్రతినిధుల బృందం బుధవారం కౌంటర్ టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్ ఉన్నతాధికారులను కలిసింది. ఆంక్షల పర్యవేక్షణ బృందం, యూఎన్‌లోని ఇతర భాగస్వామ్య దేశాలతో చర్చలు జరిపింది. ఆఫీస్ ఆఫ్ కౌంటర్ టెర్రరిజం, కౌంటర్ టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్‌తో భేటీ అయిందని అధికార వర్గాలు వెల్లడించాయి.


పహల్గాం మారణహోమానికి బాధ్యులుగా ప్రకటించుకున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ సంస్థ, ఆర్టికల్ 370 రద్దు తర్వాత కొత్తగా ఏర్పాటైంది. ఉగ్రవాది షేక్ సాజిద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా బాసిత్ అహ్మద్ దార్ ఆ ఉగ్రసంస్థ వ్యవహరిస్తున్నారు. అయితే ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను కేంద్ర హోంశాఖ ఇప్పటికే ఉగ్రసంస్థగా ప్రకటించింది. 2023 జనవరి 6వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉగ్ర కార్యకలాపాల కోసం ఆన్‌లైన్ ద్వారా యువతను నియమించుకుంటోందని హోంశాఖ తెలిపింది. ఆయుధ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి చర్యలకు పాల్పడుతోందని చెప్పింది. ఉగ్రవాదంలో చేరేలా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభావితం చేస్తోందని, అందరినీ ప్రేరేపిస్తోందని వెల్లడించింది. ఏప్రిల్ 22న పహల్గాంకు దగ్గర్లో ఉన్న బైసరన్ లోయలో ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాదులు కిరాతక చర్యకు పాల్పడి26 మంది అమాయకుల ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారు. దీంతో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి 100మంది ఉగ్రవాదులను హతమార్చింది. ఉగ్రస్థావరాలను మట్టుబెట్టింది.

# అమెరికాలో భారత్ విద్యార్థి విడుదలకు కోర్టు ఆదేశం

**వర్జీనియా(యుఎస్ఎ), మే 15:** హమాస్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై అమెరికాలో అరెస్టయిన భారత విద్యార్థి బదర్ ఖాన్ సురికి అక్కడి న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. నిర్బంధంలో ఉన్న సురిని వెంటనే విడుదల చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అతడిని టెక్సాస్ నుంచి వర్జీనియాకు వెళ్లేందుకు అనుమతించాలని డిస్ట్రిక్ట్ జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాషింగ్టన్ డీసీలోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ విద్యార్థిగా ఉన్న బదర్ ఖాన్ సురి హమాస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నాడని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) ఆరోపించింది. అతడికి హమాస్‌లోని పలువురితో సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది. దీంతో అతడి వీసాను రద్దుచేసి, వర్జీనియాలోని నివాసం నుంచి అదుపులోకి తీసుకున్నారు. దీంతో తన అరెస్టును సవాల్ చేస్తూ సురీ కోర్టును ఆశ్రయించాడు. ఇది పూర్తిగా రాజకీయకుట్ర అని తన పిటిషన్‌లో ఆరోపించాడు. విచారణ జరిపిన ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ వర్జీనియా కోర్టు అతడికి తాత్కాలిక ఉపశమనం కల్పించింది.

తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు అతడిని అమెరికా నుంచి బహిష్కరించకూడదని స్పష్టం చేసింది. ప్రస్తుతం సురీని లూసియానాలోని ఇమిగ్రేషన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉంచినట్లు అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ వెల్లడించింది. అక్కడి నుంచి వెంటనే అతడిని విడుదల చేయాలని అధికారులను కోర్టు ఆదేశించింది.

# నిర్బంధంలో జవాన్‌పై తీవ్ర మానసిక హింస



**లాహోర్, మే 15:** పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం జవాన్ పూర్ణమ్ కుమార్‌షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నపుడు ఆయనను నిద్రపోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలుతెలిపాయి. నిర్బంధంలోఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్ జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్ననన్ని రోజులు చాలావరకూ కళ్లకు గంతలుకట్టేఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ, మాటలతో మాత్రం వేధింపులకు గురిచేసినట్లు చెప్పాడు. కనీసం నిద్రపోనివ్వలేదని, బ్రష్ చేసుకోనివ్వలేదని తేలింది. అలాగే రిహద్దులో మోహరింపు గురించి అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని అధికారులు ఒత్తిడిచేసారని తెలుస్తోంది. అయితే బిఎస్‌ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలుఅందలేదు. ఇక ఈప్రశ్నలన్నీ అడిగినఅధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నట్లు తెలిసింది. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గతనెల 23న గస్తీనిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న అంశాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదలకోసం రెండుదేశాల భద్రతాదళాలు ఆరుసార్లు చర్చలుజరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. భర్త విడుదలకోసం ఆయన భార్య కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపనచేసారు.

అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహ్మదుల్లాను బిఎస్‌ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీనితో పాకిస్థాన్ పైనా ఒత్తిడిపెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదలచేసింది. బిఎస్‌ఎఫ్‌కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది.

# జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

## ముగ్గురు ఉగ్రవాదులు హాతం



**శ్రీనగర్, మే 15:** జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులు కోసం ముమ్మరవేట కొనసాగుతోంది. పుల్వామా జిల్లాలోని త్రాల్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాలనుంచి సమాచారం రావడంతో భద్రతా బలగాలు తనిఖీలు చేపట్టాయి. ఈక్రమంలోనే నాదిర్‌గ్రామంలో గాలింపుచేస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీనితో భద్రతా సిబ్బంది ఎదురు కాల్పులుచేపట్టారు. ఈ ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్ ముఠాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు వెల్లడించారు. హతులను ఆసిఫ్ అహ్మద్‌షేక్ అమిర్‌నజీర్‌వని, యావర్ అహ్మద్ భట్‌గా గుర్తించారు. పహల్గాం ఉగ్రదాడిలో వీరి హస్తం ఉందా అన్న కోణంలో దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి మంగళవారం షోపియాన్ ప్రాంతంలోని జిన్‌పాథర్ కెల్లర్‌లో చోటుచేసుకున్న ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిని లష్కరే తాయిబాకు చెందిన ముఠా సభ్యులుగా గుర్తించారు.

కాశ్మీర్‌లోయలోపలు దాడులకు పాల్పడినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసారన్‌లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు అతిసమీపంనుంచి కాల్పులుజరిపిన అనంతరం అటవీప్రాంతంలోకి పారిపోయారు. వీరికోసం భద్రతా సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు.

ఉగ్రదాడికి కారకులుగా భావిస్తున్న ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదుల ఫోటోలతో కూడిన పోస్టర్లను కూడా ఏర్పాటుచేసారు.

# తిరుమల సమాచారం



## టిటిడి ట్రస్ట్‌లకు ఎన్‌ఆర్‌ఐ భక్తుడు భూరి విరాళం

**తిరుమల,మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న అనేక ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. గురువారం ఉదయం అమెరికా బోస్టన్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ భాగవతుల ఆనంద్‌మోహన్ 1.40కోట్ల రూపాయలు విరాళమిచ్చాడు. గురువారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి 1.40కోట్ల రూపాయలుపైగా విరాళాల్లో ఎస్వీగోసంరక్షణ ట్రస్టుకు 10,01,116రూపాయలు, ఎస్వీప్రాణదాన ట్రస్టుకు 10,01,116రూపాయలు, ఎస్వీవేదపరిరక్షణ ట్రస్టుకు 10,01,116, సర్వశ్రేయస్ ట్రస్టుకు 10,01,116విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతకుటుంబాన్ని టిటిడి అభినందించింది.

## 18న ఆగస్టునెల ఆర్జితసేవ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో

**తిరుమల, మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న ఆగస్టునెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఆగస్టు నెల ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్‌లో ఈనెల 18వతేదీ ఆదివారం ఉదయం 10గంటలకు విడుదల చేస్తుండగా 20వతేదీ ఉదయం 10గంటలవరకు బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22 మధ్యాహ్నం 12గంటల వరకు ఆన్‌లైన్‌లో సొమ్ముచెల్లించి లక్కీడిప్‌లో టిక్కెట్లు మంజూరవుతాయి. ఇక కళ్యాణోత్సవం,ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ టిక్కెట్లు వర్చువల్ కోటా తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. 23వతేదీ శ్రీవాణిట్రస్ట్ టిక్కెట్లకు సంబంధించి ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 23న మధ్యాహ్నం 3గంటలకువయోవృద్ధులు, దివ్యాంగులు,దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ఉచిత టోకెన్లు జారీచేస్తారు. 300రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు, ఎస్ఇడి కళ్యాణ ఆదేశాలమధ్యాహ్నం 3గంటలకువిడుదల చేస్తారు.శ్రీవారిసేవ కోటా 27న ఉదయం 11గంటలకు, నవనీతసేవ మధ్యాహ్నం 12గంటలకు,పరకామణి సేవమధ్యాహ్నం 1గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మురళీశంకర్, మాజీ డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, గ్రేహౌండ్స్ కమాండెంట్ గరుడ్‌సుమిత్‌సునీల్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 'డీడీ నెక్స్ట్‌లెవల్'చిత్రం పాటపై సమసిన వివాదం!

### క్షమాపణలు చెప్పిన నటుడు సురేష్



**తిరుమల,మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** తమిళ నటుడు సంతానం ప్రధానపాత్రలో డిడినెక్స్ట్‌లెవల్ చిత్రంలో శ్రీనివాసా గోవిందా కీర్తన మార్ఫింగ్ ఉపయోగించి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ఘటనపై జనసేన నాయకులు, టిటిడి బోర్డు సభ్యుడు హెచ్చరికలతో తమిళనటుడు సురేష్ క్షమాపణలతో వివాదం సద్దుమణిగింది. హిందూ మనోభావాలు దెబ్బతీసేలా పాటను మార్పింగ్‌చేసి హిందూదేవుళ్ళ కించపరిచేలా ఉందని తొలుత టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జనసేనపార్టీ తిరుపతి ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ పోలీసుకేసు నమోదు చేయించారు.ఏకంగా తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామిని కలసి పాటను బ్యాన్ చేయాలని కోరారు. మరో భానుప్రకాష్‌రెడ్డి 100 కోట్ల రూపాయలకు దావా వేస్తానని హెచ్చరించడంతో తమిళచిత్ర బృందం స్పందించింది. దీంతో ఎట్టకేలకు గోవిందనామాల పాట వివాదంపై నటుడు సురేష్ క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఏకంగా హిందూ సంఘాలు రోడ్డెక్కి చెన్నై హైకోర్టును ఆశ్రయించారు.వివాదాల నేపథ్యంలో పాటను తొలగించామంటూ చిత్రబృందం ప్రకటించింది. గురువారం ఉదయం ఈ విషయంపై టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళి కూడా తీవ్రంగా హెచ్చరించారు.

## శ్రీవారి ఆలయం భద్రత, భక్తుల రక్షణే ధ్యేయంగా నూతన ప్రణాళికలు

### శేషాచల అటవీప్రాంతంలో 14 ప్రవేశ ద్వారాలలో టెక్నాలజీతో భద్రత మరింత పటిష్టం



**తిరుమల,మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** దేశంలో ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో పహల్గామ్‌పై ఉగ్రవాదుల దాడులు నేపథ్యంలో ప్రపంచప్రఖ్యాతిగాంచిన ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ భద్రతను మరింత పటిష్టం చేసేదిశగా భద్రతావిభాగాలు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. తిరుమలకు చేరుకునే రెండు ఘాట్‌రోడ్లతోబాటు మూడు కాలినడక మార్గాలు ,శేషాచలంలో ఉన్న 14 ప్రవేశద్వారాల వద్ద అధునాతన టెక్నాలజీ సాయంతో భద్రతను పటిష్టం చేయడమేగాక భద్రతా సిబ్బందికి పూర్తిస్థాయి నూతన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అన్ని ఆక్టోపస్ కంట్రోల్ బృందాలకు ,ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని గుర్తించారు. పహల్గామ్‌దాడితో తిరుమల ఆలయం భద్రతపై ఇప్పుడు మరింతగా సమీక్షించుకోవడం అవసరమని అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి తెలిపారు. గురువారం సాయంత్రం తిరుమల అన్నమయ్యభవనంలో తిరుమల భద్రతతోబాటు యాత్రికుల రక్షణ దిశగా అదనపుచేసుకుందుకు పూర్తిస్థాయిలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా దళాలకు సదుపాయాలు, టెక్నాలజీతో కూడిన ఆయుధాలు, శిక్షణ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతపురం డిఐజి షిమోషి ఆధ్వర్యంలో గ్రేహౌండ్స్ కమాండర్ ఎస్పీ డాక్టర్ గరుడ్‌సుమిత్‌సునీల్, ఐఎస్‌డబ్ల్యు ఎస్పీ అరిఫ్‌హాఫీజ్, తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి సివిఎస్‌ఒ వి.హర్షవర్ధన్‌రాజు,తిరుమల అదనపుఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, డిఎఫ్ఒ వివేకానంద్, వివిధ భద్రత దళ అధికారులు, విజిలెన్స్ ,భద్రత సిబ్బంది పాల్గొన్నారు.తిరుమలలో తిరుపతిలో భద్రత సిబ్బందికి రసాయన,జీవ,కిరణ,అణు ముప్పులపై శిక్షణ,యాంటీ సాబెటేజ్ చర్యలు, మాక్‌డ్రిల్లులు, ఎవాక్యూయేషన్ డ్రిల్లులు అంశాలపై క్షుణ్ణంగా శిక్షణలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఏపిఎస్‌పి, ఏఆర్, ఎస్‌పిఎఫ్, హోంగార్డులు,సివిల్ పోలీసు,టిటిడి భద్రత సిబ్బంది అన్ని భద్రత దళాలను సమన్వయ పరిచి ప్రతి దళానికి స్టాండింగ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటీవల తలెత్తిన పరిస్థితులు ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సుదీర్ఘంగా వివరించారు.

# 'గోవిందకోట'పై మరింత విస్తృత ప్రచారం!

### కోటినామాలు రాస్తే విఐపి బ్రేక్ దర్శనం

### యువతను హిందూధర్మంపట్ల ప్రోత్సహించే దిశగా అడుగులు

### కుటుంబసభ్యులకు గోవిందుని దర్శన అవకాశం

**తిరుమల,మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** హిందూ ధర్మాన్ని విస్తరింపనుందనే యువతలో అవగాహన కల్పించడంతోబాటు భక్తిభావం పెంపొందించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రస్తుత బోర్డు,అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. రామకోటి తరహాలో 25ఏళ్ళలోపు యువత "గోవిందకోటి"రాస్తే ఆ భక్తుడితోబాటు ,వారి కుటుంబసభ్యులు ఐదుగురికి విఐపి బ్రేక్ దర్శనం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఈ విధానం 2023 సెప్టెంబర్‌లో అప్పటి టిటిడి బోర్డు కూడా మంచినిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని అమలుచేస్తూ అప్పట్లోనే టిటిడి ప్రత్యేక పుస్తకాలు ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ తరువాత 2024 మేలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, టిటిడి నూతన ట్రస్టుబోర్డు ఏర్పాటుతో కొద్దిరోజులు ఈ విషయంపై తర్జనభర్జనలు పడ్డారు. చివరకు హిందూ సనాతన ధర్మవ్యాప్తికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న "గోవిందకోటి"రాయడం వల్ల యువతలో భక్తి భావం పెంపొందింపజేసేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. మళ్ళీ 25ఏళ్ళ లోపు యువత "గోవిందకోటి"రాస్తే వారి కుటుంబసభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించనున్నారు. 10,01,116సార్లు గోవిందనామాలు రాసిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా చూడనున్నారు. ప్రస్తుత తరుణంలో తిరుమల వేంకటేశ్వరస్వామి ప్రశస్త్యాన్ని, భక్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలని, తిరుమలలో గోవింద నామం తప్ప మరేతర పదం విని పించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా స్పష్టంగా తెలిపారు. ఇదే ఉద్దేశ్యంతో ప్రస్తుత ధర్మకర్తలమండలి కూడా అడుగులేస్తోంది. మంచి నిర్ణయాలు తీసుకుంటూ భక్తులకు ఉపయోగపడేలా పనితీరు సాగిస్తున్నారు. సనాతన ధర్మాన్ని విస్తృతంగా వ్యాప్తిచేసేం దుకు యువత యువకులకు,వారి కుటుంబసభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించడం వల్ల మరింత భక్తిభావం కలుగుతుంది. ఇప్పటివరకు ఐదారుమంది భక్తులు మాత్రమే గోవిందకోటి రాసినట్లు తెలుస్తోంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి భక్తులకు సౌకర్యాల ,సంతోషకరమైన దర్శనం చేయించడమే ధ్యేయంగా పనితీరు సాగిస్తున్నారు. ఇదే సదాలోచనతో గోవిందకోటి పై మరింత ప్రచారం చేయాలని ఆలోచనచేస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. గోవిందకోటి రాసిన పుస్తకాలను తిరుమలలోని ఆర్జిత పేష్కార్ కార్యాలయంలో సమర్పిస్తే వారికి మరుసటిరోజు విఐపి బ్రేక్ దర్శనం సదుపాయం కల్పించేలా ఏర్పాట్లు చేస్తారు.

## వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి లోకేష్

### అన్ని విధాల అండగా ఉంటానని భరోసా



**నాగులుప్పలపాడు, మే 15, ప్రభాతవార్త:** ఇటీవల ఒంగోలులో దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని వీరయ్యచౌదరి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్.. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు అడుగులు వేశారని, పార్టీ పటిష్టత కోసం కృషి చేసిన వీరయ్య చౌదరి దారుణ హత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్యచౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరావు, జిల్లా టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గురు సంక్రమణ పూజలు

**శ్రీకాళహస్తి,మే 15 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గురు గ్రహం రాశి మారిన సందర్భంగా గురు దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. గురువారం వృషభరాశి నుంచి మిథునరాశికి రాశిమారిన గురువు సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు,అభిషేకాలు నిర్వహించారు.



వేలాది మంది భక్తులు పాల్గొనగా పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఎఈఓలు విద్యాసాగర్, సతీష్‌మాలిక్ హాజరు కాగా ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తుల భాగస్వామ్యంతో ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు కూడా భారీ ఎత్తున స్వామి అభిషేకాలకు సుమారు వెయ్యి లీటర్లపాలను పైగా అందించారు.ఆలయ ప్రధానార్చకులు కరుణాకరగురుకుల్, దీక్షాగురుకుల్స్ సూరి గురుకుల్, నిరంజన గురుకుల్ , పారోహితులు అర్చకుల పర్యవేక్షణలో గురు సంక్రమణ సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతం, పాలు, పెరుగు, నెయ్యి, చందనంతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

## పారిశ్రామిక అభివృద్ధిలో తిరుపతి ఐఐటి భాగస్వాములవుతాం

### ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటి ప్రొఫెసర్ సత్యనారాయణ

**శ్రీకాళహస్తి, మే 15 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం పదేళ్ళ క్రితం మంజూరు చేసిన ఐఐటి ఎన్నో విజయాలను సాధించిందని తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. పదేళ్ల సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారతదేశంలోనే అతిపెద్ద విద్యాసంస్థగా రూపుదిద్దుకున్న తిరుపతి జిల్లా త్వరలోనే పారిశ్రామిక హబ్‌గా మారనుందని అందులో తిరుపతి ఐఐటికి కీలక పాత్ర ఉంటుందని ఆయన వివరించారు. దశ 1 కింద సంస్థ రూ.867.49కోట్ల విలువైన సివిల్ పనులను పూర్తి చేసిందన్నారు. రూ.224.26 కోట్ల విలువైన పర్నిచర్ మరియు పరికరాలను సేకరించిందని మరియు పునరావృత వ్యయం కోసం రూ.352.31కోట్లు కేటాయించిందన్నారు. మొత్తం పెట్టుబడి రూ.1.444కోట్లుగా ఉండన్నారు. ఈక్రమంలోనే ఆధారపడి దశ బి గణనీయంగా పెరిగిన బడ్జెట్‌తో ఆమోదించబడిన సివిల్ పనులకు రూ.1.243కోట్లు ఫర్నిచర్ మరియు పరికరాలకు రూ.517కోట్లు మరియు పునరావృత నిధులలో రూ.552కోట్లు మొత్తం రూ.2.313 కోట్లకు చేరుకుందన్నారు. ఈఆణిపత్యంపై పెట్టుబడి ఐఐటి తిరుపతిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రధాన సంస్థగా స్థాపించడానికి ప్రభుత్వం యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. దేశంలోని ప్రముఖ మాన్ ప్రీమియం కార్ల తయారీదారులలో ఒకటైన కియా ఇండియా, ఐఐటి తిరుపతితో వ్యూహాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఈఓ గ్వాంగు లీ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ఒక అవగాహన ఒప్పందానికి మించి ఉంటుందని ఇది భారతదేశంలో మొబిలిటీ మరియు ఇంజనీరింగ్ భవిష్యత్తును రూపొందించే దిశగా దృష్టి మరియు నిబద్ధత యొక్క కలయిక అన్నారు. ఈపారిశ్రామిక సహకారాన్ని పూర్తి చేస్తూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ యొక్క తిరుపతి స్పోక్ కోసం అధికారిక నాలెడ్జ్ భాగస్వామిగా రాష్ట్ర ప్రభుత్వంతో ఐఐటి తిరుపతి కూడా చేతులు కలిపిందన్నారు. ఎంఎస్ఎంఈ మద్దతుకు ప్రాంతీయ ఉత్ప్రేరకంగా పనిచేస్తుం దన్నారు. అదానీ గ్రూప్ అనుబంధం గ్రూప్ మరి యు నవయుగ ఇంజనీరింగ్ వంటి పారిశ్రామిక భాగస్వాములతో కలిసి పనిచేస్తుందన్నారు. సమావేశంలో కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఈఓ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణాసియాదేశాలపై ట్రంప్ పెత్తనంపై సిపిఐ గుస్సా

### మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

### సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా





**తిరుపతి,మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** దక్షిణాసియా దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెత్తనం ఏమిటని,ఆయనకు తలొగ్గి భారత ప్రధాని మోదీ వ్యవహరించడం ఏంటని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపడ్డారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ భారతసైన్యం విజయవంతంగా పోరాడిందన్నారు. పాకిస్తాన్ నుండి వచ్చిన ఉగ్రమూకలు అమాయక ప్రజలను చంపడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా రూపుమాపేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఈ అంశంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో అనేక లోపాలు ఉన్నాయని ఆయన తప్పుపట్టారు. ఉగ్రవాదులను తుదముట్టించే క్రమంలో భారత్: పాక్‌లు ప్రకటించిన యుద్ధ విరమణను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాల్పుల విరమణపై స్పందించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తిరుపతిలో మూడు రోజులు జరిగే 17వ ఏఐవైఎఫ్ అఖిలభారత సదస్సుకు విచ్చేసిన సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణ విషయంలో ట్రంప్ మాటకు భారత ప్రధాని మోదీ వత్తాసు పలకారన్నారు. పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం వెనుక అంశాలపై దేశ ప్రజలందరి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి,దీనిపై చర్చించాలన్నారు. పహల్గాం ఘటనపై పూర్తిస్థాయిలో చర్చించాలని డిమాండ్ చేశారు.

## అత్యాచార నిందితుడు అరెస్ట్: డీఎస్పీ బేతపూడి ప్రసాద్



**చంద్రగిరి, మే 15 ప్రభాతవార్త:** అన్నం పుణ్యం ఎరుగని చిన్నారిపై అత్యాచారానికి పాల్పడుంటో బలైన కేసులో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బేతపూడి ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రూర్బండ్ ర్యాజకు చెందిన రాజేష్ నాయక్ తన కుటుంబంతో ఎం.కొంగరవారిపల్లి, జగనన్న కాలనీలో వలస కూలీగా జీవనం సాగిస్తున్నారు. 2024 జనవరి 3న తన కుమార్తె సోనికుమారి కనబడుట లేదని తండ్రి రాజేష్ ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ ఫిర్యాదుపై నాటి సిఐ రాజశేఖర్ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే అదే నెల 7వ తేదీన కాలనీకి పడమర వైపున గల కొండగుట్టపై బాలిక శవమై కనిపించినట్లు తెలిపారు. అందులో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు బాల్ కిషోర్ శెట్టార్ అనుమానం వ్యక్తం చేయడంతో బాలిక మృతి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయగా, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్య కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సూచనల మేరకు తన పర్యవేక్షణలో సిఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు వై.అనిత, ఈ.రవీంద్రనాథ్, హెడ్ కానిస్టేబుల్ మునిప్రసాద్, కానిస్టేబుల్ పి.మునిరత్నం, పి.వరదరాజులు, ఎస్.గోపి, జి.లోకనాథం బృందం విస్తృతంగా గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో తిరుపతి 2వ సత్రం వీధిలో నూతనంగా నిర్మిస్తున్న భవనం వద్ద నిందితుడు విశ్వసనీయమైన పక్కా సమాచారం అందడంతో పథకం ప్రకారం వెళ్లి అరెస్ట్ చేసినట్లు వివరించారు. నిందితుడిని విచారణ చేయగా బాలికకు తినుబండారాలను అందజేసి ఎం.కొంగర వారిపల్లి, జగనన్న కాలనీ సమీపంలోని కొండగుట్టపైకి తీసుకెళ్లి అత్యాచారం జరపడంతో మృతి చెందినట్లు వివరించారు. కేసును ఛేదించడంలో మరుగ్గా వ్యవహరించిన పోలీసులకు నగదు రివార్డులను ఎస్పీ ప్రకటించినట్లు తెలిపారు.

## సామర్లకోట మున్సిపల్ ఛైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం: ఆర్డీఓ మల్లి బాబు



**సామర్లకోట మే 15 ప్రభాతవార్త:** గురువారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో వైస్‌ఛైర్‌పర్సన్ కి చెందిన కౌన్సిలర్లు ఛైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తిపై అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ శ్రీవిద్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఆర్డీఓ మల్లి బాబు తెలియజేశారు.కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు ప్రొసీడింగ్ ఆఫీసర్గా సింగిల్ పిటిషన్‌పై ఈ సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని రాష్ట్ర హైకోర్టు నిర్ణయం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టుముందే గురువారం ఉదయం తొమ్మిది గంటలకు మున్సిపల్ ఛైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ తన రాజీనామా పత్రాన్ని కమిషనర్ శ్రీవిద్యకు అందజేశారు.

## తిరుపతిలో భగ్గుమన్న రాజకీయ కక్షలు

### వైసిపి,టిడిపి నేతలు దాడులు

**తిరుపతి,మే 15(ప్రభాతవార్తప్రతినిధి):** ప్రశాంతతకు మారుపేరైన తిరుపతి యాత్రాస్థలంలో గురువారం ఉదయం జరిగిన రాజకీయకక్షల దాడులు ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. రెండు ప్రధాన పార్టీల నేతలు తీవ్రస్థాయిలో ఒకరినొకరు దాడులు చేసుకోవడంతో ఇరువర్గాలు తిరుపతి రుయాకు చేరుకుని వివాదం పెద్దదిచేశారు. తిరుపతిలోని 50వ డివిజన్‌లో టిడిపి నేత వెంకటరత్నం, అదే డివిజన్‌లో ప్రస్తుత వైసిపి కార్పొరేటర్ అనిల్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. రాజకీయంగా గత మున్సిపల్ ఎన్నికల నుండి ఈ వైరం కొనసాగుతోంది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ వైసిపి, టిడిపి నేతలు ప్రత్యక్షంగా కొట్టుకున్నారు. అయితే పోలీసు పహరాతో గొడవలు జరగలేదు. ఇదిలా ఉండగా రాజకీయంగా 50వ డివిజన్‌లో టిడిపి వెంకటరత్నం, వైసిపి అనిల్ ఇద్దరూ ప్రత్యర్థులు కుటుంబాలు యుద్ధవాతావరణం సృష్టించడంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. తిరుపతిలో గంజాయి మత్తులో ఇష్టానుసారంగా కొందరు చెలరేగిపోతున్నారు.ఇదే సమయంలో గురువారం నాటి ఘర్షణలో రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టిడిపి నేతలు, వైసిపి నేతలు పరామర్శించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా అలిపిరి సిఐ రామకిశోర్ ఆస్పత్రికి చేరుకుని బాధితుల నుండి ఫిర్యాదు నమోదు చేశారు. మరో ఈ వివాదం ఎక్కడకు దారితీస్తుందోనని తిరుపతిలో రాజకీయంగా వేడెక్కింది.

## మట్టా ఇంటర్నేషనల్ ఏర్పాటు:మట్టా ప్రభాత్

**విజయవాడ మే15,ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా ఇక కులం వాళ్ళో,మతం వాళ్లో ఆత్మీయంగా కలుసుకుంటారు. ఇలాంటి వేడుకలు నెమరు వేసుకుంటున్నారు. అయితే విజయవాడ ..మట్టా ఇంటర్నేషనల్ సంస్థ ఏర్పడింది. మట్టా ఇంటి పేరు ఉన్న భిన్న సామాజిక వర్గాలు, మతాల వారిని ఒక వేదిక మీదకు తీసుకుని వచ్చింది.ఇంటి పేరును బట్టి మూలాలను వెతుకుతూ, అందరు ఒక చోటు నుంచి వచ్చిన వారేనని వ్యాఖ్యానించింది.పుట్టుకపరంగా వేర్వేరు సామాజిక వర్గాల్లో ఉంటే కలిసికట్టుగా ఉంటే కులం,మతం అనే విభేదాలుండవని మట్టా ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా మట్టా ప్రభాత్ కుమార్ అన్నారు. తమ ఇంటిపేరిట పండితులు, పారోహితులున్నారు.వీరంతా సదస్సులో పాల్గొనడం మానవ సంబంధాలను మానవత్వానికి దృష్టాంతమని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. పటసనందర్భకాళ్ళ కల్యాణ మండపంలో జరిగిన మట్టా ఇంటర్నేషనల్ మొదటి ఆత్మీయ సమ్మేళనంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బట్ట పెనుమురు సర్పంచ్ మట్టా సతీష్ సభాధ్యక్షులు మట్టా మనోజ్ కెన్నెడీ, మట్టా భరత్ కుమార్, మట్టా సౌభాగ్య రోడె మట్టా రాజ మల్లికా మట్టా రాజేష్, మట్టా వర సాయి ప్రసాద్, మట్టా వివేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 399 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ,ఎమ్మెల్యే కోటంరెడ్డి, ఎమ్మెల్సీ బీదా



**నెల్లూరు, మే 15, ప్రభాతవార్త-వైద్యం :** రూరల్ నియోజకవర్గంలో 41 కోట్ల 32 లక్షల రూపాయలతో చేపట్టిన 399 అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్రలతో కలిసి మంత్రి పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సాదర స్వాగతం పలికారు. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో కార్యకర్తల కోలాహలం మధ్య రెండు కిలోమీటర్లు సాగిన రోడ్ షో సాగింది. రూరల్ నియోజకవర్గ వాసులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొంగూరు నారాయణ పట్టుదల గల వ్యక్తి అన్నారు. అమరావతి అభివృద్ధికి అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. అనుకొన్నది సాధించే వరకు నిద్రపోరన్నారు. అలాంటి అంకితభావం ఉన్న నారాయణ మంత్రిగా ఉండటం మన అదృష్టమన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో మంత్రి పొంగూరు నారాయణదే అగ్రస్థానమన్నారు. రూరల్ అభివృద్ధిలో నాది పోస్ట్ మాన్ డ్యూటీ మాత్రమేనన్నారు. మంత్రి పొంగూరు నారాయణ సంపూర్ణ సహకారంతోనే అన్ని సాధించగలిగా అన్నారు. గతంలో మంత్రితో కలిసి పని చేసే అవకాశం లేక బాధపడ్డానన్నారు. టీడీపీ ఎమ్మెల్యేగా గెలవటంతో ఇప్పుడు ఆ బాధ తీరిపోయింది. అభినందన లేఖ పంపిన సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. అమరావతి నిర్మాణంతో సీఎం చంద్రబాబు, మంత్రి పొంగూరు నారాయణ చరిత్రలో నిలిచిపోతారన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో 41 కోట్ల 32 లక్షలతో చేపట్టిన 399 అభివృద్ధి పనులను 60 రోజుల్లో పూర్తి చేయటం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిబద్ధతకు నిదర్శనమన్నారు. పట్టుదలతో శ్రీధర్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఏడాదిలోపే రూరల్ నియోజకవర్గంలో 231కోట్ల 78లక్షలతో 816 అభివృద్ధి పనులు జరిగాయి. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పట్టుదల, కృషితో 399 పనులకు ఈ రోజు ఒకే సారి ప్రారంభోత్సవం చేయటం అభినందనీయం అన్నారు. కొండాయపాలెం, భక్తవత్సల నగర్ రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిల ఏర్పాటుకు శ్రీధర్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నం కూడా త్వరలో ఫలిస్తుందన్నారు. గత ప్రభుత్వం పరిపాలన చేత కాక రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. పరిశ్రమలు వెళ్లిపోవటంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. మున్సిపల్ శాఖ నిధులను కూడా దారి మళ్లించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో రాష్ట్రంలో దార్శనికపాలన సాగుతోంది. అధోగతి పాలైన ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు సీఎం అవిశ్రాంత కృషి చేస్తున్నారు. 8500 కోట్లతో మున్సిపల్ శాఖలో అమృత్ స్కిమ్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. టీడీపీ హయాంలో నెల్లూరులో రూ.5800 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. మాకు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో గత ప్రభుత్వం వాటిని నిలిపేసిందన్నారు. మున్సిపల్ శాఖకు వర్తించే పార్లమెంట్ యాక్ట్‌ను కూడా తుంగలో తొక్కారన్నారు.

ఏ మున్సిపాలిటీ నిధులు ఆ మున్సిపాలిటీ అభివృద్ధికే కేటాయించేందుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారన్నారు. హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామన్నారు. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఒక్క రూపాయికే కేటాయిస్తామన్నారు. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఒక్క రూపాయకే కేటాయిస్తామన్నారు. నెల్లూరులోని 54 డివిజన్లలో సమగ్ర అభివృద్ధి చేస్తామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు.

# దెబ్బతిన్న వల్లభనేని వంశీ ఆరోగ్యం

## బెయిల్ లభించినా సాంకేతిక కారణాలతో ఇంకా రిమాండ్‌లోనే



**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:**మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీని జైలు అధికా రులు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. గత కొద్దిరోజులుగా వంశీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. దీంతో వైద్య పరీక్షల కోసం ఆయనను గురువారం ఉదయం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందజేస్తున్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని నిన్న(బుధవారం) ఏసీబీ కోర్టుకు వంశీ విన్నవించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో ఈరోజు జిల్లా జైలు నుంచి వంశీని జైలు అధికారులు ఆస్పత్రికి తరలించారు. వంశీ పలు కేసుల్లో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ప్రధానంగా గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదు అయ్యింది. మరోవైపు ఈ కేసును సీఐడీ కూడా విచారిస్తున్న నేపథ్యంలో విజయవాడ సీఐడీ కోర్టులో కూడా ఈ కేసు విచారణ కొన సాగుతోంది. తాజాగా గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో తాజాగా ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే డాక్యుమెంట్లు, షూరిటీల విషయంలో కాస్త జాప్యం జరగడంతో ప్రస్తుతం ఆయన విజయవాడ జిల్లా జైలులోనే ఉన్నారు. నిన్నటితో రిమాండ్ ముగియడంతో కోర్టులో వంశీని హాజరుపరిచిన సమయంలో తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నట్లు తీవ్ర ఆవేదనతో న్యాయాధికారికి చెప్పుకు న్నారు. దీంతో మానవతా దృక్పథంతో స్పందించిన న్యాయధికారి వెంటనే వంశీకి వైద్యపరీక్షలు నిర్వహించాలని, అవసరమైతే చికిత్స కూడా అందిచాలని ఆదేశాలు ఇవ్వడంతో పాటు జిల్లా జైలు అధికారులకు అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారు.

# నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం: మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 15, ప్రభాతవార్త-వైద్యం:** నిరుపేద విద్యా ర్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందించడమే లక్ష్యం అని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. నెల్లూరులోని వీఆర్ హైస్కూల్‌ను కార్పొరేట్ తరహా వసతులతో రాష్ట్రంలోనే ఒక బెస్ట్ స్కూల్‌గా తీర్చిదిద్దుతానని ఆయన వెల్లడించారు. వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులను గురువారం మంత్రి నారాయణ పరిశీలించారు. తొలగించిన భవనాల స్థానంలో ప్లే గ్రౌండ్ ఏర్పాటుపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. కాపౌండ్ వాల్ పటిష్టంగా నిర్మించాలని ఆదేశించారు. సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు పేద పిల్లల కోసం నగరం నడిబొడ్డులో ఉన్న వీఆర్ హైస్కూల్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చానని, దాని ప్రకారం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో నెల్లూరు నగరంలో 94 వేల ఇళ్లు ఉండగా 84 వేల ఇళ్ళు తిరగానని, పేద పిల్లల చదువుల దుస్థితి స్వయంగా చూసిన తరువాత వాళ్లందరికి కార్పొరేట్ తరహాలో విద్యాలయం ఏర్పాటు చేయాలని ఆలోచన వచ్చిందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువున్న పిల్లలకే వీఆర్ హైస్కూల్‌లో అవకాశం కల్పిస్తామన్నారు. ఏడాదికి వెయ్యి మంది చొప్పున ఐదేళ్లకు ఐదు వేల మంది పేద పిల్లలకు అడ్మిషన్ కల్పిస్తానన్నారు. స్కూల్‌కు దగ్గరగా ఉన్న 6 నుండి 10 తరగతులు చదివే పిల్లలకు సైకిల్స్ ఇస్తామని, మరి కొంత మందికి ఉచిత ట్రాన్స్‌ఫోర్ట్ కల్పిస్తామని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఉచిత పౌష్టికాహారం అందిస్తామన్నారు. కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. పాడుబడ్డ భవనాలు తొలగించి ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నెలఖరులోపు పనులన్నీ పూర్తవుతాయన్నారు. జూన్ 12 నాటికి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలోనే మోడల్ స్కూల్‌గా వీఆర్‌ రూపాంతరం చెందబోతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమీషనర్ నందన్, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఎన్సీసీ, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# జిఎస్‌టిలోనూ తగ్గుదలే,భారీగా పెరిగిన అప్పులు

## 2024-25 సంవత్సరపు లెక్కలు తేల్చిన కాగ్

**విజయవాడ,మే15,ప్రభాతవార్తప్రతినిధి:** 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రాథమిక గణాంకాలను ఎట్టకేలకు కాగ్ విడుదల చేసింది. ఆదాయ, వ్యయాలు, లోటు, అప్పులు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు వంటి వాటితో ఈ నివేదిక విడుదల కావడం గమనార్హం. ఇందులో బడ్జెట్ అంచనాలకు, వాస్తవాలకు మధ్య భారీ అంతరాలు ఉండడం విశేషం. లోటు చివరి దశలో కొద్దిగా తగ్గినట్లు చూపించగా, రుణాలు మాత్రం అంచనాల కన్నా ఎక్కువగా ఉన్నట్లు తేలింది మొత్తం ఆదాయం 2.69 లక్షల కోట్లు వస్తురదని అంచనా వేయగా, చివరకు 2.50 లక్షల కోట్లు వచ్చినట్లు ప్రాథమికంగా తేల్చారు. భారీగా రుణాలు తీసుకున్నా కూడా ఇంకా 19 వేల కోట్ల వరకు ఆదాయంలో కొరత కనిపిం చింది. వచ్చిన ఆదాయంలో పన్నులు, కేంద్రం నుంచి రు. 1.60 లక్షల కోట్ల వరకు సమకూరినట్లు తేలింది. ఇరదులో జీఎస్‌టి ద్వారా 47,853 కోట్లు రాగా, అంచనా కన్నా ఇది ఐదు వేల కోట్ల వరకు తక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇక వ్యాట్ ద్వారా 24,500 కోట్లకుగాను 17,422 కోట్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర ఎక్సయిజ్ డ్యూటీ విభాగంలో 25,597 కోట్లకుగాను 19,882 కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా 35,395 కోట్లకుగాను 36,869 కోట్లు రాగా, కేంద్రం ఇచ్చే గ్రాంట్లు మాత్రం తగ్గినట్లు తేలింది. కేంద్రం నుంచి 30,333 కోట్లు రావాల్సి ఉండగా, 20,136 కోట్లు మాత్రమే చేతికందాయి. **వ్యయంలో విచిత్రాలు:** ఇక వ్యయ విభాగంలో ఆసక్తికరమైన అరశాలు వెలుగుచూశాయి. వాస్తవానికి బడ్జెట్‌లో మొత్తం వ్యయాన్ని రు.2.94 లక్షల కోట్లుగా చూపించగా, కాగ్ ప్రకటించిన ప్రాథమిక నివే దికలో మాత్రం ఏకంగా 3.37 లక్షల కోట్లుగా చూపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇందులో కూడా బడ్జెట్ అంచనాల్లో రెవెన్యూ వ్యయాన్ని 2.35 లక్షల కోట్లుగా, పెట్టుబడి వ్యయాన్ని 32,712 కోట్లుగా ప్రతిపాదించగా,తాజా కాగ్ నివేదికలో మాత్రం రెవెన్యూ వ్యయాన్నిరు. 2.91 లక్షల కోట్లుగా, పెట్టుబడి వ్యయాన్ని 45,382 కోట్లుగా చూపించారు. ఇరత తేడా ఎలా వచ్చిందన్నది మాత్రం అర్థంకాని విధంగానే ఉంది.

# పరిమితులతో కూడిన 16వ ఆర్థిక సంఘ నిధుల కేటాయింపు నిష్పత్తిని పునఃపరిశీలించాలి

## దిగువస్థాయి మున్సిపాల్టీల అభ్యర్థన

**జగ్గయ్యపేట, మే 15, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న పట్టణాల హితాన్ని దృష్టిలో పెట్టుకుని దిగువస్థాయి మున్సిపాల్టీలు పూర్తిస్థాయిలో 16వ ఆర్థిక సంఘ నిధులను సద్వినియోగపర్చుకునేందుకు ఇప్పటి వరకు అమలులోవున్న 60:40 టైడ్ అన్‌టైడ్ నిష్పత్తిని పునః పరిశీలించాలని 16వ ఆర్థిక సంఘ ప్రతినిధుల సమావేశంలో తక్కువ గ్రేడులోని మున్సిపాల్టీల నుండి అందవచ్చిన అభ్యర్థనలు, సూచనలను పరిశీలిస్తామని 16వ ఆర్థిక సంఘ ప్రతినిధి డాక్టర్ సౌమ్యకంటి గోమ్ హామీ ఇచ్చినట్లు ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర విలేకరులకు తెలిపారు. గురువారం తిరుపతి తాజ్ హోటల్‌లో జరిగిన 16వ ఆర్థిక సంఘ సమీక్షా సమావేశంలో చైర్మన రాఘవేంద్ర పాల్గొన్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి నిధులు సరైన రీతిలో వినియోగించేందుకు పలు కీలక విషయాలను సమావేశంలో చర్చించినట్లు రాఘవేంద్ర తెలిపారు. సౌర విద్యుత్ ప్రోత్సాహకాలకు ప్రత్యేక ప్రాధాన్యత, వీధి దీపాలు, బోర్లు, మున్సిపల్ భవనాలకు సౌరవిద్యుత్ వినియోగం, పరిపాలనా కార్యాలయాలపైఐ రూఫ్‌టాప్ సౌర ప్యానెళ్ళను ప్రోత్సహించేందుకు ప్రత్యేక సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు కూడా అమలు చేయాలని సూచించినట్లు వివరించారు. మున్సిపల్ సిబ్బందికి శిక్షణ, ఈ-గవర్నెన్స్ పరికరాల వినియోగం ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికా రూపకల్పన కోసం ప్రత్యేకంగా సామర్థ్యాభివృద్ధి నిధుల కేటాయింపులు అవశ్యమని కోరినట్లు తెలిపారు. డంపింగ్‌యార్డులు, శ్మశానాల ఏర్పాటుకు అవసరమైన భూముల కొనుగోలు కావాలని అలాగే 15వఆర్థిక సంఘ మార్గదర్శకాలపై పునఃపరిశీలన అవసరమని, ఎన్నికల ప్ర క్రియ కారణంగానిధుల విడుదలపై అభ్యంతరాలు తెలిపినట్లు చెప్పారు. కాగా సమావేశంలో సిఆర్‌డిఏ సంపత్ కమార్, గౌతం అల్లాడ, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా పాల్గొన్నట్లు తెలిపారు.



పదహారవ ఆర్థిక సంఘ ప్రతినిధి డాక్టర్ సౌమ్యకంటి గోమ్‌నకు మున్సిపాల్టీల తరపున అభ్యర్థనలు, సూచనల వినతిని అందజేస్తున్న జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర.

# మడకశిర మున్సిపల్ చైర్మన్ పీఠం టిడిపి కైవసం



**మడకశిర టౌన్, మే 15 ప్రభాతవార్త:** మడకశిర మున్సిపల్ చైర్మన్ పదవి తెదేపా కైవసం అయ్యే అవకాశాలు లాంఛనంగా కనిపిస్తున్నాయి. నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. గతం లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా 15, టిడిపి పార్టీ 5 స్థానాలను గెలుచుకున్నాయి. ఛైర్పర్సన్ వైకాపా కౌన్సిలర్ లక్ష్మీనరసమ్మ కొనసాగారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఏడుగురు వైకాపా కౌన్సిలర్లు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఇప్పటికే టిడిపి పార్టీకు వైకాపా కౌన్సిలర్లతో కలిపి మొత్తం 12 మంది మద్దతుగా ఉన్నారు. వీరితోపాటు మరొకఇద్దరు మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఓటు కూడా ఉండటంతో మొత్తం 15 మంది తెలుగుదేశం పార్టీకు మద్దతు ఇచ్చారు . గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో ఆర్డీఓ ఆనందకుమార్ ప్రిసైడింగ్ అధికారిగా అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగింది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ ఛైర్మన్ పదవి 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజుకు దక్కనున్నట్లు తెలిసింది.ఈ అవిశ్వాస తీర్మానంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు నరసింహరాజు , వైస్ చైర్మన్ వెంకట లక్ష్మమ్మ ,సుభద్ర నాగేంద్ర , ఉమా శంకర్ , ప్రియాంక ,పార్వతి , సుజాత , శ్రీనివాసులు,ప్రభావతి, సుధాకర్ నాయక్ , సీనప్ప , లక్ష్మయ్య, సిద్ధప్ప , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంక్షేమం, భద్రతలకు చర్యలు


సమావేశంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**జగ్గయ్యపేట, మే 15, ప్రభాతవార్త :** నానాటికి న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, సవాళ్ళను అధిగమించేందుకు, న్యాయవాదుల సంక్షేమం-భద్రతలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు గవర్నర్‌కు విజ్ఞప్తిచేశారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఈమేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాద పూరకంగా కలుసుకుని న్యాయవాదుల సంక్షేమం-భద్రతల కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించటంపట్ల తమ సంఘీభావం వ్యక్తంచేశారు. బార్ అధ్యక్షులు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి క్లిష్టంగా మారిందని, సవాళ్ళు, అభద్రత పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం మంజూరు చేయాల్సిన మిత్ర ఉపకార వేతనం అందక జూనియర్లు జీవనోపాధి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాగా సమావేశంలో బార్ ప్రతినిధులు శ్యామల నరసింహారెడ్డి, రాయపూడి శ్రీనివాసరావు, చావా రవి, వి మధు, వై రాజేంద్రప్రసాదు, జి శ్రీనివాసగౌడ్, ఎం వీరాంజనేయులు, రావూరి ప్రసాదు, ఏ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# రైల్వేలో ఆపరేషన్ సిందూర్ తిరంగా ర్యాలీ

**గుంతకల్లు రైల్వే,మే 15,ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో గురువారం తిరంగ ర్యాలీ జరిగింది. స్థానిక డిఆర్ఎం కార్యాలయం నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ ప్రభాత్‌నగర్, బోలూ సర్కిల్,జంక్షన్ సర్కిల్ మీదుగా రైల్వేస్టేషన్ వరకు సాగింది. కార్యక్రమంలో డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా తదితరులు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా తిరంగ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వ పటిమ,త్రివిధ దళాల పరాక్రమాన్ని ప్రజలకు వివరించాలనే ఉద్దేశ్యంతో ఈ విజయోత్సవ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మన దేశ సమైక్యను అలాగే ఆర్మీకి మన మద్దతు సంపూర్ణ తెలిపే విధంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డిఎస్‌సిటి మురళీక్రిష్ణ,ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆటోలో వెళుతూ జారిపడి వ్యక్తి మృతి

**కావలిరూరల్,(నెల్లూరు) మే15 ప్రభాతవార్త:** కావలిరూరల్ మండలం కొత్తసత్రం గ్రామానికి చెందిన డోకి రవికుమార్(36) కావలి తుమ్మలపెంట రోడ్డులో ఆటోలో వెళుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందడం జరిగింది. కావలి రూరల్‌పోలీసుల సమాచారం మేరకు మృతుడు డోకి రవికుమార్ వ్యవసాయం చేసుకుంటూ ఆకుకూరలు పండించుకుంటూ కావలిలో అమ్ముకుంటూ జీవనం సాగించేవాడని ఈ క్రమంలో గురువారం ఉదయం కొత్తసత్రం నుండి అదే గ్రామానికి చెందిన అరగల పొట్టెయ్య ఆటోలో కావలికి వస్తుండగా మార్గమద్యంలో జారిపడి తలకు దెబ్బలుతగలగా చికిత్సనిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు ఆటోలో తీసుకురావడం జరిగిందన్నారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారన్నారు. మృతుడు రవికుమార్‌కు భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బుచ్చిలో పంటపొలాల వద్ద వ్యక్తి హత్య

**బుచ్చి (నెల్లూరు), మే 15, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని గోపాలపురం పంటపొలాల వద్ద వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం జరిగింది. ఇన్‌చార్జి కోవూరు సిఐ సుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతు సోము మల్లికార్జున రెడ్డి అనే రైతు పంట పొలాల వద్ద హత్యకు గురై పడి వున్నట్లు ఆయన తెలిపారు. మల్లికార్జునరెడ్డి భార్య పిర్యాదు మేరకు హత్యగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఆయన సోదరుడికి మృతుడికి ఆస్తి విషయంలో వివాదాలు ఉన్నాయని తెలిపారు.అయితే హత్యకు గలకారణాలు ఏమిటి అన్న విషయం అన్ని కోణాలలో పరిశీలిస్తామని అన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డాగ్‌స్క్వాడ్ పరిశీలించింది. మృతుడికి బలమైన గాయం తలకు తగిలినట్లు పోలీసులు గుర్తించారు.


దాతకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం,వెండిపాత్రలను అధికారులకందిస్తున్న పూర్వ కృష్ణ జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం దంపతులు

# దుర్గమ్మవారి ఆలయంలో నేడు శ్రీ గణేశ హోమం

**ఇంద్రకీలాద్రి, మే 15, ప్రభాతవార్త:** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో సంకటహర చతుర్ది సందర్భంగా శుక్రవారం నాడు శ్రీ గణపతి హోమం నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు జరిగే ఈ ఆర్జిత సేవలో భక్తులు పాల్గొనవచ్చన్నారు.

**దుర్గమ్మకు 5 వెండి గిన్నెల బహుకరణ:** దుర్గమ్మవారికి పూర్వపు కృష్ణా జిల్లా కలెక్టర్ బి లక్ష్మి కాంతం దంపతులు గురువారం 2కెజిల 28 గ్రాముల బరువైన 5 వెండిగిన్నెలను బహుకరించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారి సేవలో హోంమత్రి :** దుర్గమ్మవారిని గురువారం నాడు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఈఓ వికె శీనా నాయక్ దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**నిత్యాన్నదానానికి విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్షను విరాళంగా హిందూపూర్‌కు చెందిన బి నవీన్ ఇఒ వికె శీనా నాయక్‌కు గురువారం అందించారు. అలాగే విజయవాడకు చెందిన శీలం సాయి ఫణీంద్ర గురువారం రు.1లక్ష 1వెయి 116లను విరాళంగా ఆలయాధికారులకు అందించారు. దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు.




# ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టారు

## విదేశీ వనితల కాళ్లు కడిగించడం ఏమిటి?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 15,ప్రభాతవార్త:** తెలంగాణఆత్మగౌరవాన్ని, మన ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టారంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ఆడపడుచులతో విదేశీ వనితల కాళ్లు కడిగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచదేశాల ముందు తెలంగాణ ఆత్మగౌరవాన్ని పెంచాల్సింది పోయి, వారి ముందు మన ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టేట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. 72వ మిస్‌వరల్డ్ పోటీల్లో భాగంగా కల్చరల్, స్పిరిచువల్‌టూర్‌లో పాల్గొనేందుకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ అయిన రామప్ప దేవాలయానికి ప్రపంచ అందగత్తెలు వచ్చిన సందర్భంలో విదేశీ వనితల కాళ్లను తెలంగాణ మహిళలతో, దళిత, గిరిజన యువతులతో కడిగించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహంకారానికి నిదర్శనం అన్నారు. మహిళా సాధికారతకు, మహిళల ధైర్యసాహసాలకు ప్రతీక అయిన రాణి రుద్రమదేవి ఏలిన గడ్డపై, చారిత్రక రామప్ప ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మహిళలను అవమానించడం దురదృష్టకరం అన్నారు. సమ్మక్క, సారలమ్మ పుట్టిన గడ్డపై మహిళలకు అత్యంత తీవ్రమైన అవమానం జరిగిందన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటుగా రేవంత్‌రెడ్డి భారతీయ మహిళలకు, తెలంగాణ మహిళా సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# మతాన్ని రాజకీయాల కోసం వాడుకోవద్దు: తెలంగాణ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త :** మతాన్ని రాజకీయాలకు వాడుకోవదని, మానవత్వంతో కూడిన మతాన్ని ప్రజలు ఇష్టపడతారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్ దహించు అగ్ని మినిసీస్ ఆధ్వర్యంలో పరిశుద్ధాత్మ అగ్ని సదస్సులు పేరుతో జరుగుతున్న యూత్ మీటింగ్స్‌కు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మతానికి మానవత్వం జోడిస్తేనే లోక కల్యాణం అవుతుందన్నారు. మతాలు వేరైనా, దేవుళ్లు వేరైనా ఎవరి విశ్వాసాలు వారివని ఎవరి విశ్వాసాలను వారు నమ్ముతూ సాటి మనిషిని ప్రేమించాలన్నారు. మనదేశం లౌకిక రాజ్యాంగంగా పెదలు నిర్మించారని, ఇక్కడ అన్ని మతాల పట్ల సమాన గౌరవం ఉంటుందన్నారు. మత సంస్థలు మత ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజల సౌఖ్యం, ఆరోగ్యం కోసం పాటు పడాలని మనం చేసే సేవ వెయ్యేండ్లు ప్రజలు గుర్తు పెటుకోవాలని ఆమె సూచించారు. మినిసీస్ వ్యవస్థాపకులు బిషప్ డాకర్ థామస్ మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలో సంఘాలతో కేవలం యేసు క్రీసు సువార్తనే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పేదలకు అన్నదానం, వితంతువులకు కుటు శిక్షణ, కుటు మిషన్ల పంపిణీ, అనాథ పిల్లలకు ఉచిత విద్య, యువతులకు వివాహాలు జరిపిస్తామన్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఈ సదస్సులు జరుగుతాయని చెప్పారు.



16-05pg10exHMNWJQET.qxd:16-05pg10exHMNWJQET.qxd  01/01/01  8:45 AM  Page 1



# హ్యాండిచ్చేది ఎవరు?

## అసలు వస్తారా.. లేదా?

## ఐపిఎల్ ఫ్రాంచైజీల మైండ్ బ్లాక్



**న్యూఢిల్లీ:** అర్ధంతరంగా వాయిదా తర్వాత ఐపీఎల్-2025 సీజన్ 18 టోర్నమెంట్ తిరిగి మరో 36 గంటల్లో ట్రాక్‌లోకి వస్తోంది. కానీ తదుపరి పరిణామాలతో ఫ్రాంచైజీలకు సవాళ్లు కూడా పెరిగాయి. ఐపీఎల్‌ను వారం పాటు నిలిపివేయడం వల్ల దాదాపు అందరు విదేశీ ఆటగాళ్ళు తమతమ దేశాలకు వెళ్లిపోయారు. కొంత మంది ఆటగాళ్ళు మాత్రం భారత్‌లోనే ఉన్నారు. భారత్‌వర్సెస్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత ప్రస్తుతానికి తగ్గింది. దీంతో ఐపీఎల్ తిరిగి ఈ నెల 17 నుండి స్టాట్ కానుంది. తమ స్వస్థలాలకు వెళ్లిన విదేశీ ప్లేయర్లలో కొందరు తిరిగి వస్తున్నారు. కొందరు తిరిగి రావడం లేదు. మరికొందరు ప్లేఆఫ్స్‌లో ఆడేందుకు సుముఖత కనపరచడం లేదు. ఈ నేపథ్యంలో ఏం చేయడానికి ఫ్రాంచైజీలకు తోచడం లేదు. ప్రధానంగా ఆస్ట్రేలియా వచ్చే నెలలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడాల్సి ఉంది. దీని కారణంగా మిచెల్ స్టార్క్ (ఢిల్లీ), జోష్ హాజిల్‌వుడ్ (బెంగళూరు) తిరిగి రావడం లేదు. కానీ, కెప్టెన్ పాట్ కమ్మిన్స్, ట్రావిస్ హెడ్ ఇద్దరూ సన్ రైజర్స్ హైదరాబాద్‌లో చేరుతున్నారు. జోష్ ఇంగ్లిస్, మార్కస్ స్టోయినిస్, ఆరోన్ హార్డీ విషయంలో పరిస్థితి స్పష్టంగా లేదు. జేవియర్ బార్ట్‌లెట్, మిచ్ ఓవెన్ రానున్నారు. టిమ్ డేవిడ్ (బెంగళూరు) కూడా తిరిగి వస్తాడని భావిస్తున్నారు. ఇక ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ లు 29 నుంచి మొదలవుతుండగా, అదే రోజు నుండి ఇంగ్లాండ్- వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. జోస్ బట్లర్ (గుజరాత్), జాకబ్ బెథెల్ (బెంగుళూరు), విల్ జాక్స్ (ముంబై) భారత్‌కు తిరిగి వస్తున్నారు. కానీ, ప్లేఆఫ్‌లకు ముందు వన్డే సిరీస్ కోసం తిరిగి రానున్నారు. లియామ్ లివింగ్‌స్టోన్ (బెంగుళూరు) జట్టులో చేరినా, అదే టీమ్‌లో ఉన్న ఫిల్ సాల్ట్ రాకపై స్పష్టత లేదు. కాగా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఉన్న దక్షిణాఫ్రికా నుంచి ఐపీఎల్‌లో ఆడుతున్న 8 మందిని 25 లోగా తిరిగి రావాలని కోరారు. కగిసోరబాడ (గుజరాత్)ఇప్పటికే అహ్మదా బాద్‌లో ఉన్నాడు. మార్కో జాన్సెన్ (పంజాబ్), లుంగి న్గిడి (బెంగు ళూరు) వారి వారి జట్లకు తిరిగి వస్తున్నప్పటికీ, వారు ప్లేఆఫ్‌లు ఆడతారో లేదో తెలియదు. ఐడెన్ మార్క్రామ్ (లక్నో), ర్యాన్ రికెల్టన్, కార్బిన్ బాష్ (ముంబై), వియాన్ ముల్డర్ (హైదరాబాద్), ట్రిస్టన్ స్టబ్స్ (ఢిల్లీ క్యాపిటల్) విషయంలో గందరగోళం ఏర్పడింది. క్వింటన్ డి కాక్ (కోల్‌కతా నైట్ రైడర్స్) తిరిగి వస్తున్నప్పటికీ, డేవిడ్ మిల్లర్, మాథ్యూ బ్రీట్జ్కే (లక్నో) అనుమానమే. వెస్టిండీస్‌కు సంబంధించి ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ ఆడాలి. రొమారియో షెపర్డ్ తిరిగి ఆర్‌సీబీకి వచ్చినా ప్లేఆఫ్‌లకు స్పష్టత లేదు. వీరితో పాటు, జట్టులో ఎంపికైన షర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (గుజరాత్), షమర్ జోసెఫ్ (లక్నో) కూడా జట్టులో చేరవచ్చు. శ్రీలంకకు చెందిన మహీష్ తీక్షణ (రాజస్థాన్) గాయంతో ఆడటం కష్టం.

## సూపర్-500 బ్యాడ్మింటన్‌లో..

# ప్రిక్వార్టర్ ఫైనల్లోకి గాయత్రి-ట్రెసా




**న్యూఢిల్లీ:** సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల డబుల్స్‌లో భారత్‌కు చెందిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అయితే రష్మి-సానియా సికిందర్, సెల్వం కవిప్రియ-సిక్రమన్ సింఘి జంటలు తొలి రౌండ్‌లో నిష్క్రమించాయి. గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 21-13తో మలేషియా జంట జిన్‌యె-కార్మెన్ టింగ్‌ను ఓడించింది. అలాగే రష్మి-సానియా 11-21, 5-21తో మలేషియాకు చెందిన టాన్ పియర్లీ-థీనా చేతిలో ఓటిపోయింది. ఇక కవిప్రియ-స్మిన్ 17-21, 17-21తో థాయ్‌లాండ్‌కు చెందిన బెన్ యాపా-నుంతాకర్న్ చేతిలో పరాజయం పాలయింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత్ జంట పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-సాయి ప్రతీక్ 20-22, 21-17, 18-21తో మలేషియాకు చెందిన ఆరిఫ్ జునైది-రాయ్ కింగ్ జోడీ చేతిలో ఓటమిపాలైంది. కాగా మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టగా, రక్షిత శ్రీ, అనుపమ తొలి రౌండ్‌లో ఓడిపోయారు. ఉన్నతి 21-14, 18-21, 23-21తో థాయ్‌లాండ్‌కు చెందిన థమోన్‌వన్‌పై, ఆకర్షి 21-16, 20-22, 22-20తో జపాన్‌కు చెందిన కవోరు నుగియామపై, మళవిక 21-12, 13-21, 21-17తో తుర్కియేకు చెందిన నెస్లిహాన్ అరిన్‌పై విజయం సాధించారు. ఇక రక్షిత శ్రీ 18-21, 7-21తో ఇండోనేషియాకు చెందిన యో జియా మిన్ చేతిలో, అనుపమ 11-21, 9-21తో థాయ్‌లాండ్‌కు చెందిన ఇంతనోన్ రచనోక్ చేతిలో ఓటమి చవిచూశారు.



## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో..

# తెలంగాణ ప్లేయర్ల హవా

### రిశిత, నిశికకు రెండు స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్ల హవా దిగ్విజయంగా కొనసాగుతున్నది. బీహార్‌లోని గయలో జరుగుతున్న వేర్వేరు ఈవెంట్లలో మన రాష్ట్ర ప్లేయర్లు సత్తాచాటారు. మహిళల సింగిల్స్ ఫైనల్లో రిశితారెడ్డి 6-1, 2-6, 6-3తో ఐశ్వర్య జాదవ్ (మహారాష్ట్ర)పై విజయంతో పసిడి దక్కించుకుంది. డబుల్స్ తుది పోరులో రిశిత, లక్షిశ్రీ సిరితో కలిసి రజతం కైవసం చేసుకుంది. ఈ మధ్య నిలకడగా రాణిస్తున్న రిశిత ప్రస్తుతం జూనియర్ ఐటీఎఫ్ విభాగంలో తెలంగాణలో నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతున్నది. దేశ వ్యాప్త ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 3వ ర్యాంక్‌లో ఉన్న రిశిత..అంతర్జాతీయంగా 177వ ర్యాంక్‌లో ఉంది. అలాగు మహిళల జిమ్నాస్టిక్స్‌లో నిశిక అగర్వాల్ స్వర్ణం సహా రెండు కాంస్య పతకాలతో అదరగొట్టింది. టెన్నిస్‌లో బసిరెడ్డి రిశితారెడ్డి స్వర్ణం, రజతం ఖాతాలో వేసుకోగా, లక్షిశ్రీ సిరికి కాంస్యం దక్కింది. మహిళల ఫెన్సింగ్‌లో హురెన్ అదీబా కాంస్యం సొంతం చేసుకుంది. జిమ్నాస్టిక్స్ వాల్టింగ్ టేబుల్ ఈవెంట్‌లో నిశిక 12.33 పాయింట్లతో పసిడి పతకంతో మెరిసింది. అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తూ అగ్రస్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో అనౌష్క పాటిల్ (12.10), సారా రవూల్ (11.70) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అదే జోరు కొనసాగిస్తూ అన్‌ఈవెన్ బార్స్‌లో నిశిక 9.700 స్కోరుతో కాంస్యం ఖాతాలో వేసుకోగా, బాలెన్సింగ్ బీమ్‌లో మరో కాంస్యం లభించింది.




## థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టోర్నీలో..

# తెలంగాణ ప్లేయర్ తరుణ్ సంచలనం

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్ మన్నేపల్లి తరుణ్ సంచలనం సృష్టించాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ డ్రాలో అడుగు పెట్టిన తరుణ్ తొలి రౌండ్‌లోనే ప్రపంచ 45వ ర్యాంకర్, మలేషియాకు చెందిన జస్టిన్ హోపై గెలుపొంది



ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. 48 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వరల్డ్ 53వ ర్యాంకర్ తరుణ్ 21-16, 21-19తో హో ఆట కట్టించాడు. క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్‌లో ప్రపంచ మాజీ నంబర్ వన్, భారత్‌కు చెందిన కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించిన తరుణ్ అదే జోరును మెయిన్ డ్రాలోనూ కొనసాగించాడు. తొలి గేమ్‌లో ఒక దశలో 8-11తో వెనుకబడిన అతడు ఆ తర్వాత ఒక్కసారిగా చెలరేగి వరుసగా 7 పాయింట్లు గెలిచి 15-11తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే దూకుడుతో తొలి గేమ్‌ను దక్కించుకున్నాడు. వరుసగా 3 పాయింట్లు నెగ్గి రెండో గేమ్‌ను ఆరంభించాడు. ఒక దశలో హో 15-16 ఆధిక్యాన్ని ఒక పాయింట్‌కు తగ్గించాడు. ఇదే సమయంలో 2 పాయింట్లు గెలిచి 18-15తో ముందంజ వేసిన తరుణ్ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. కాగా పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాలో నేరుగా పోటీపడ్డ భారత్ ప్లేయర్లు లక్ష్యసేన్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. లక్ష్యసేన్ 18-21, 21-9. 17-21తో ఇంగ్లండ్‌కు చెందిన ఎన్‌హాట్ నుగుయెన్ చేతిలో, ప్రియాన్షు 13-21, 21-17, 16-21తో ఇండోనేషియా ప్లేయర్ అల్వీ ఫర్హాన్ చేతిలో పోరాడి ఓటమి చెందారు.

## ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో..

# పాకిస్థాన్‌కు నో ఛాన్స్!

### దానిస్థానంలో మలేసియా

**న్యూఢిల్లీ:** దాయాది దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో ఆ దేశంతో క్రమంగా సంబంధాలు తెంపుకుంటున్న భారత్ క్రీడల్లోనూ అదే వైఖరిని కొనసాగిస్తోంది. ఇప్పటికే ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు దెబ్బతినగా, ఈ ఏడాది ఆగస్టు నుంచి బీహార్ (రాజ్‌గిర్) వేదికగా జరగాల్సి ఉన్న పురుషుల ఆసియా కప్ హాకీలో పాక్ పాల్గొనడంపై సందిగ్ధత నెలకొంది. భారత్‌లో జరిగే ఈ హాకీ టోర్నమెంట్ ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 07 వరకూ 12వ ఎడిషన్‌గా జరగనుంది. ఈ టోర్నీలో ఆతిథ్య భారత్‌తో పాటు జపాన్, కొరియా, చైనా, మలేషియా, ఒమన్, చైనీస్ తైపీ, పాకిస్థాన్ పాల్గొనాల్సి ఉంది. వచ్చే ఏడాది నెదర్లాండ్స్, బెల్జియంలో జరిగే హాకీ ప్రపంచకప్‌నకు ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీ కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో పాక్‌ను ఆసియా కప్ ఆడేందుకు అనుమతిస్తారా? లేదా? అన్న దానిపై అనిశ్చితి నెలకొంది. ప్రస్తు పరిస్థితుల్లో పాకిస్థాన్ హాకీ జట్టును కేంద్ర ప్రభుత్వం అనుమతించే అవకాశాలు లేవు. దీనిపై హాకీ ఇండియా కేంద్రాన్ని సలహా కోరగా, అక్కడ నుండి ఎటువంటి స్పందన రాలేదు. భారత్‌లో జరిగే ఈ టోర్నీ కోసం పాకిస్థాన్‌ను అనుమతించకపోవడం గతంలోనూ జరిగింది. 2016లో పఠాన్‌కోట్‌లో భారత్ ఎయిర్‌బేస్‌పై ఉగ్రదాడి జరగడంతో ఆ ఏడాది జరిగిన జూనియర్ ప్రపంచ కప్ హాకీలో పాక్‌కు అనుమతి లభించ లేదు. ఆసియా టోర్నీలో పాక్ స్థానంలో మలేషియాను ఆడించే అవకాశం ఉంది. ఈ టోర్నీలో ఐదుసార్లు విజేత అయిన దక్షిణ కొరియా డిఫెండింగ్ ఛాంపియన్ హోదాతో బరిలోకి దిగుతుంది. కొరియా తర్వాత దాయాది దేశాలు చెరో నాలుగుసార్లు ఆసియా కప్‌ను గెలిచాయి.



# యుఎస్ వస్తువులపై జీరో టారిఫ్‌కు ఇండియా ఓకే!: ట్రంప్

**న్యూఢిల్లీ, మే 15:** అమెరికాతో కొత్త వాణిజ్య ఒప్పం దాన్ని కుదుర్చుకునే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా వస్తువులపై సుంకాలను సున్నాకి తగ్గించడానికి భారతదేశం ముందు కొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, దీనిపై భారత ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన చేయ లేదు. ట్రంప్ తన మిడ్‌ఈస్ట్ పర్యటనలో ఖతార్‌లోని దోహాలో జరిగిన వ్యాపార రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మొదట ఆపిల్ తన ఐఫోన్ కోసం తయారీ ప్లాంట్లను ఎక్కడ నిర్మించాలనే ప్రణాళికలను చర్చించారు. కాగా కొన్ని వారాల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇండియా నుండి దిగుమతి చేసుకునే అన్ని వస్తువులపై 26 శాతం పరస్పర సుంకాన్ని ప్రకటించారు. ఉక్కు, అల్యూమినియంపై అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా కొన్ని అమెరికన్ ఉత్పత్తులపై ప్రతీకార దిగుమతి సుంకాన్ని విధించాలని భారత ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఈ చర్య రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం జరుగుతున్న చర్చలపై నీలినీడలు పడే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియే టివ్ భావిస్తోంది. ఈ విషయంపై అమెరికా భారత్‌తో సంప్రదింపులు జరిపినా లేదా సుంకాలను ఉపసంహరించుకున్నా ఒక తీర్మానం రావచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ తెలిపింది. లేకపోతే, ఇండియా ప్రతీకార దిగుమతి సుంకాలు జూన్ ప్రారంభంలో అమల్లోకి రావచ్చు. ఇది అమెరికా ఎగుమతిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



# భారీ లాభాల్లో స్టాక్ సూచీలు

**ముంబై, మే 15:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేప థ్యంలో ఉదయం నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారి గా దూసుకెళ్లాయి. అమెరికా భారత్ మధ్య ట్రేడ్ డీల్‌పై డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు స్వల్పంగా లాభపడ్డాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 85వేలు దాటగా, నిఫ్టీ 25వేల మార్కు అందుకుంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 81,354.43 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 82,718.14 పాయింట్లవద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1200 పాయింట్ల లాభంతో 82,530.74 వద్ద స్థిరపడిం ది. నిఫ్టీ 394 పాయింట్లు లాభంతో 25061 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.52గా ఉంది. ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3177 డాలర్ల వద్ద కొనసాగింది.


## బ్యాంకు నామినీ వివరాల్లో ఇ-మెయిల్, ఫోన్ నంబర్!

**ముంబై, మే 15:** బ్యాంకు డిపాజిటర్ల ప్రయోజనాలను కాపా డేందుకు మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధమవు తోంది. నామినీ ఫారాల్లో నామినీల పేర్లతో పాటు ఇమెయిల్, వారి ఫోన్ నంబర్ వంటి వివరాలనూ జోడించాలని భావి స్తోంది. దీనిపై బ్యాంకులు, ప్రభుత్వం నుంచి అభిప్రాయా లను కోరుతోంది. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల సంఖ్యను తగ్గించే ఉద్దేశంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. బ్యాంకు ఖాతా దారులు ఒక్కో ఖాతాకు నలుగురిని నామినీలుగా నియమించుకునే అవకాశం కల్పించే బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు 2024కు ఇటీవల పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం నగదు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల సమయంలో నామినేషన్ వివరాలను తెలియ జేయాల్సి ఉంటుంది. ఇలా నామినీ వివరాల సేకరణ సమయంలో వారి ఫోన్ నంబర్, ఇమెయిల్ వివరాలు కూడా సేకరిం చాలని ఆర్‌బీఐభావిస్తోంది. ఇందుకోసం బ్యాంకింగ్ కంపెనీస్ (నామినేషన్) రూల్స్, 1985ను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఆర్థికరంగంలో ముఖ్యం గా బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను తగ్గించే ఉద్దేశంతో ఆర్‌బీఐ ఆ దిశగా వివరాలు సేకరించాలని భావిస్తోందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఓ వ్యక్తి ఎకనమిక్ టైమ్స్‌కు వెల్లడించారు. నామినీ చిరునామా, అకౌంట్ హోల్డర్ వివరాలు మారినా నామినీలవివరాలు సేకరించడం ద్వారా సమాచారం చేరవేయడం సాధ్యమవు తుందని తెలిపారు.

# వాణిజ్యం

## ట్రంప్‌తో ముఖేష్ అంబానీ భేటీ

**దోహా, మే 15:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆసియా అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ భేటీ అయ్యారు. అరబ్ దేశాల పర్యటనలో ఉన్న ట్రంప్.. ఖతార్ చేరుకున్నారు. అగ్రరాజ్యాధినేత కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రభుత్వ విందు ఏర్పాటుచేశారు. ఈ విందుకు ముకేశ్ అంబానీ కూడా హాజరయ్యారు. ఈసందర్భంగా ట్రంప్‌తో ఆయన సమావేశమయ్యారు. విందుకు హాజరైన అంబానీని ట్రంప్, ఖతార్ ఎమిర్ సాదరంగా ఆహ్వానించారు. ఇక, రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం ట్రంప్‌ను అంబానీ కలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో 100 మందికి ఇచ్చిన ప్రత్యేకవిందులో నీతాముకేశ్ అంబానీ పాల్గొన్న సంగతి తెలిసిందే. కాగా అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలతో రిలయన్స్ వ్యాపారాలకు కనెక్షన్ ఉంది. గతేడాది వెనెజువెలా నుంచి ముడి చమురు దిగుమతిని పునః ప్రారంభించడానికి



అమెరికా నుంచి రిలయన్స్ మినహాయింపులు పొందింది. అయితే వెనెజువెలా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 25 టారిఫ్‌ను ట్రంప్ విధించడంతో ఆదిగుమతి ఆగిపోయింది. రష్యా నుంచి ముడిచమురును రిలయన్స్ దిగుమతి చేసుకొని, పెట్రోలు వంటి ఇంధనాలు తయారు చేసివాటిని అమెరికాకు విక్రయిస్తోంది. గూగుల్, మెటా వంటి అమెరికా దిగ్గజాలకు రిలయన్స్ జియోలో వాటాలున్నాయి. ఖతార్‌తోనూ రిలయన్స్‌కు వ్యాపార సంబంధాలున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్‌అంబానీ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విందుకు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా హాజరయ్యారు. అయితే, ఆయన 30 నిమిషాలు ఆలస్యంగా వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, న్యూస్‌మ్యాక్స్ వ్యవస్థాపకుడు క్రిస్ రూడీ, బ్లాక్‌స్టోన్ సీఈఓ స్టీఫెన్ తదితర వ్యాపార ప్రముఖులు ఈ విందులో పాల్గొన్నారు.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14